ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 295 పేజీలు: 12 వెల: 6.50

# 3 కొత్త జిల్లాలకు పచ్చజెండా

## త్వరలో పోలవరం, మార్కాపురం, మదనపల్లె ఏర్పాటు

### రాష్ట్రంలో 26 నుంచి 29కి పెరగనున్న జిల్లాలు

### కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒక మండలం.. వాసవి పెనుగొండ మండలంగా పేరు మార్పు

### మంత్రుల కమిటీ నివేదికను ఆమోదించిన సిఎం చంద్రబాబు

### కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు, అనంతరం నోటిఫికేషన్



మంగళవారం సచివాలయంలో కొత్తజిల్లాలపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదాన్ని తెలియచేశారు. మార్కాపురం, మదనపల్లె జిల్లాలు, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు సిఎం నిర్ణయించారు. మంత్రులకమిటీ ఇచ్చిన నివేదికపై మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సిఎం ఈ మార్పు చేర్పులకు ఆమోదాన్ని తెలియచేశారు. ఈ నిర్ణయంతో మొత్తంగా రాష్ట్రంలో 29 జిల్లాలు ఏర్పడనున్నాయి. అలాగే కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు కూడా అంగీకారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడు జిల్లాల భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించిన ప్పుడు, జిల్లాకేంద్రం మండల,రెవెన్యూ డిజన్ కార్యా లయాలు ప్రజలందరికి అందుబాటులో ఉండే విధంగా మంత్రివర్గ ఉపసంఘం నివేదికను పరిశీలించిన తరువాత సిఎం చంద్రబాబు ఆమోదించారు.

**పోలవరం జిల్లా**

రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం,గుర్తేడు,అడ్డతీగల,గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి. ఇక చింతూరు డివిజన్‌లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు. రంపచోడవరం కేంద్రంగా కొత్తగా ఏర్పాటయ్యే పోలవరం జిల్లాలో 3.49 లక్షల జనాభా ఉంది.

**మార్కాపురం జిల్లా**

యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కా >>2



రాష్ట్ర పండుగగా

## జగ్గన్నతోట 'ప్రభల తీర్థం'

### -మంత్రి కందుల దుర్గేష్

**రాజోలు, నవంబరు 25, ప్రభాతవార్త:** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే 'జగ్గన్నతోట ప్రభలతీర్థాన్ని' రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సిఎం చంద్రబాబు సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కోనసీమ వాసులు ఈ అంశాన్ని తీసుకువచ్చి వినతి పత్రం అందించగా మంత్రి దుర్గేష్ స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు వారి పెద్ద >>2

నకిలీ మద్యం కేసు:

## పోలీసు కస్టడీకి జోగి రమేష్

**విజయవాడ, నవంబరు 25, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో వైఎస్సార్సీ నేత జోగి రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రేపటి నుంచి 4 రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసులో జోగి రమేష్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు.ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ2గా ఉన్న అద్దేపల్లి జగన్‌మోహన్‌రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే మొదటి నుంచి ఈవ్యవహారం వెనుక జోగి రమేష్ఉన్నారని, ఆయన సమక్షంలో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై అధికారులు ఇప్పటికే అద్దేపల్లి బ్రదర్స్‌ను >>2

## గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారు

### ఇప్పటికే రూ. 100 కోట్లు కేటాయించిన కేంద్రం

**విజయవాడ,నవంబరు 25, ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారయింది. 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు నిర్ణయం తీసుకుంది. కేంద్రం ముందస్తుగానే గోదావరి పుష్కరాల కోసం నిధులు కేటాయింపు జరిపినట్లు సమాచారం. ఇప్పటికే రూ 100 కోట్లను పుష్కరాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా రైల్వే శాఖ పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పన కోసం రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు రూ 271. 43 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రెండేళ్ల తరువాత వచ్చే గోదావరి పుష్కరాలు అత్యంత భద్రత చర్యల మధ్య నిర్వహించేందుకు ఎపి ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. ఘాట్‌ల పటిష్టత, కొత్త ఘాట్‌ల ఏర్పాటు,దేవాలయాల అభివృద్ధి, ప్రాచీన దేవాలయాల జీర్ణోద్ధరణ,పుష్కర యాత్రీకుల బస కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

## 29 నుంచి వాయుగుండం ప్రభావం

**విజయవాడ, నవంబరు 25,ప్రభాతవార్త ప్రతినిధి:** నైరుతి బంగాళఖాతం, దక్షిణ శ్రీలంక సమీపంలో ఉపరితల ఆవర్తనం అల్ప పీడనంగా మారింది. ఈ అల్పపీడనం ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి మరింత బలపడి వాయుగుండంగామారే ఆవకాశం ఉందని విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశాలున్నాయన్నారు. గురువారం నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది దక్షిణ అండమాన్, మలక్కా జలసంధివద్ద ఏర్పడిన ఆల్ప పీడనం వాయుగుండంగా మారింది. అండమాన్ ప్రాంతానికి 750 కిలో >>2



మంగళవారం మంగళగిరి విద్యార్థిని కనకపుట్లమ్మను అభినందిస్తున్న మంత్రి లోకేష్

## ప్రభుత్వ బడుల్లో మరింత నాణ్యత

### నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్

### మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థినిని అభినందించిన మంత్రి లోకేష్

**విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అందరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు గురించి మాట్లాడతారు. కానీ బాధ్యతల గురించి ఎవరూ మాట్లాడరు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యమని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రేపటి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థిని కూర్మాల శ్రీ కనక పుట్లమ్మను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసానికి సదరు విద్యార్థినితో పాటు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. మంగళగిరి బిఆర్ నగర్ లోని మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తర >>2

## పూర్వోదయ నిధులతో రాయల సీమ అభివృద్ధి

### రూ. 40 వేల కోట్లతో సీమరైతుల అభివృద్ధికి కార్యాచరణ

### 50 లక్షల ఎకరాల్లో ఉద్యానసాగు లక్ష్యం: సిఎం చంద్రబాబు



**విజయవాడ,నవంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల్లో 18 రకాల పంటలు రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోనే పండుతాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు.దీన్ని అందిపుచ్చుకునేలా ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పూర్వోదయ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వోదయ స్కీంలో భాగంగా రాయలసీమ ఉద్యాన పంటల అభివృద్ధిపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. రాయల సీమ, ప్రకాశం జిల్లాలో 92 క్లస్టర్ల ద్వారా రైతులకు జీవనోపాధి పెంచేలా కార్యాచరణ రూపొందిం చారు. పూర్వోదయ స్కీమ్‌లో భాగంగా రహదా రులు, జలవనరుల ప్రాజెక్టులు, పంచాయతీ రోడ్లు లాంటి పనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.40 వేల కోట్లతో ప్రణాళిక అమలు చేయనున్నారు. మొత్తం 5.98 లక్షల ఉద్యాన రైతులకు మరింత లబ్ది కలిగేలా ప్రణాళికపై సమీక్షి ంచారు. అలాగే ప్రపంచ బ్యాంకు నిధులతో రాయలసీమ అభివృద్ధికి ఏయే అంశాల్లో దృష్టి సారించాలనే అంశంపై సిఎం చంద్రబాబు చర్చిం చారు. నీతిఆయోగ్ సిఫార్సులతో ఉమ్మడి రాయల సీమ, ప్రకాశం జిల్లాల పరిధిలోని 9 జిల్లాల్లోని హార్టికల్చర్, రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఆర్ అండ్ బి రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్ల వంటి అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దటం లక్ష్యంగా పెట్టుకోవాలి. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. రాయలసీమలో మొత్తంగా 65 రకాల ఉద్యాన పంటలు పండు తుంటే.. డిమాండ్ డ్రివెన్ హార్టికల్చర్ 18 రకాల పంటలకు మంచి డిమాండ్ఉంది. ఈ రకాల పంట లను పండించేలా ఉద్యాన రైతులను ప్రోత్సహిం చాలి. అప్పుడు సీమలో ఉద్యాన పంటల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం సులువుగా ఉంటుంది. దీనికోసం రైతులకు అవసరమైన మౌలిక >>2



మంగళవారం అయోధ్యలో ఆవిష్కృతమైన 'ధర్మధ్వజం'

## అయోధ్యలో ఎగిరిన 'ధర్మధ్వజం'

### సిద్ధించిన రామభక్తుల సంకల్పం: ప్రధాని మోడీ

### కాషాయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రధాని

### ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభం: సిఎం ఆదిత్యనాథ్

**అయోధ్య, నవంబరు 24:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఎంతోకాలంగా వేచి చూస్తున్న రామాలయ ధ్వజారోహణం ఘనంగా జరిగింది. గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్, ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్‌పటేల్, సిఎం యోగి ఆదిత్యనాథ్‌తో >>2



ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

## పత్తి రైతులకు పూర్తి భరోసా

### సిసిఐ నిబంధనల సడలింపులపై కేంద్రంతో చర్చలు వేగవంతం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

### సత్తెనపల్లి, పేరేచెర్ల పత్తి కొనుగోలు కేంద్రాలు పరిశీలన

**సత్తెనపల్లి (పల్నాడు జిల్లా), నవంబరు 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పత్తి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ మంత్రి మంగళవారం పేరేచెర్ల, సత్తెనపల్లిలోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి, రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పత్తి తేమశాతం నమోదుతో పాటు, కొనుగోలు విధానం, యాప్ సమస్యలు, ఎల్1 నుండి ఎల్4 గ్రేడింగ్ సమస్యలపై వివరంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తామని రైతులకు హామీఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు. ప్రతి కిలో పత్తి కొనుగోలు అయ్యేలా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుంది అని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం పత్తి రైతులకు పలు కష్టాలు వర్షాలు, దిగుబడితగ్గడం, సిసిఐ కఠిన నిబంధనలు రూపంలో వచ్చాయని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో 5 లక్షల 40 వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. దాదాపు 8 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అకస్మాత్తుగా కురిసిన వర్షాల వల్ల పత్తి నాణ్యత దెబ్బతింది. దిగుబడి తగ్గిన రైతులకు పైగా సిసిఐ అనేక కఠిన నిబంధనలు పెట్టడం వల్ల తీవ్ర ఇబ్బందులు పెరిగాయి. ముఖ్యంగా కొత్తగా అమలు చేస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4 గ్రేడింగ్ విధానం రైతులకు పెద్ద భారమవుతోంది. పంటే నష్టపోయింది.. దానిపై ఇంకా నిబంధనలు పెట్టడం సరైంది కాదు. రైతులకు అన్యాయం జరగకుండా అన్ని నియమాలను పునఃసమీక్షి ంచాలని కొద్ది రోజుల క్రితమే కేంద్రాన్ని కోరామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వంతో చర్చలు, డిసెంబరు 1 నుండి అదనపు కొనుగోలు కేంద్రాలు**

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పూర్తిగా వివరించారు. కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి, సిసిఐ చైర్మన్, ఎండీతో నేరుగా మాట్లాడి పత్తి >>2

## గోరంట్ల గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

3లో



ప్రజల సమస్యలు వింటున్న జగన్

## అవసరమైతే న్యాయ పోరాటం

### భయపడొద్దు.. నేనున్నా: ప్రజాదర్బార్‌లో జగన్

**పులివెందుల నవంబరు 25 ప్రభాత వార్త :** అధైర్య పడకండి మీకు తోడుగా నేనున్నా, సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమేనని, న్యాయం కోసం పోరాటం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా దర్బారులో వైఎస్సార్సీ శ్రేణులకు తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి హెలిప్యాడ్ దగ్గర కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యులు రామ సుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, వైయస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఘన స్వాగతం పలికారు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి, జిల్లాలోని వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిరునవ్వుతో సమస్యలు వింటూ భరోసా ఇస్తూ**

ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజల, వైఎస్సార్సీ శ్రేణుల సమస్యలను ఓపిగ్గా వింటూ , చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసాఇచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు.



మంగళవారం అయోధ్యలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# ఎగిరిన 'ధర్మధ్వజం'

>> కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆవిష్కరించారు. సీతారాముల కల్యాణం జరిగిన మార్గశిర మాసం శుక్లపంచమిరోజున అభిజిత్ ముహూర్తంలోధ్వజారోహణ కార్యక్రమం జరగడంవిశేషం. రామ్‌లల్లా ఆలయంపై ఏర్పాటుచేసిన కాషాయ ధ్వజం త్రిభుజాకారంలో 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవు ఉంది. జెండాపై ఆధ్యాత్మిక ధ్వనికి ప్రతీకగా 'ఓం' అక్షరాన్ని రాముడి సూర్యవంశ వంశానికి సూచికగా 'సూర్యుడు, కశ్యప మహర్షి మందార, పారిజాత మొక్కలను కలిపి సృష్టించిన 'కోవిదార్ చెట్టు' చిహ్నాలను ఉంచారు. వాల్మీకి రామాయణం అయోధ్య కాండలోనూ ఈ జెండా గురించి ప్రస్తావన ఉందని ప్రముఖ సాంస్కృతిక వ్యవహారాల పరిశోధకుడు లలిత్ మిశ్రా గుర్తించారు. ఆ సమాచారం మేరకే ఈ జెండాను రూపొందించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోగల పారాచ్యూట్ తయారీ సంస్థ ఈ జెండాను తయారుచేసింది. సుదీర్ఘకాలం మన్నేలా పారాచ్యూట్ గ్రేడ్ వస్త్రంతో, పట్టుదారాలతో 25 రోజుల పాటు శ్రమించి దీన్ని తీర్చిదిద్దారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయ్యిందనే దానికి సంకేతంగా ఈ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. గతేడాది జనవరి 22న ఈ ఆలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

**500 యేళ్ల నాటి కల నెరవేరింది: ప్రధాని**

అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ జై శ్రీరామ్ నినాదంతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. శతాబ్దాల గాయాలు, బాధలు నేడు నయమైనట్లు, 500 ఏళ్ల నాటి కల నెరవేరినట్లు తెలిపారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మధ్వజం కేవలం జెండాకాదని.. భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోడీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్రం వచ్చి వందేళ్లు పూర్తవుతాయని అప్పటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలని మోడీ ఆకాంక్షించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. రామజన్మభూమి ఆలయంలో శేషావతార్ మందిరంలో మోడీ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ప్రధాని మోడీ గర్భగుడిలో బాలరాముడికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు అయోధ్యలో ధ్వజారోహణం కొత్త యుగానికి శుభారంభమని యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామభక్తులకు ఇది ఎంతో శుభదినమని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణంతో అయోధ్యకు అనుసంధానం పెరిగిందన్నారు. అయోధ్య బాలరాముడి గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ఎగురవేసిన ప్రధాని మోడీకి, ఉత్తర్‌ప్రదేశ్ ప్రజల తరఫున యోగి అదిత్యనాథ్ అభినందనలు తెలిపారు.

**ప్రపంచానికి శాంతి, శ్రేయస్సును ఇచ్చిన ధ్వజం శిఖరమెక్కింది: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్**

భారతీయుల కల నెరవేరిన రోజు అని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. రామ మందిరం కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఈ నిర్మాణం కోసం ఎంతో మంది ఆశతో ఎదురుచూశారని, వారి సంకల్పం నేటితో నెరవేరిందన్నారు. ప్రపంచానికి శాంతి, శ్రేయస్సును వ్యాపింపజేసిన రామరాజ్య ధ్వజం ఇప్పుడు శిఖరంపై కూర్చుందని అన్నారు. ధ్వజం అనేది ఒక చిహ్నం అని పేర్కొన్నారు.

# కొత్త జిల్లాలకు పచ్చజెండా

>> పురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. మార్కాపురం రెవెన్యూ డివిజన్ లోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, తర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్ లోని హనుమంతుని పాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాల్లో ఉండనున్నాయి. మొత్తం 11.42 లక్షల జనాభాతో ఈ జిల్లా ఏర్పాటు కానుంది.

**మదనపల్లి జిల్లా**

మదనపల్లి, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లోని మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. మదనపల్లి రెవెన్యూ డివిజన్ లోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, తంబళ్లపల్లె, ములకల చెరువు, పెదమండ్యం, కురబలకోట, పీటీ సముద్రం, బీరొంగి కొత్తకోట, చౌడేపల్లె, పుంగనూరు మండలాలు, అలాగే పీలేరు డివిజన్ లోని సదుం, సోమల, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారి పల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాలు ఉండనున్నాయి. మొత్తం 11.05 లక్షల జనాభాతో కొత్త జిల్లా ఏర్పడనుంది.

**రెవెన్యూ డివిజన్లలో మార్పు చేర్పులు**

శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లోని నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేందుకు మంత్రుల కమిటీ చేసిన సిఫార్సుకు ఆమోదం తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావు పేట యలమంచిలి నియోజకవర్గాల్లోని మండలాలతో కొత్తగా నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కాకినాడ డివిజన్‌లోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేసేందుకు ఆమోదం తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, మండలాలను రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలని నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలాన్ని ఇక నుంచి వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్చనున్నారు. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపనున్నారు. దీంతో పాటు అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని మండలాలను కలుపుతూ కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న మర్రిపూడి, పొన్నలూరు మండలాలను కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనంచేయనున్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూర్, సైదాపురంలను తిరుపతి జిల్లా గూడూరు డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యంను చిత్తూరు డివిజన్ లో కలుపనున్నారు. సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ, కేబీ పల్లి, కలికిరి, వాల్మీకిపురం మండలాలతో పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. పలమనేరు డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటంలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కలపనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. కదిరి డివిజన్‌లోని ఆమడగూరు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేయనున్నారు. పుట్టపర్తి డివిజన్ లో ఉన్న గోరంట్ల మండలాన్ని పెనుకొండ డివిజన్‌లో కలపనున్నారు. నంద్యాల జిల్లా డోన్ రెవెన్యూ డివిజన్‌లోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల నంద్యాల డివిజన్‌లోని సంజామల, కొలిమిగుండ్ల మండలాలతో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది.

**తొమ్మిది జిల్లాల్లో ఎలాంటి మార్పులూ లేవు.**

మంత్రుల కమిటీ సిఫార్సులతో కొత్తగా ఏర్పాటు చేసే జిల్లాలు, రెవెన్యూ డివిజన్లతో ప్రస్తుతం ఉన్న 17 జిల్లాల్లో మార్పు చేర్పులు చోటు చేసుకున్నాయి. మిగతా 9 జిల్లాలు విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పలనాడు, అనంతపురం జిల్లాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. మంత్రుల కమిటీ చేసిన ఈ ప్రతిపాదనలు వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రివర్గం ఆమోదం అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ల మార్పు చేర్పులపై అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది.

# పోలీసు కస్టడీకి జోగి రమేష్

>> రెండు సార్లు విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ స్కామ్‌లో జోగి రమేష్ పాత్రపై జనార్దన్ రావు, జగన్‌మోహన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో జోగి రమేష్‌ను 10 రోజుల పాటు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం 4 రోజుల పాటు విచారించేందుకు అనుమతి ఇచ్చింది.

ఎపి లిక్కర్ స్కామ్‌లో జోగి రమేష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఎపి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం గురించి వార్తలను లీక్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం తయారీకి ఆదేశించారని, ఆ సమాచారాన్ని వైఎస్సార్సీ మీడియాకు లీక్ చేశారని అధికారులు నిర్ధారించారు. జోగి రమేష్ సూచనల మేరకే తాము నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్దన్ రావు పోలీసుల ముందు అంగీకరించాడు.



మంగళవారం రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్‌కు వినతపత్రం అందజేస్తున్న దృశ్యం

# జగ్గన్నతోట 'ప్రభల తీర్థం'

>> పండుగగా జరుపు కునే సంక్రాంతిని పురస్కరించుకొని ఏటా లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థ మహోత్సవానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, పర్యాటక మంత్రిగా తాను, సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ తేజస్విని పొడపాటి వేర్వేరు సందర్భాల్లో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సిఎం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సిఎం వెంటనే సమ్మతించారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా కన్నుల పండువగా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారన్నారు. ఎన్నో తరాల నుండి సంప్రదాయంగా వస్తోన్న ఈ ప్రభల తీర్థం జరిగేసమయంలో పండుగ వాతావరణం నెలకొని అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. వీటన్నింటితో పాటు కోనసీమ వాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని, అదే విధంగా ప్రపంచానికి చాటి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# పత్తి రైతులకు పూర్తి భరోసా

>> కొనుగోలు నిబంధనల సడలింపులు చేయాలని కోరినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కేంద్రమంత్రి స్థాయిలో మాట్లాడి, ఒకసారి ప్రభుత్వం ఎంఎస్పీ ప్రకటించిన తర్వాత రైతుకు కొత్త నిబంధనలు పెట్టే అవకాశం ఉండకూడదు అంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మిల్లులతో పాటు అదనంగా మరిన్ని మిల్లులు తక్షణం ఓపెన్ చేయండి అని సిసిఐ ఎండికి కేంద్ర మంత్రి రామ్మోహన్ కోరడంతో కొనుగోలు వేగవంతానికి కేంద్రం అనుమతి ఇచ్చిందని, ప్రతిస్పందనగా సిసిఐ ఎండి నుంచి డిసెంబరు 1 నుంచి అన్ని మిల్లులు పూర్తిగా ఓపెన్ చేస్తాం అన్న హామీ ఇచ్చటినట్లు తెలిపారు. పేరేచెర్ల సెంటర్‌లో ఒక మిల్ అదనంగా, సత్తెనపల్లిలో అన్ని మిల్లులు పూర్తిగా ఓపెన్ కానున్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరం తడిసిన పత్తి కారణంగా తేమ శాతం పెరగడంతో, 12 నుండి 18 వరకు తేమ ఉన్న పత్తిని కూడా సిసిఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు, ప్రతి రైతుకి న్యాయం జరుగుతుందనే పూర్తి హామీ ఇచ్చారు. పత్తి విక్రయం కోసం ఎవరూ ఇబ్బంది పడకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నారు. రైతులు కూడా నాణ్యమైన పంటలు పండించాలి, డిమాండ్ ఉన్న పంటల వైపు ముందుగా ప్రణాళికతో వెళ్లాలి అని సూచించారు.

# 29 నుంచి వాయుగుండం ప్రభావం

>> మీటర్ల దూరంలో ఈ వాయుగుండం కొనసాగుతోంది. రాబోయే రెండురోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, మరింతగా బలపడుతుంది. దీని ప్రభావంతో నవంబరు 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఈ వాయుగుండం మలేసియాలోని జార్జ్‌టౌన్‌కు 70 కి.మీ. దూరంలోనూ, ఇండోనేసియాలోని కుటామక్మూర్‌కు 290 కి.మీ. దూరంలోనూ, అండమాన్ నికోబార్ దీవులకు 750కి.మీ. దూరంలోనూ కేంద్రీకృతమై ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌కు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,నవంబరు25,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో జోగి రమేష్‌తో సహా ఏడుగురు నిందితులకు విజయవాడ ఎక్సైజ్ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. నకిలీ మద్యం కేసులో వైకాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు జోగి రాము,. అద్దేపల్లి జనార్దన్‌రావుతో మరో నలుగురు నిందితు రిమాండ్ మంగళవారంతో ముగిసింది. దాంతో ఇవాళ వారిని విజయవాడ ఎక్సైజ్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దీంతో నిందితుల రిమాండ్‌ను డిసెంబరు 9 వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# రాయల సీమ అభివృద్ధి

>> అనుగుణంగా పంటలు పండించాల్సి ఉంటుంది. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఉత్పత్తి, టేబుల్ వెరైటీలను పండించి ఆ పంటలకు విలువ జోడించాలి. అప్పుడే రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. మైక్రో ఇరిగేషన్‌ద్వారా ఈ ఉద్యాన పంటలకు నీటిని అందించాలి. హార్టికల్చర్ జోన్లుగా తీర్చిదిద్ది ప్రోత్సాహకాలు కల్పించాలి. ఆర్గానిక్ సేద్యం ద్వారా ఉద్యాన పంటలు పండించాలి. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఉద్యాన పంటలు పండిస్తే అది రైతులకు మేలు కలుగుతుంది. ఆక్వా రంగం తరహాలోనే ఉద్యాన రంగం కూడా భవిష్యత్తులో అగ్రస్థానానికి చేరుతుంది. ఈ 9 జిల్లాల పరిధిలో ప్రస్తుతమున్న 10 రకాల ఉద్యాన పంటలతో పాటు...డిమాండ్ ఉన్న మరో 8 పంటలను కూడా పండించేలా చర్యలు తీసుకోండి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అంతర్జాతీయ మార్కెట్‌కు సీమ ఉత్పత్తులు..**

50 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల ద్వారా పెద్ద ఎత్తున రైతులకు ప్రయోజనం కలుగుతుంది. 18 ముఖ్యమైన పంటలను లక్ష్యంగా చేసుకుని వాటికి మంచి సాగు సదుపాయాలు కల్పించటం, రవాణా, లాజిస్టిక్స్, మార్కెటింగ్, కోల్డ్ చైన్‌లాంటి మౌలిక సదుపాయాలుకల్పించాలి. దుబాయ్ లాంటి ప్రాంతాలకు ఎయిర్ కార్గోద్వారా రవాణా చేయగలగాలి. దుబాయ్ నుంచి ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు పండ్లను రవాణా చేసే అవకాశం ఉంటుంది. స్పెషల్ కార్గోగా ఈ పండ్లను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తే రైతులు, ఈ ప్రాంత భవిష్యత్ మారిపోతుంది. రాయలసీమ ప్రాంతంలో ఇంకా కవర్ కానీ గ్యాప్స్‌ను గుర్తించి అక్కడకూ నీటి సరఫరా కోసం ఎంత వ్యయం అవుతుందో అంచనా వేయండి. రాయలసీమకు మంచి రహదారులువచ్చాయి. మారుమూల ప్రాంతాలను కలుపుతూ మరికొన్ని రహదారులు రావాల్సి ఉంది. తద్వారా మార్కెటింగ్ మెరుగుపడుతుంది. ఉద్యాన పంటల సాగు మొదలుకుని మార్కెటింగ్ వరకు వివిధ ప్రాజెక్టులను చేపడుతున్నాం. ఈమేరకు మొత్తంగా రూ.14,800 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఖర్చు పెట్టబోతున్నాం. ఇందులో సబ్సిడీ రూపంలో రూ.9,000 కోట్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఈ విషయం రైతులకు అర్థమయ్యేలా చెప్పాలి. అరటి, చీనీ, బొప్పాయి, దానిమ్మ, మామిడి, ఉల్లి, టమోటా, మిరప, నిమ్మ లాంటి వివిధ ఉద్యాన పంటలపై ఫోకస్ పెట్టాలి"అని సీఎం వివరించారు. ఈ సమీక్షలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల భూగర్భ జలాలు రాయలసీమలో మెరుగ్గా ఉన్నాయనే ప్రస్తావన వచ్చింది. హంద్రీనీవా సహా వివిధ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేస్తుండడం వల్ల సీమలో ఉద్యాన సాగు గతంతో పోల్చుకుంటే సులభతరం అయిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. పంటలు చక్కగా పండడం వల్ల ఓవైపు రైతులకు ఆదాయం రావడంతోపాటు... భూముల రేట్లు పెరిగాయని దానికి తమ ప్రాంతమైన ఉమ్మడి అనంతపుర జిల్లానే ప్రత్యక్ష ఉదాహరణ అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, వ్యవసాయ, హార్టీకల్చర్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మోగిన పంచాయతీ నగారా

## డిసెంబరు 11,14,17 తేదీల్లో ఎన్నికలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు 25**: తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగరా మోగింది. ఈ మేరకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో 564 మండలాల్లో 12,728 సర్పంచ్ స్థానాలకు, 1,12,242 వార్డు స్థానాలకు మొత్తం 3 విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు ఎస్ఈసీ చెప్పారు. పంచాయతీ ఎన్నికలను డిసెంబర్ 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లుగా రాణి కుముదిని వివరించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నియమావళి (కోడ్)అమల్లోకి వస్తుందని రాణి కుముదిని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1 కోటీ.66 లక్షల 55వేల 186 మంది ఉన్నారు. అందులో 81లక్షల 42వేల 231 మంది పురుషులు, 85లక్షల 12వేల 455 మంది మహిళలు, ఇతరులు 500 మంది ఉన్నారు.

# ప్రభుత్వ బడుల్లో మరింత నాణ్యత

>> గతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది.

**నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సిఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరిగింది. నేటి విద్యార్థులే రేపటి మా భవిష్యత్. సిఎం చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ కూడా యువశక్తి గురించి మాట్లాడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషిచేస్తున్నాం. అమ్మకు చెప్పకూడని పనులు చేయకూడదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విలువల విద్యాసదస్సు కార్యక్రమంలో చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తాం. విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులుగా మారాలి. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. ప్రతి ఏడాది స్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహిస్తాం. మిమ్మల్ని చూసి మరో పదిమంది విద్యార్థులు స్ఫూర్తి పొందుతారు" అని మంత్రి అన్నారు. రేపటి మాక్ అసెంబ్లీలో మాకేమైనా సలహాలు, సూచనలు ఇస్తున్నారా అని మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు. రేపటి కార్యక్రమానికి సిఎం, స్పీకర్ హాజరవుతున్నారని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికకావడం పట్ల చాలా ఆనందంగా ఉందని, ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని విద్యార్థిని పేర్కొన్నారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలలో భోజనం బాగుందని తెలిపారు. మంత్రి స్పందిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుచేస్తామని చెప్పారు.

**మంగళగిరి నా కుటుంబంలా మారిపోయింది**

ఈ సందర్భంగా విద్యార్థిని కుటుంబ యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి 11వ వార్డులో నివాసం ఉండే విద్యార్థిని తండ్రి రాము పుట్టుకతో దివ్యాంగుడు. ట్రై స్కూటీపై కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తన ఇద్దరు కుమార్తెలకు తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందిందని, తనకు రూ.6 వేల పెన్షన్ వస్తోందని విద్యార్థిని తండ్రి రాము తెలిపారు. కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. మంగళగిరి తన కుటుంబంలా మారిపోయిందని, మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. విద్యార్థిని శ్రీ కనకపుట్లమ్మ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్‌ను కలవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

26-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
షష్ఠి రా.11.59
శ్రవణ రా.1.30,అనూరాధ కార్తె
వర్జ్యం : తె.5.40-7.20
దు.ఉ.11.33-12.18
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు. వాహనాలు, స్థలాలు, గృహం కొనుగోలు యత్నాలు సాగిస్తారు.

**వృషభం:** ప్రముఖులను కలుసుకుని ముఖ్యమైన విషయాలపై సంప్రదింపులు జరుపుతారు. మీరు చెప్పిందే వేదంగా ఉంటుంది.

**మిథునం:** శత్రువర్గం మరింత విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. నరఘోష అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:** బాధ్యతలు నెరవేర్చి ప్రశంసలు పొందుతారు. విద్యార్థులు అదిక శ్రమను కనబరచ వలసి ఉంటుంది.

**సింహం:** వివాదాలతో కన్నా సామరస్యంగా వ్యవహరించడం వల్లనే పనులు సానుకూల పడతాయి. వాహన యోగం కలదు.

**కన్య:** మరుగున పడిన సమస్యలు ఒక్కొక్కటిగా ముందుకు వస్తాయి. అయితే పరిష్కార మార్గాలు వెనువెంటనే లభిస్తాయి.

**తుల:** దూరప్రాంత ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు. వస్త్రలాభం కలుగుతుంది.

**వృశ్చికం:** కీలకమైన వ్యవహారాలలో తీసుకునే నిర్ణయాలు, పెట్టుబడులు వంటి అంశాలు వాయిదా వేయండి.

**ధనుస్సు:** ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు. వ్యవహారాలలో పురోగతి ఉంటుంది. స్థిరాస్తిని వృద్ధి చేసుకుంటారు.

**మకరం:** ఉద్యోగంలో చికాకులు తొలగుతాయి. కారణం లేకపోయినా మనస్సు మారుమూలలో అప్రశాంతత. కాంట్రాక్టులు చివరిలో దక్కించు కొంటారు.

**కుంభం:** ప్రకటనలు లాభిస్తాయి. ప్రచార మాధ్యమాలకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. ప్రయాణాలు సౌకర్యంగా వుంటుంది.

**మీనం:** ఏదో సాధించాలి! ఎంతో చేయాలనే తపనను కలిగి ఉంటారు. దీర్ఘకాలిక ఋణాలు తీరుతాయి. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కంగుతిన్న కర్రిగుట్టలు!

## 10 వేల మంది భద్రతా బలగాలతో రెండు మూడు నెలలపాటు ఉధృతంగా 'సెర్చ్'

## ఎన్‌కౌంటర్లలో 30 మంది పైగా మృతి

## లొంగిపోయిన కొన్ని డజన్ల మంది

**చర్ల,నవంబరు 25,(ప్రభాతవార్త):** చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన నారాయణపూర్ కాంకేర్ దంతెవాడ బీజాపూర్ సుకుమా జిల్లలో గత నాలుగు దశాబ్దాలుగా ఎదురులేని శక్తుగా ఏకచక్రాదిపత్యంతో అక్కడి ప్రభుత్వంతో పాటు జనతర ప్రభుత్వం ఏర్పాటు సామాంతర పాలన సాగించిన మావోయిస్టులకు నేడు గడ్డు పరిస్థితులు ఎదురౌతున్నాయి. కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ తో మావోయిస్టుల నిర్మూలన చివరి అంఖానికి చేరిందని చెప్పవచ్చు గత రెండేళ్ల కాలంలో మావోయిస్టుల ఏరివేతకు ప్రణాళికా బద్దంగా అడుగులు వేసింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాలలో ప్రతి మూడు కిలోమీటర్ల కు ఫార్వడింగ్ ఆపరేషన్ బేస్ (ఎఫ్ ఓ బి)లను ఏర్పాటు చేసారు. ఆయా క్యాంపుల ద్వారా నిత్యం సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతలైన అబూజ్ మఢ్ నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలో వరుస సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. మరోవైపు తెలంగాణా సరిహద్దు ప్రాంతాలలో బేస్‌ల ఏర్పాటు చేసి మావోయిస్టులపై ముప్పేట దాడిచేసారు. ఈ క్రమంలో వరుస ఎన్ కౌంటర్లు జరిగి అనేక మంది మావోయిస్టు కేంద్రకమిటి సభ్యులు అగ్రనేతలు మృతిచెందారు. ఉద్యమాన్ని నడిపించే ముఖ్యనేత నంబాల వంటి నాయకులు మృతిచెందారు. ఇక ఒకే ఒక్క షెల్టర్ జోన్ గా ఉన్న కర్రిగుట్టల్లో మావోయిస్టు నేతలు కేడర్ తలదాచుకోవాల్సిన పరిస్దితులు ఉత్పన్న అవ్వడంతో ఆపరేషన్ కర్రిగుట్టలు చేపట్టారు. ఆపరేషన్ కర్రిగుట్టలుమావోయిస్టులే లక్షంగా చేసుకొని కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. కర్రిగుట్టలను టార్గట్ చేసి సిఆర్ పిఎఫ్ కోబ్రా డిఆర్జీ ఎస్టీఎఫ్ బలగాలు సూమారు మూడు రెండునెలలపాటు 10 వేల మంది భద్రతా బలగాలతో భారీ ఆపరేషన్ చేపట్టింది.

కర్రిగుట్టలు 280 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం చత్తీస్‌గఢ్ తెలంగాణ రాష్రాలలో విస్తరించి ఉండటం నిటారైన గుట్టల్లో సెర్చ్ ఆపరేషన్ పెద్ద సవాల్‌గా మారింది. ఆపరేషన్ జరిగిన రెండు నెలలపాటు హెలికాప్టర్లు డ్రోన్లు థర్మల్ ఇమేజింగ్ వంటి అత్యాధుని పద్దతిలో నిఘా ఉంచి ఆపరేషన్ నిర్వహించారు. ఆ ఆపరేషన్ వేసవికాలం కావడంతో అక్కడ కూబింగ్ భద్రతా బలహాలకు సవాల్ గా మారింది. ఎంతో మంది అనార్యంపాలైనా సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు. ఎన్ కౌంటర్లో ముప్ఫైకి పైగా మావోయిస్టులు మృతిచెందారు. ఆపరేషన్ కొనసాగుతుండగానే పాకిస్తాన్ పై ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం దీంతో కర్రిగుట్టల్లో ఉన్న భద్రతా బలగాలను వెనక్కి రప్పించింది. దీని వలన మావోయిస్టులకు కొంత ఉపశమనం కలిగింది. కర్రిగుట్టల్లోని గుహల్లో దాగి ఉన్న నక్సల్స్ ఇక మనుగడ కష్టతరం అని భావించి లొజగుబాటు ఉపక్రమిజచారు. మరికొందరు అనేక ధఫల్లో జరిగిన ఎన్ కౌంటర్లలో మృతిచెందగా కేంద్ర కమిటి సభ్యులు ఆశన్న మల్లోజులు రాష్ట్ర కమిటి సభ్యులు చంద్రన్న బండి ప్రకాష్ ఆజాద్ మరికొందరు ముఖ్యనేతలు వివిధ కేడర్లకు చెందిన నాయకులు సభ్యులు భారీగా లొంగిపోయారు. అయితే ఆపరేషన్ కర్రిగుట్టల సమయంలో అక్కడ బేస్ క్యాంపుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాధ్యపడలేదు.

వర్షాకాలంలోను సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు సత్ఫలితాలు సాదించారు. కర్రిగుట్టలను షెల్డర్ జోన్ ఏర్పాటు చేసుకొని మరికొంత మంది మావోయి స్టులు ఉన్నారని వారిని సైతం కట్టడి చేసేందుకు నూతనంగా రెండు బేస్‌ల నిర్మాణం చేపట్టగా నూతనంగా వాజేడులో మరోబేస్‌ను ఏర్పాటుచేసింది కేంద్ర ప్రభుత్వం ఆయా బేస్‌ల ద్వారా కర్రిగుట్టల్లో సెర్చ్ ఆపరేషన్ భద్రతా బలగాలకు సులభతరం కాగా మావోయిస్టుల మనుగడ మరింత ప్రశ్నార్థకంగా మారనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 30 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని ప్రకటించిన గడువులోపే మావోల అంతం తప్పగా అన్న సందేహలు విష్లేషకుల్లో వ్యక్తం అవుతుండగా మావోల అంతం సాద్యంకాదని ఉద్యమానికి అంతం ఉండదని మారో మార్గంలో నూతన విప్లవానికి నాంది పలుకుందని మేధావి వర్గాల వాదనలు వినిపిస్తున్నారు.

26-11Pg3exHMNWJQEPVSCT 3 VJA_26-11Pg3exHMNWJQEPVSCT.qxd 26/Nov/25 12:44 AM Page 1





## మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయి

### డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం (జెండా ఎగురవేయడం) కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# అన్ని సంక్షేమ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు



**సంక్షేమశాఖలకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్**
**ప్రతి విద్యార్థి బ్లడ్ శాంపిల్స్, హాస్టళ్లలో వాటర్ శాంపిల్స్ తీసుకోండి**
**: సిఎం చంద్రబాబు ఆదేశం**

**విజయవాడ, నవంబర్ 25, ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో తనిఖీలను మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు తమ విధి నిర్వహణలో భాగంగా చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లోని మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర సదుపాయాలపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "సంక్షేమ శాఖ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లల్లో పారిశుద్ధం నూటికి నూరు శాతం నిర్వహించాలి. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరిగినా సహించేది లేదన్నారు. ఇటీవల కాలంలో హాస్టళ్లల్లో జరిగిన తప్పిదాలు మళ్లీ రిపీట్ కాకూడదు. అలాంటివి పునరావృతమైతే... ఏం జరిగిందని తెలుసుకునేది ఉండదన్నారు.. నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. 20 శాతం హాస్టళ్లల్లో టాయిలెట్ల నిర్మాణం ఇంకా జరపాల్సి ఉంది. ఈ టాయిలెట్ల నిర్మాణం కోసం అవసరమైన రూ.40 కోట్లు విడుదల చేస్తాం. టాయిలెట్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.జ ఆర్వో ప్లాంట్లు, టాయిలెట్లు లేకుండా హాస్టళ్లు ఉండడం సరి కాదు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల ఇవన్నీ జరిగాయి. ఆర్వో ప్లాంట్లు లేని ప్రతి హాస్టల్లోనూ... ప్రతి రెసిడెన్షియల్ పాఠశా లల్లోనూ ఆర్వో ప్లాం ట్లను ఏర్పాటు చేయాలి. డాక్టర్లతో విద్యార్థులకు రెగ్యులర్ హెల్త్ చెకప్స్ చేయించాలి. హాస్టళ్లలోని 4.17 లక్షల మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి సమస్యలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్సలు అందించాలి. బడుగు విద్యార్థులకు చేసే సాయాన్ని బాధ్యతగా తీసుకోవాలి. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో హాస్టళ్లు పెట్టారు. దీనికి విఘాతం కల్గించేలా అలక్ష్యం చేస్తే ఊరుకునేదే లేదు. హాస్టళ్లల్లో పరిస్థితి పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటనల చేపట్టడంతో పాటు పరిస్థితులపై నిత్యం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించుకోవాలి. సంక్షేమ రంగానికి చెందిన శాఖలన్నీ కలిపి ఉమ్మడిగా ఓ కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి. అన్ని హాస్టళ్లల్లోని విద్యార్థులకు డిజిటల్ హెల్త్ రికార్డ్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వైద్య పరీక్షలు నిర్వహించే సందర్భంగా విద్యార్థుల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే... ఆ అనారోగ్య సమస్యలకు గల మూలాలను విశ్లేషించాలి. దానికి అనుగుణంగా వైద్యం అందేలా చూడాలి. ఏజెన్సీ ప్రాంతాల్లోని హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరిగేలా ప్రత్యేక కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇప్పించండి. బాలుర హాస్టళ్లల్లోని వారికి మగ కౌన్సిలర్ల ద్వారా... బాలికల హాస్టళ్లోని వారికి మహిళా కౌన్సిలర్లతో కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే ఆత్మ స్థైర్యంతో నిలబడగలిగేలా విద్యార్థులను తీర్చి దిద్దాలి.

# ఉద్యాన పంటలు ప్రభుత్వ ఆదాయానికి కీలక వనరులు - మంత్రి పయ్యావుల



**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:**'రాయలసీమ రైతులకు మరింత ఆదాయం పెరగాలంటే ఉద్యాన పంటల సాగును మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.ఉద్యాన పంటలు ప్రభుత్వ ఆదాయానికి కీలక వనరులేనని చెప్పారు. .ఉద్యాన పంటల సమాచారం అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని పయ్యావుల మీడియాతో మాట్లాడుతే తెలిపారు. కోనసీమలో వరి సాగు చేసే రైతుల కన్నా రాయలసీమలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఆదాయం ఎక్కువ వస్తోంది.రెండు ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసి రూ.కోట్లలో ఆదాయం పొందిన వారూ ఉన్నారు. రూ.లక్షల్లో ఆదాయం పొందిన రైతులూ ఉన్నారు. ఆర్గానిక్ పంటలతో రాబడి ఎంతో బాగుంది..తెలంగాణ,తమిళనాడు,కర్ణాటక రాష్ట్రాలను అనుకుని రాయలసీమ ఉంది. ఇది ఎంతో అనుకూలాంశం ఉద్యాన పంటల ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కొన్ని ఉద్యాన పంటలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఆ పంటల సాగు చేపట్టడం వల్ల విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి ఫలితాలు వస్తాయిఇప్పటికే సీమలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సాగునీటిని అందిస్తున్నాం. ఆ నీటిని సద్వినియోగం చేసుకొని పంటలే కాదు పండ్ల తోటల పెంపకం చేపట్టాలి. అధికారులు సైతం ఈ విషయంలో అక్కడి రైతులకు అవగాహన కల్పించాలి సీమలో మరింత అభివృద్ధి జరిగేందుకు అవసరమైన అనిన వనరులూ ఉన్నాయి. ఇప్పటికే అనేక పరిశ్రమలు,కంపెనీలను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తోంది. దీనికి తోడు పండ్ల ఎగుమతుల ద్వారా చక్కని ఆదాయం పొందొచ్చు' అని. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక,ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు..కియా పరిశ్రమ వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్‌డీపీ పెరిగింది. పరిశ్రమల వల్లే కాదు.

## 'కాటూరి'లో పారా మెడికల్ ఉద్యోగి కీచకపర్వం!

**గుంటూరు, నవంబర్ 25, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు సమీపంలోని కాటూరి మెడికల్ కాలేజీలో ఓ పారా మెడికల్ ఉద్యోగి కీచకపర్వం వెలుగుచూసింది. పిజి విద్యార్థుల న్యూడ్ వీడియోలు తీసిన వైనమిది. అంతేకాకుండా ఆపరేషన్ థియేటర్, డ్రెస్సింగ్ రూమ్‌లో రహస్యంగా వీడియోలు తీస్తున్నాడని తెలిసి గమనించిన ఓ నర్సు ఈ కీచకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించింది. దీంతో నిందితుడి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నిందితునికి చెందిన సెల్‌ఫోన్‌లో రెండు అసభ్యకర వీడియోలను గుర్తించామని సౌత్ జోన్ డీఎస్పీ బానోదయ తెలిపారు. కాగా తప్పుడు సమాచారాలు ఎలాంటివి కూడా సోషల్‌మీడియాలో సర్క్యులేట్ చేయొద్దని డీఎస్పీ వెల్లడించారు.

## మరో గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలి : సిపిఎం

**విజయవాడ,నవంబరు 25,ప్రభాత వార్తప్రతినిధి:** పాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని చింతూరు, రంపచోడవరం, పోలవరం రెవెన్యూ డివిజన్‌లను కలిపి ప్రత్యేక గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని సిపిఐ(యం) కమిటీ ఆమోదించింది. విజయవాడలో మంగళవారం నిర్వహించిన సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షత వహించారు. జిల్లాలు, మండలాల సరిహద్దుల పునర్విభజన కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం కొత్తగా రెండు కొత్త జిల్లాలను (మదనపల్లె, మార్కాపురం) ప్రతిపాదించినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చింతూరు, రంపచోడవరం, పోలవరం ప్రాంతాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## సిమ్‌కార్డులు దుర్వినియోగమైతే కఠిన చర్యలు : టెలికాం శాఖ

**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** మొబైల్ వినియోగదారులకు టెలికం శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. తమ పేరుతో ఉన్న సిమ్ కార్డుల దుర్వినియోగం జరిగితే అందుకు వినియోగదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సైబర్ మోసాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సిమ్ కార్డులను వాడినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తమ గుర్తింపుతో అనుసంధానమైన సిమ్ కార్డులు, పరికరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎంఈఐ నంబర్లను మార్ఫింగ్ చేసిన ఫోన్లను వాడకూడదని కోరింది.

## హోంగార్డు అసభ్య ప్రవర్తన - సస్పెన్షన్ వేటు

**విజయవాడ,నవంబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** హోం గార్డ్ (304) బి.అజయ్ కుమార్ అసభ్య నృత్యాలు చేస్తూ అనుచిత ప్రవర్తన కలిగి పోలీస్ శాఖ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడంతో అతడిపై క్రమశిక్షణ చర్యలకు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో పాల్గొనవలసిన హోం గార్డ్ అసభ్య నృత్యాలు చేస్తూ ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృతంగా వ్యాప్తి చేయడంతో ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. వాటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఆ వీడియోల ద్వారా ప్రచురితమవుతున్న వార్త నిజ నిర్ధారణ కావడంతో మంగళవారం హోం గార్డు అజయ్ కుమార్ ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి పోలీస్ సిబ్బంది, అధికారుల ప్రవర్తన పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా ఉండాలి కానీ అప్రతిష్టకు గురి చేసేలా ఎవరు వ్యవహరించినా వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడేదిలేదని, మంచి విధి నిర్వహణ కనపరిస్తే ఏ విధంగా అభినందిస్తామో, అలాగే విధుల పట్ల నిరక్ష్యంగా వ్యవహరించినా అంతే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# మొదటి మూడురోజులు ఎలక్ట్రానిక్ డిప్‌ద్వారానే 'వైకుంఠ'దర్శన టోకెన్లు జారీ

**- రేపటి నుండి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం - జనవరి 2 నుండి 8 వరకు సాధారణ సర్వదర్శనం - ఆ పదిరోజులు ఎస్ఎస్‌డి టోకెన్లు రద్దు**

**తిరుమల,నవంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి మొదటిమూడురోజులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారానే టిటిడి టోకెన్లు జారీచేస్తుంది. డిసెంబర్ 30,31, 2026 జనవరి 1వతేదీ దర్శన టోకెన్ల కోసం ఈనెల 27వతేదీ (రేపు)గురువారం నుండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు డిసెంబర్ 1వతేదీ వరకు అవకాశం కల్పించింది. జనవరి 2వతేదీ నుండి 8వరకు పూర్తిగా ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ నుండి భక్తులను అనుమతించి వైకుంఠమార్గం దర్శనం చేయిస్తారు. డిసెంబర్ 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజులు పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. ఆన్‌లైన్‌లో కుటుంబసభ్యులకు 1+3 విధానంలో టోకెన్లు నమోదు చేసుకోవడానికి టిటిడి అవకాశం కల్పించింది.

**-రేపటి నుండి ఆన్‌లైన్‌లో డిప్ నమోదు:** మొదటిమూడురోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఈనెల 27వతేదీ ఉదయం 10గంటల నుండి డిసెంబర్ 1వతేదీ సాయంత్రం 5గంటల వరకు టిటిడి వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి,ఇన్//,మొబైల్‌యాప్ యాప్స్.ఆపిల్.కామ్/ఇన్/యాప్/టిటిదేవస్థానమ్స్/,వాట్సాప్‌లో ఏపి ప్రభుత్వబాట్‌లో టిటిడి ఆలయాల విభాగంలో ఎలక్ట్రానిక్ డిప్‌కు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్ 2వతేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ వివరాలు భక్తులకు అందించబడతాయి.

**-వాట్సాప్‌లో నమోదుకు:** వాట్సాప్‌బాట్‌ద్వారా ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకునే భక్తులు ఏపి గవర్నమెంట్ సర్వీసెస్ నంబ్ 9552300009కు ముందుగా గోవింద, హాయఅని మెసేజ్ చేయాలి. ఆ తరువాత ఆంగ్లం, తెలుగుభాషలను సెలక్ట్ చేసుకోవాలి. ఇంగ్లీష్‌కోసం ఇన్ అని, తెలుగుకోసం టిఇ అని జవాబివ్వాలి.అనంతరం డిసెంబర్ 30,31,జనవరి 1వతేదీల్లో దర్శనం కావాల్సిన రోజును లేదా మూడురోజులను ప్రయారిటీగా ఎంపిక చేసుకోవచ్చు. తరువాత భక్తులు ఆధార్‌కార్డులో ఉన్న మేరకు పేరు, వయస్సు, లింగం,ఆధార్‌నంబర్, మొబైల్‌నంబర్‌ను నమోదు చేయాలి. వివరాలను సరిచూసుకుని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

**-మొదటి మూడురోజులు ఎస్ఇడి ,శ్రీవాణి రద్దు:** వైకుంఠద్వార దర్శనాల్లో మొదటి మూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో ఎస్ఇడి, శ్రీవాణి ,ఇతర ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. జనవరి 2నుండి 8వరకు ఎస్ఇడి, శ్రీవాణి ఆన్‌లైన్‌లో జారీచేస్తారు. కాగా స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. ఎలాంటి సిఫార్సులేఖలు స్వీకరించారు.

**-ఆన్‌లైన్‌ద్వారా దాతలకు దర్శనాలు:** కోటిరూపాయలు ఆపై విరాళమిచ్చిన దాతలకు వారి కుటుంబసభ్యులకు డిసెంబర్ 30నుండి జనవరి 8వరకు రోజుకు 125మందికి, లక్షరూపాయల నుండి 99లక్షలు రూపాయల వరకు విరాళం ఇచ్చినదాతలకు డిసెంబర్ 30,31న వెయ్యిమందికి , జనవరి 1నుండి 8వరకు రోజుకు రెండువేల మందికి దర్శనం కల్పించనున్నారు. వీరు కూడా ఆన్‌లైన్‌లోనే అప్లికేషన్‌లో డిసెంబర్ 5వతేదీ విడుదల చేస్తారు.

# దుష్టచతుష్టయం కుట్రతోనే విచారణకు పిలిచారు

**- పరకామణి చోరీకేసులో ఎలాంటి సంబంధంలేదు :టిటిడి మాజీ ఛైర్మన్ భూమన ఆగ్రహం**

**తిరుపతి,నవంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** 2023లో తిరుమల పరకామణిలో జరిగిన చోరీ కేసులో తదనంతరం పరిణామాలతో తనకెలాంటి సంబంధం లేదని,ఈ కేసులో తనను ఇరికించాలని దుష్టచతుష్టయం ప్రయత్నిస్తోందని టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఈ కేసులో ఇరికించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. టిటిడి పరకామణి చోరీ కేసు దర్యాప్తులో భాగంగా రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో సిఐడి అధికారులు విచారణ చేస్తున్న విషయం విదితమే. ఇందులోభాగంగా మంగళవారం విచారణకు రావాలని ఉదయం ఆయన నివాసంలో సిఐడి అధికారులు నోటీసులిచ్చారు. సాయంత్రం 3.30గంటలకు తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో సిఐడి విచారణకు హాజరు కావడానికి ముందు న్యాయవాదితో కలసి భూమన మీడియాతో మాట్లాడారు. పరకామణిలో డాలర్ల చోరీ కేసులో దర్యాప్తు వేగవంతంగా సాగుతున్న పరిణామాల్లో భూమన హాజరయ్యారు.



సిఐడి విచారణకు ముందు మీడియాతో భూమన

## కర్నూలు - విజయవాడ కొత్త రైలు

**- రైల్వే మంత్రికి రాష్ట్ర మంత్రి టిజి భరత్ వినతి**

**విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమైన విధంగా పూర్తి సహకారం అందించాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ చెప్పారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసినట్లు టిజి భరత్ కలిశారు. పారిశ్రామిక లాజిస్టిక్‌లను బలోపేతం చేయడానికి, రాష్ట్ర ప్రధాన పారిశ్రామిక పార్కుల పోటీతత్వాన్ని పెంచడానికి ఓర్వకల్, శ్రీ సిటీ వద్ద రైల్వే సైడింగ్‌ల విషయంపై ఆయనతో చర్చించినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టిజి భరత్ పేర్కొన్నారు. అంతేకాకుండా కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైలు సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులు, వ్యాపార వర్గాలకు రైలు సౌకర్యం ఉండటం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయనకు వివరించినట్లు తెలిపారు. దీనిపై కర్నూలు ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

## ప్రవాసాంధ్రుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

**: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**సచివాలయం,నవంబర్ 25,ప్రభాతవార్త :** మయన్మార్ సైబర్ క్రైమ్ ముఠాల చెర నుండి విముక్తి పొంది,స్వదేశానికి తిరిగివచ్చిన భారతీయులకు ఏపి ప్రభుత్వం భరోసా కల్పించిందని,మయన్మార్ నుండి 370మంది భారతీయులతో కూడిన మూడు ప్రత్యేక విమానాలు ఢిల్లీచేరుకోగా అందులో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ,విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన 43మంది బాధితులను స్వస్థలాలకు చేర్చామని రాష్ట్ర సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన , ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# తిరుమల సమాచారం

## గోవిందుని సారెకు తిరుపతిలో పూజలు



**తిరుమల,నవంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** సిరులతల్లి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పట్టపురాణి పద్మావతిఅమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరిదైన పంచమీతీర్థం రోజు శ్రీవారి నుండి సారేను పంపడం ఆనవాయితీ. ఈ సారేను టిటిడి అధికారులు భక్తిశ్రద్ధలతో తలపై పెట్టుకుని కాలినడకన ఆధ్యాత్మిక నగరం తిరుపతి అలిపిరి నుండి నగరవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళతారు. ఆ సమయంలో సారేకు తిరుపతివాసులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికి కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మంగళవారం ఉదయం అలిపిరి మీదుగా తిరుపతిలోని బజారువీధి, గాంధీరోడ్డు, గోవిందరాజ స్వామి ఆలయ ఉత్తరమాఢవీధి, బండ్లవీధి, నెహ్రూవీధి,టిపి ఏరియా మీదుగా సాగిన పద్మావతి అమ్మవారి సారేకు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, కొట్టేసుబ్రమణ్యంరెడ్డి, జేజిరెడ్డి, పొన్నాల సుధాకర్ ,మహిళలు స్వాగతం పలికి సారేతో కలసి ఊరేగింపుగా వెళ్లారు. అత్యంత భక్తిశ్రద్ధలతో తిరుపతిలో భక్తివాతావరణం ఉట్టిపడింది.


## శ్రీవారి నుండి దేవేరి పద్మావతికి సారె



**తిరుమల,నవంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియు గప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నుండి దేవేరి తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి సంప్రదాయంగా పంచమితీర్థంరోజు సారేను సమర్పించడం ఆనవాయితీ. అత్యంత పవిత్రమైన పంచమి ఘడియల్లో మంగళవారం మధ్యాహ్నం తిరుచానూరు పద్మపుష్కరిణిలో జరిగిన పంచమీతీర్థం మహోత్సవానికి వేకువజామున 2.30గంటలకు తిరుమలేశుని ఆలయం నుండి సాంప్రదాయంగా సారేను తీసుకెళ్లారు.. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం విమానప్రాకారంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో శ్రీవారి వక్షస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం చేపట్టారు. ఉదయం 4.30గంటలకు తిరుమల ఆలయం నుండి పసుపు, కుంకుమ, 51పెద్దలడ్డూలు, వడలు, దోసెలు, ప్రసాదాలు, తులసి, పట్టువస్త్రాలు,ఆభరణాలు సారే మంగళవాయిద్యాల నడుమ గజరాజులతో కలసి ఊరేగింపుగా మొదలైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, జెఇఒ వీరబ్రహ్మాం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ దంపతులు,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు కాలినడకన సారేను తిరుపతి నగర వీధుల మీదుగా తిరుచానూరుకు చేర్చారు. తిరుచానూరు పసుపుమండపం వద్ద భక్తులు భక్తితో సారేకు కర్పూరహారతులిచ్చారు. అనంతరం పద్మావతిఅమ్మవారి ఆలయంలోనికి చేర్చి ఆ తరువాత పంచమీతీర్థంకు తీసుకెళ్లారు.

## పద్మపుష్కరిణిలో పంచమీతీర్థం





**తిరుచానూరుత్రిరుపతి,ప్రభాతవార్తప్రతినిధి:** అలిమేలుమంగమ్మ తిరుచానూరు పద్మావతిఅమ్మవారు అవతరించిన పంచమి తిథిన కార్తీకబ్రహ్మోత్సవాల్లో చివరిదైన పంచమీతీర్థం మంగళవారం ఉదయం పద్మపుష్కరిణిలో అత్యంతం వైభవంగా జరిగింది. శుభముహూర్తాన మధ్యాహ్నం 12.10గంటలకు అమ్మవారి చక్రస్నానం ఘట్టం వేడుకగా ముగిసింది. అదే సమయంలో అసంఖ్యాకంగా పుష్కరిణిలోకి వేంచేసిన భక్తులు తన్మయత్వంతో పద్మావతిదేవి నమోనమ: నామస్మరణలతో పుణ్యస్నానాలాచరించారు. తిరుచానూరు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందింది. లక్షలాదిమంది భక్తులు సమూహంలో అమ్మవారి పంచమీతీర్థం మహోత్సవం అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడం వెనుక టిటిడి,పోలీసు,విజిలెన్స్ ప్రణాళికలు అమలుచేయడం జరిగింది. వేకువజామున నుండి భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మాం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపుఎస్పీలు రవిమనోహరచారి, నాగసుబ్బన్న, డిఎస్పీలు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు విశేషంగా కృషి చేసి భద్రత నిర్వహించారు. ఉదయం పద్మావతిఅమ్మవారి ఉత్సవమూర్తి పల్లకీలో ఆలయ మాఢవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. మెల్లగా పుష్కరిణికి చేరుకున్న అమ్మవారికి విశేషంగా స్నపతిరుమంజనం అభిషేకించారు. అమ్మవారికి అలంకరించిన సువాసనలు పుష్పాలు, సుగందపరిమళద్రవ్యాలుతో పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలాచరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ అర్చకులు, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధికారులు, బోర్డు సభ్యులు, భక్తులు పుణ్యస్నానాలాచరించి ముకిని పొందారు. నేడు పుష్పయాగం జరగనుంది.

# గోరంట్ల గురుకుల పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

**- వంటగదిలో కుళ్లిన కూరగాయలు, ఎలుకలు న- అందుబాటులో లేని ప్రిన్సిపల్ - బాధ్యులపై కఠిన చర్యలకు మంత్రి సవిత ఆదేశాలు**



ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న విద్యార్థులు

**గోరంట్ల నవంబర్ 25 ప్రభాతవార్త** కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువుపై ఉన్న మమకారంతో రాజీ పడలేక చదివి భవిష్యత్తుకు మంచి మార్గం అని భావించి ప్రాంతం ఏదైనా దూరం ఎంత ఉన్న మాకు చదివే ముఖ్యమని భావించిన పేద గిరిజన విద్యార్థులు గురుకుల పాఠశాలలో చేరితే అక్కడ సిబ్బంది నిర్లక్ష్యమో, లేక నాసీ రకం వంటలో ఇలా ఏదో ఒక సమస్య వల్ల ఆ పేద విద్యార్థులకు శాపంగా మారుతుందని గోరంట్ల గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.ఇందుకు నిదర్శనమే మంగళవారం మధ్యాహ్నం ఆ గిరిజన విద్యార్థులు తిన్న పప్పు అన్నం వల్ల ఆరు మందికి పైగా విద్యార్థులు అస్వస్థకు గురైన సంఘటన నిదర్శనంగా తెలుస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ హుటాహుటిన స్పందిస్తూ పిల్లల ఆరోగ్యం పై వైద్యాధికారులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఈ సంఘటనకు కారకులైన వ్యక్తులపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సైతం ఆదేశించినట్లు "ప్రభాత వార్త "కు మంత్రి తెలియజేశారు. ఈ సంఘటనలు కళ్యాణదుర్గం ప్రాంతంలోని వర్లీ గ్రామానికి చెందిన 8వ తరగతికి చెందిన జాహ్నవి, అనంతపురం రూరల్ ప్రాంతానికి చెందిన ఆరవ తరగతి విద్యార్థి భానుప్రియ లతోపాటు వైష్ణవి, జైష్ణవి, ఎం దీపిక, జైష్ణవి, ఆర్ దీపిక తదితర విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్నం తిన్న భోజనం వల్ల అస్వస్థకు గురై గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
'e' Procurement Short Tender Notice No.EE-36/VMC/VD/2025-26, Dt.25-11-2025

| | |
|---|---|
| Engaging of workers, Vehicles & S/D of Conservancy Articles for Bhavani Dheekshala Viramana-2025 (15 works). | Rs.201.96 Lakhs |

CONTACT: Executive Engineer W.D- IV, Jawaharlal Nehru Buildings, Vijayawada – 520 001.
Further details can be seen @ 'e' procurement market place @ www.apeprocurement.gov.in
Download of bid documents starts from : 26-11-2025 at 4.00 PM
Last date/Time for receipt of Tender : 03-12-2025 up to 11.00AM
EXECUTIVE ENGINEER W.D – IV


వార్త

నిన్ను నీవు మోసగించుకున్నంతగా ఇంకొకరెవరూ నిన్ను మోసగించరు.

-గోథె

# 'సర్' ప్రకంపనలు

'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ వంటి మీద జెర్రిలు పాకుతున్నాయి. నిన్నగాక మొన్న ఎన్నికల కమిషన్‌పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిల పడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడుతున్నాయి. బ్యాలెట్ బాక్స్‌లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్నికల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పించేవారు. వారు వీరుగా, వీరు వారుగా అధికార విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. బీహార్‌లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ పార్టీ విపరీతంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్‌లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో 'ఓట్ చోరీ' ర్యాలీకి సిద్ధమవుతున్నాయి. డిసెంబరు 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించే ఏర్పాట్లు చేస్తోంది. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూభావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. కర్ణాటక నుంచే బిజెపి 'ఓట్ చోరీ'కి మద్దతు ఇస్తోందని, తాజాగా బీహార్ ఎన్నికల ఫలితాలు 'ఓట్ చోరీ' ప్రభావమేనని కాంగ్రెస్ తమ పార్టీ శ్రేణుల్లో నమ్మకం కలిగించింది. కర్ణాటక కాంగ్రెస్ 1.12కోట్ల సంతకాలు సేకరించగా పంజాబ్,కాంగ్రెస్ యూనిట్ 27 లక్షల సంతకాలను సేకరించి పార్టీకి సమర్పించింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్‌పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. బీహార్‌లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్‌ఓలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ బిఎల్‌ఓల పాలిట మృత్యుపాశంలా తయారయ్యిందని కాంగ్రెస్ జాతీయ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఇసి నిర్ణయాలపై ఆరోపించారు. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమబెంగాల్‌లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్‌లో ఉండేవారి పత్రాలను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీలించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్‌తో బెంగాల్ పోలీసులు సతమతమవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్‌లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడలాంటి ఎన్నీ బయ టపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున ఎంతోమంది బంగ్లాదేశీయులు ఇక్కట్ల పాలవుతున్నారు. తాత్కాలికంగా నైనా ఆ వారికి భద్రత కల్పించడం పోలీసులకు అంతే తేలికైన పనిలా లేదు. ఎస్ఐఆర్ కారణంగా అసాధారణ వలస దారులను పట్టుకోవడం సాధ్యమౌతోంది.



జీవితంలో స్వయంగా పైకి వెళ్లినవాడు వినమ్రంగా ఉంటాడు. అణుకువగా జీవించేవాడే పైకి వెళ్లగలడు.

షేక్‌స్పియర్



జీవితం ఒక తరంపాటే ఉంటుంది. మంచిపేరు చిరకాలం ఉంటుంది.

ఎమర్సన్

# ప్రజావాక్కు



### పాత చట్టాల విలీనం

భారత దేశంలో భూమి, కార్మిక విధానాల సంస్కరణలు ఎన్నో దశాబ్దాలుగా చర్చలో ఉన్నా, అమలులో మాత్రం నెమ్మదిగా ముందుకువచ్చాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 29 పాత చట్టాలను విలీనం చేస్తూ నాలుగు కొత్త కార్మిక నియంత్రణ వ్యవస్థలను అమలు చేయాలని ప్రకటించడం ఈదిశలో ఒక ముఖ్యమైన అడుగు. ఇవి నియమాల క్లిష్టత తగ్గించి, కార్మికుల భద్రతను విస్తరించి, సంస్థలకు స్పష్టమైన, ఆధునిక విధానాలను అందించడమే లక్ష్యం. ఒక్క సంస్థ నడిపేందుకు వేలకొద్దీ నియమాలను అనుసరించాల్సి రావడంవల్ల వ్యాపారాలకు భారీఖర్చులు, ఆలస్యం, అపనమ్మకం ఏర్పడింది. తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులతోసమానహక్కులు ఇవ్వడంవంటి నూతనచర్యలు ఉద్యోగ వాతావరణాన్ని సమానంగా మార్చగలవు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రయత్నం తప్పనిసరి

మనదేశంలో అభ్యర్థులు ఉన్నత విద్యాభ్యాసం తరువాత ఉద్యోగ ప్రయత్నాలకు వారిసమర్థత, అభిలాష బట్టి దేశ వ్యాప్తంగా ప్రయత్నాలు సులువుగా చేయొచ్చు. ఒక నిర్దేశ వ్యవధి దాటినాక ప్రయత్నం తప్పనిసరి. మరి ఏదైనా, కేవలంఇతరదేశంలోని ఉద్యోగమేవిలువ, గౌరవం, డబ్బుకు ప్రజలు గుర్తిస్తారనుకోవడం సరికాదు. అది మన భవిష్యత్తు, జీవనం, తృప్తికోసమని గుర్తించాలి. మనో భావాలు మన సొంతం. ఆత్మగౌరవం, పనిలోతృప్తి ఉంటేనే సంపాదనకు పరమార్థం. ఈ ప్రాథమిక భావన విస్మరించి విదేశీ విద్యాలయంలో కాలు పెట్టేందుకే కోట్ల ధనం అప్పులు చేసి చివరికి అనుమతి రాలేదని నిండు జీవితం అంతం చేసుకోవడం వ్యక్తిగతమైనప్పటికీ అభిలషణీయం కాదు.

- బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

### ప్రత్యేక రైళ్లు నడపాలి

ప్రకాశం జిల్లాలోని కంభంఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి కాలేదు. కంభంలో చాలా వీధులలో సిసి రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉంటుంది. ఆసియాఖండంలోనే ప్రసిద్ధి గాంచిన చెరువు ఈ గ్రామంలో ఉంది. ఈ చెరువును సైతం పర్యాటక ప్రదేశంగా పూర్తిస్థాయి హంగులతో తీర్చిదిద్దాలి. ఈ ఊరి మీదుగా ఎక్కువగా రైళ్లు నడుపుటకు దక్షిణ మధ్య రైల్వేవారు చర్యలుతీసుకోవాలి. ప్రత్యేక రైళ్లను నడపాలి.

- సాగర్, కంభం

### సాక్ష్యాలు ముఖ్యం

ఈమధ్య సుప్రీంకోర్టు సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా హత్యానేరం మోపబడిన వారిని విడుదల చేయడం జరిగింది. మరి ఈ హత్యలు ఎవరు చేసినట్టు? ఏళ్ల గడస్తున్నా వివేకానందరెడ్డి కేసు తెమలటంలేదు. సాక్షులు కాలక్రమంలో చనిపోవడమో లేక హత్య చేయబడడమో జరుగుతున్నది. తిరుపతి పరకామణిలోకోట్లసొమ్మును దొంగిలించినవారిని బయటపెట్టిన పోలీసు అధికారి రైలులో హత్య చేయబడ్డారు. సాక్ష్యాలు దొరకటం లేదు. కోర్టుకున్న గంతలు తొలగించినా అవి కనలేవు. వాటికి సాక్ష్యాలే కావాలి. అవి దొరకవు. సాక్ష్యాలకు దొరకకుండా పకడ్బందీగా నేరాలు చేయడం నేర్చుకున్నారు. ఈ కారణంగా దొంగలు, హంతకులుహాయిగా, హుందాగా బయట తిరుగుతుంటా రు. అవినీతి ఆరోపణలు చేయబడ్డవారు ఏళ్ల తరబడి బెయిల్ మీద ఉంటారు. వేలకొలది వాయిదాలు ప్రసాదిస్తాయి.

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### ధైర్యానికీ దృఢసంకల్పానికీ నిదర్శనం

అంధ మహిళల టీ20 క్రికెట్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడం భారత మహిళా క్రీడా చరిత్రలో ఒక గర్వ కారణమైన ఘట్టంగా నిలిచింది. శారీరక పరిమితులు ఉన్నా కూడా అజేయ సంకల్పంతో, నిరంతర సాధనతో, అపారమైన ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తూ సాధించిన ఈవిజయం సాధారణమైనది కాదు. ఇది కేవలంఒక క్రీడా టైటిల్ గెలుపు మాత్రమే కాదు. అంధుల సామర్థ్యాన్ని ప్రపంచానికి రుజువుచేసిన శక్తివంతమైన సందేశం. అంధ మహిళా క్రీడాకారిణులు ఎదుర్కొనే సవాళ్లుఎన్నో. వారికి ఆటను అర్థం చేసుకోవడం, శబ్ద సంకేతాలను అనుసరించడం, బంతి ధ్వనిని గ్రహించడం వంటి ప్రతి దశలోని కఠినతరమైన సమస్యలను దాటుకుని టీ20 ఫార్మాట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం విశేషం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలి

ఇప్పటికి గ్రామాలలో, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్‌ను యధేచ్ఛగా వాడుతున్నారు. విద్యావంతులు సైతంప్లాస్టిక్‌కవర్‌లను వినియోగించడం విస్మయానికి గురి చేస్తుంది. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పుఉందని చెబుతున్నప్పటికీ వాటిని వినియోగించకుండా ఉండలేకపోతున్నాం. ప్లాస్టిక్ కవర్‌ల స్థానంలో బట్ట సంచులు, జూట్ బ్యాగులు వినియోగించడం అలవాటు చేసుకోవాలి. ప్లాస్టిక్‌పైప్రభుత్వ యంత్రాంగం ఉక్కుపాదం మోపాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చట్టం ముందు అందరు సమానులే

**జాతీయ న్యాయ దినోత్సవం, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో అవగాహనను పెంపొందించే వేదికగా మారింది. చట్టం ముందు అందరూ సమానము అన్న రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం సార్థకంగా ఆచరించేటపుడు ఈ దినం నిజమైన ఉద్దేశ్యం నెరవేరుతుంది. ప్రజలకు న్యాయం చేరేటట్లు, న్యాయ సహాయం అందుబాటులో ఉండేటట్లు వ్యవస్థ కృషి చేస్తూనే ఉండాలి. జాతీయ న్యాయ దినోత్స వం మన దేశంలో చట్టపరమైన చైతన్యాన్ని పెంపొందిం చేందుకు ఒక విలువైన సందర్భం. న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి, చట్టంముందు సమానత్వం అమ లులో ఉండాలి, న్యాయస్ఫూర్తి సామాజిక జీవనంలో ప్రతి ఫలించాలి ఇవి ఈదినం ఇచ్చే ప్రధాన సందేశాలు. రాజ్యాంగ విలువలను మనం మన జీవనంలో ఆచరిస్తూ, న్యాయా నికి గౌరవం చూపుతూ సమాజంలో న్యాయం మరియు సమానత్వం పెంపొందించే ప్రయత్నం కొనసాగిం చినప్పుడే ఈ దినోత్సవం నిజమైన అర్థాన్ని పొందుతుంది.**

సొప్పరి నరేందర్

మన భారతదేశంలో న్యాయవ్యవస్థ రాజ్యాంగ వ్యవస్థ ఎంతో ముఖ్యమైనవి. ఈ వ్యవస్థలు భారతీయ ప్రజలకు అవగాహన పెరిగే అవకాశాన్ని ఇస్తుంది. సమాజంలో హక్కులు, బాధ్యతలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఈ రోజు విద్యార్థులు, యువత, సామాన్యులు, చట్టం, న్యాయం, సమానత్వం రాజ్యాంగ విలువలపై ప్రయోగాత్మకంగా ఆలోచించాలి. న్యాయవాదులు, న్యాయసంస్థలు ఈ రోజును వినియోగించి చట్టం ముందు అందరూ సమానత్వం అనే సందేశాన్ని వినిపించాలి. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయం జరగకూడదన్న సూత్రమే న్యాయవయ్వస్థకు పునాది. రాజ్యాంగం అనేది కేవలం న్యాయవాదుల పత్రం కాదు ఇది జీవితానికి వాహనం, దాని స్ఫూర్తి ఎల్లప్పుడూ యుగ స్ఫూర్తి. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థంగా నవంబర్ 26 న భారత రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం ఇది 1949 లో కొత్త శకానికి నాంది పలికిన చారిత్రాత్మక సంఘటన. 76వ వార్షికోత్సవాన్ని సూచించడం జరుగుతుంది. ఈ రోజును జాతీయ న్యాయ దినోత్సవం లేదా జాతీయ రాజ్యాంగ దినోత్సవం అని కూడా పిలుస్తారు, దీనిని భారత రాజ్యాంగం గురించి అవగాహన పెంచడానికి కూడా జరుపుకుంటారు. రాజ్యాంగ నిర్మాతల సహకారాన్ని గుర్తించి గౌరవించడానికి రాజ్యాంగం కల్పించే ప్రముఖ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించింది. 1949లో ఈ రోజున భారత రాజ్యాంగంఆమోదించబడింది ఇది జనవరి 26, 1950న అమలులోకి వచ్చింది. భారత దేశంలో న్యాయ వ్యవస్థ ముందు పెండింగ్ కేసుల సంఖ్య ఇంకా భారీగా ఉంది. ప్రజలలో చట్టపరమైన అవగాహన ఇంకా పూర్తిగా లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమాలు సరిగా జరగకపోవడం ఒక విషయం. న్యాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి వినియోగంపై కూడా దృష్టి అవసరం పెట్టాలి. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగసభ భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించింది. ఇది జనవరి 26, 1950న అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ దినోత్సవం రాజ్యాంగం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగాపెట్టుకుంది. ముసాయిదా కమిటీ ఛైర్మన్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్‌ను భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పిగా పరిగణిస్తారు. ఆయనను భారతరాజ్యాంగ పితామహుడు అని కూడా పిలుస్తారు. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ సభ్యులు రూపొందించారు. రాజ్యాంగం అనేది భారత ప్రభుత్వం లిఖిత సూత్రాలు. ఇది ప్రభుత్వం దేశ పౌరుల ప్రాథమికరాజకీయ సూత్రాలు, విధానాలు, హక్కులు, నిర్దేశక సూత్రాలు, పరిమితులు విధులను రూపొందిస్తుంది. భారత రాజ్యాంగం దేశాన్ని సార్వభౌమ, లౌకిక, సోషలిస్ట్ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటిస్తుంది. ఇది దాని పౌరుల సమానత్వం, స్వేచ్ఛ న్యాయాన్ని నిర్ధారిస్తుంది. ప్రవేశిక అనేది భారత ప్రజల లక్ష్యాలు ఆకాంక్షలను నమోదు చేసే ఒక సంక్షిప్త ప్రకటన. భారత రాజ్యాంగం ఇలా చెబుతోంది భారతదేశ ప్రజలమైన మేము, భారతదేశాన్ని సార్వభౌమ,



లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయాలని, దాన్ని పౌరులందరికీ న్యాయం, సామాజిక, ఆర్థిక రాజకీయ స్వేచ్ఛ, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం, ఆరాధన స్వేచ్ఛ, హోదా, అవకాశాల సమానత్వం, వారందరిలో సోదరభావాన్ని పెంపొందించడం, వ్యక్తి గౌరవాన్ని దేశం ఐక్యత సమగ్రతను నిర్ధారించడం. 1949 నవంబర్ ఇరవై ఆరవ రోజున మన రాజ్యాంగ సభలో ఈ రాజ్యాంగాన్ని ఇందుమూలంగా స్వీకరించి, అమలు చేసి మాకు మేము ఇచ్చుకుంటున్నాము. రాజ్యాంగాన్ని అనేక వనరుల నుండి తీసుకోబ డింది, అయితే భారతదేశ అవసరాలు పరిస్థితులకు అత్యం త ప్రాముఖ్యత ఇవ్వబడింది. బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించే ముందు 60కి పైగా దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేశారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా అంబేద్కర్ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి మంత్రిత్వ శాఖలు విభాగాలు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. నవంబర్ 25, 1949న రాజ్యాంగ సభ తన కార్యకలాపాలను ముగించే ముందు అంబేద్కర్ ఒక హృదయ స్పర్శి ప్రసంగం చేశారు. ఇది భవిష్యత్తు కోసం మూడు హెచ్చరికలతో ముగిసింది. మొదటిది ప్రజాస్వామ్యంలో ప్రజా నిరసన స్థానం గురించి. పౌర అవిధేయత, సహాయ నిరాకరణ, సత్యాగ్రహ పద్ధతులను వదిలివేయాలి అని ఆయన అన్నారు, రెండవ హెచ్చరిక ఆలోచన లేకుండా సమర్పించడం గురించి చర్చించింది. ఆకర్షణీయమైన అధికారం, మతంలో భక్తి అనేది ఆత్మ మోక్షానికి మార్గం కావచ్చు, కానీ రాజకీయాల్లో భక్తి లేదా హీరో ఆరాధన అనేది అధోకరణానికిచివరికి నియంతృత్వానికి ఖచ్చితంగా మార్గం అని అంబేద్కర్ అన్నారు. భారతీయ సమాజంలో అసమానత సోపానక్రమం ఇప్పటికీ పాతుకుపోయినందున భారతీయులు రాజకీయ ప్రజాస్వామ్యంతో సంతృప్తి చెందకూడదని ఆయన చివరి హెచ్చరిక. మనం దానిని ఎక్కువ కాలం నిరాకరిస్తూనే ఉంటే మన రాజకీయప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తాము. భారత రాజ్యాంగం ఇప్పుడు ప్రతి భారతీయుడికి అర్థమయ్యేలా ఉంది, వారు ఏ భాష లేదా మాండలికం మాట్లాడినా. విదేశాంగ మంత్రిత్వ శాఖ అన్ని విదేశీ భారతీయ పాఠశాలలను నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని ఆదేశించింది. రాజ్యాంగాన్ని ఆ దేశ స్థానిక భాషలోకి అనువదించి వివిధ అకాడమీలు, గ్రంథాలయాలు, ఇండాలజీ ఫ్యాకల్టీలకు పంపిణీ చేయాలని రాయబార కార్యాలయాలను ఆదేశించింది. వాస్తవానికి, అధికారికంగా భారతదేశంలో 22 కంటే ఎక్కువ భాషలుమాట్లాడబడుతున్నాయి. భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా వాస్తవానికి రాజ్యాంగంలో తన పౌరుల హక్కులను వివరించింది, దానిని ఎల్లప్పుడూ తదనుగుణంగా పాటించాలి. అందువల్ల ప్రతి పౌరుడు తమ హక్కులను తెలుసుకోవాలి. భారత రాజ్యాంగ ఆవిష్కరణ వార్షికోత్సవంగా ఆవిర్భవించిన జాతీయ న్యాయ దినోత్సవం, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో అవగాహనను పెంపొందించే వేదికగా మారింది. చట్టం ముందు అందరూ సమానము అన్న రాజ్యాంగ స్ఫూర్తిని సమాజం సార్థకంగా ఆచరించేటపుడు ఈ దినం నిజమైన ఉద్దేశ్యం నెరవేరుతుంది. ప్రజలకు న్యాయం చేరేటట్లు, న్యాయ సహాయం అందుబాటులో ఉండేటట్లు వ్యవస్థ కృషి చేస్తూనే ఉండాలి. జాతీయ న్యాయ దినోత్సవం మన దేశంలో చట్టపరమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ఒక విలువైన సందర్భం. న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి, చట్టంముందు సమానత్వం అమలులో ఉండాలి, న్యాయస్ఫూర్తి సామాజిక జీవనంలో ప్రతిఫలించాలి ఇవి ఈదినం ఇచ్చే ప్రధాన సందేశాలు. రాజ్యాంగ విలువలను మనం మన జీవనంలో ఆచరిస్తూ, న్యాయానికి గౌరవం చూపుతూ సమాజంలో న్యాయం మరియు సమానత్వం పెంపొందించే ప్రయత్నం కొనసాగించినప్పుడే ఈ దినోత్సవం నిజమైన అర్థాన్ని పొందుతుంది. •

# ఏఐ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు

సయ్యద్ నిసార్ అహ్మద్

సుస్థిర, శాశ్వత ఉపాధి రంగాలలో పెట్టుబడులు పెరిగితేనే భారత్ లాంటి దేశాలకు ప్రయోజనకరం. కానీ నేడు అందుకు విరుద్ధమైన రీతిలో మనదేశంలో పెట్టుబడుల తీరు సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకీ ఏఐ ప్రభావం విపరీతంగా పెరుగుతోంది. మరోవైపు ఏఐ వల్ల చాలా మంది నిరుద్యోగులవుతున్నారు. ఈ క్రమంలో ఓ ఆసక్తికర నివేదిక వెల్లడైంది. భారతదేశంలో దాదాపు సంగం అంటే 47శాతం కంపెనీలు బహుళ జనరేటివ్ ఏఐని ఉత్పత్తిలో వినియోగిస్తున్నట్లు ఈవైసీఐఐ సంయుక్తంగా రూపొందించిన నివేదిక వెల్లడించింది. 'ది ఏఐడియా ఆఫ్ ఇండియా' అవుట్ లుక్ 2026' పేరుతో ఈ నివేదికను రూపొందించారు. దీనికోసం 200 భారతీయ సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ క్రమంలో 95శాతం కంటే ఎక్కువసంస్థలు మొత్తం ఐటీ వ్యయంలో 20 శాతం కంటే తక్కువగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) బడ్జెట్‌లను నిర్వహిస్తున్నాయి. ఇక్కడితో ఆగని ఎంతోమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తున్నట్లు తేలింది. ఆ రంగంలోకి పెట్టుబడుల వరద సాగిస్తున్నారు. అయితే ఇదెంత వరకు సేఫ్? మన దేశంలో ఈ పరిణామం ఎంత వరకు మేలు చేస్తుందన్నది. ఇప్పుడు చర్చగా మారుతోంది. మన దేశానికి మనవ వనరు భారీ స్థాయిలో ఉంది. అంటే మన దేశంలో యువత సంఖ్య అధికంగా ఉంది. ఇది ఏ దేశానికైనా పురోగతి కోసం ఉపయోగపడుతుంది. కానీ ఈ యువతకు పూర్తి స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరికినప్పుడే. ఇప్పటికే మన దేశంలో చాలా మంది యువతకు ఉపాధి అవకాశాలు పూర్తి స్థాయిలో లేవు. ఈ క్రమంలో ఉపాధి అవకాశాలు పెంచే దిశగా పరిశ్రమల ఏర్పాటు, కార్పొరేట్ కంపెనీ స్థాపన, ఇలాంటి రంగాల్లో పెట్టుబడులు పెరగాలి. కానీ తాజాగా తేలిన అధ్యయనంలో ఆందోళనకరమైన వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగల కల్పన కంటే సాంకేతికత కారణంగా ఉద్యోగాలు ఊడిపోతున్న సంఖ్యయే అధికంగా ఉంది. ఈ తరుణంలో పెట్టుబడులు ఉపాధి కల్పన రంగాల్లో జరగాల్సి ఉండిపోయి ఏఐ రంగంలోకి మళ్లడం మన భారత్ లాంటి దేశాలలో ఓ శాపమే. ఏఐ రంగంలో పెట్టుబడులపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏఐ రంగంలో పెట్టుబడులు పెడితే ఆశించినంత రాబడులు రాని పక్షంలో ఆశలు రేకెత్తిస్తున్న ఈ బుడగ బద్దలయ్యే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఏఐ రంగంలో పెట్టుబడులు ఏ మాత్రం శ్రేయస్కరం కాదన ఏఐ అనేఆశల బుడగ బద్దలయ్యే రోజు దగ్గర్లోనే ఉందని పలువురువ్యాఖ్యానిస్తున్నారు. అదే జరిగితే డాట్‌కామ్ సంక్షోభం నాటి రోజులు మళ్లీ వస్తాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఏఐ రంగం వైపు పెట్టుబడులు పెరగడానికి కారణాలు కూడా ఉన్నాయి. ఇతర రంగాలలో పెట్టుబడులు పెట్టాలంటే ప్రస్తుతంకంపెనీ మార్కెట్ విలువ అమాంతం పెరిగిపోవటం. అసాధారణంగా పెరిగిన అంచనాల నేపథ్యంలో నిధుల సేకరణ జరగటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ కారణం చేతనే ప్రస్తుతం ఏఐరంగంలో భారీగా పెట్టుబడులు వచ్చి పడుతున్నాయి. అయితే ఇదెంతో కాలం సాగదని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ఏమైనా ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టేవారంతా ఆచితూచి అడుగులు వేయటం మంచిదని ఆర్థిక నిపుణుల మాట. ఈపరిస్థితుల నేపథ్యంలో మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిది, మన దేశంలో ఉపాధి అవాశాలు పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. పెట్టుబడిదారులను ఏ వైపు ప్రోత్సహించాలి, ఏ రకమైన ప్రోత్సాహకాలు అందించి మన దేశంలో ఉపాధి కల్పన రంగాలలో పెట్టుబడులను ప్రోత్సహించాలి అన్నది ప్రభుత్వం వైపు నుంచి కూడా ఆలోచన చేయాలి. దేశంలోని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పన బాధ్యత ప్రభుత్వానిదే. •

# శ్రామిక చట్టాలకు నూతన శకం



వాసం శెట్టి సుభాష్

భారతదేశంలో శ్రామిక చట్టాలకు కొత్త శకం ఆరంభమైంది. కేవలం చారిత్రక సంస్కరణ మాత్రమే కాదు, దేశంలోని ప్రతి శ్రామికుడికి గౌరవాన్ని, భద్రతను కల్పించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. కేంద్రప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపనున్నాయి. దశాబ్దాలుగా అమలులో ఉన్న కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడంవల్ల దేశ వ్యాప్తంగా కార్మికులు హర్షాతీరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నూతన కార్మిక చట్టాలు దేశాభివృద్ధికి బాటలు వేసే సంస్కరణలు. దేశంలోని కార్మిక చట్టాల చరిత్రలో ఇది ఒక గొప్ప సంస్కరణగా నిలుస్తుంది. సరళత, పారదర్శకత, సమర్థత, కార్మికుల సంక్షేమానికి నాలుగు నూతన కార్మిక చట్టాలు దోహదపడతాయి. నూతన చట్టాల వల్ల కీలక మార్పులతో అందరికీ సాంఘీక భద్రత, అసంఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ప్లాట్‌పార్మ్ వర్కర్లవంటి వర్గాలకు కూడా రక్షణ పొందే అవకాశం లభించింది. నూతన కార్మిక చట్టాలతో పరిశ్రమలకు సరళీకృత విధానాలు, పెట్టుబడులు, ఉత్పత్తి, ఉద్యోగావకాశాలు పెరిగేలా వ్యవస్థను రూపొందించారు. అంతేకాకుండా వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, తదితర అంశాలు ఈ చట్టాలతో మెరుగైన పద్ధతిలో అమలు చేయడానికి అవకాశం ఉంటుంది. ఈ చట్టాలు కాగితాలపైనే కాకుండా కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకువస్తాయి. ఇప్పటివరకు ఉన్న 29పాత కార్మిక చట్టాలను సరళతరం చేస్తూ, దేశంలోని 40కోట్ల మందికి పైగా కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలకు హామీ లభిస్తున్నది. దేశంలోని 40 కోట్ల మంది, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటితక రంగాల్లోని లక్షలాది మంది కార్మికులకు కనీసవేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలను లభించనున్నాయి. తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా అన్ని చోట్లా దేశవ్యాప్తంగా ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతోపాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చు. మనదేశంలో 1930-50 మధ్య రూపొందించిన కార్మిక చట్టాలే నేటికి అమలులోఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో ప్రస్తుత తరానికి ఆ చట్టాలు సరిపోవనే ఆందోళనలు ఉన్న సంగతి విదితమే. దశాబ్దాల నాటి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన చట్టాలను అమలు చేయడం వల్ల ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారాలు, ఫ్యాక్టరీలకు కష్టంగా మారింది. అలాగే కార్మికులకు సరైన భద్రత, సంక్షేమం





అందడం లేదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఈ సమస్యలను అధిగమించేందుకు నూతన కార్మిక కోడ్‌లను కేంద్రం రూపొందించడం ద్వారా కార్మికులకు ఎంతో మేలు చేసింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రతా కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్లను ప్రకటించింది. వేతనాల కోడ్ 2019, సామాజిక భద్రతా కోడ్ 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి అన్ని రంగాలకూ వర్తించనున్నాయని...కార్మికుల భద్రత మెరుగుపర్చడానికి, అలసటను తగ్గించడానికే కాక భద్రత, అదనపు ప్రయోజనాలు లభిస్తాయని చెబుతున్నారు. దీంతో ఇప్పటి వరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను హేతుబద్ధం చేసినట్లు అవుతుందని కేంద్ర ప్రభుతం చెబుతోంది. దీని ద్వారా మెరుగైన కార్మిక, ఉద్యోగ విధానాలు అమలల్లోకి రానున్నాయి. కొత్త కార్మిక నియమావళి ప్రకారం అతిపెద్ద మార్పులలో ఒకటి రోజువారీ పని పరిస్థితులు, ఉద్యోగులు ఎంత కాలం పని చేస్తారు, వారు ఎప్పుడు వేతనంతో కూడిన సెలవులకు అర్హులు, వారు ఎంత ఓవర్ టైం తీసుకోవచ్చు, వారు ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలకు అర్హులు లాంటివి నిర్ణయిస్తుంది. ఇప్పటివరకు, ఉద్యోగులు వార్షిక వేతనంతో కూడిన సెలవుకు అర్హత సాధించడానికి ముందు ఒక క్యాలెండర్ సంవత్సరంలో 240పని దినాలను పూర్తి చేయాల్సి ఉండేది. కొత్త కోడ్‌లు ఆ అవసరాన్ని 180రోజులకు తగ్గించాయి. అంటే ఇప్పుడు ఒక కార్మికుడు ఏడాదిలో చాలా ముందుగానే సెలవుకు అర్హుడు అవుతాడు. ఇది తయారీ, వస్త్రాలు, రిటైల్, నిర్మాణం, హాజరు నియమాలు సాంప్రదాయకంగా కఠినంగా ఉండే ఇతర రంగాలలోని వారికి పెద్ద మార్పు అని చెప్పవచ్చు. కొత్త కోడ్‌ల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు, వారానికి 48 గంట లు పనిచేయాలనే నియమం అలానే ఉంటుంది. కానీవాటిని ఎలా ఏర్పాటు చేసేకోవచ్చనేది మాత్రం మారుతుంది. దీనిని వారంలో నాలుగు రోజులు 12గంటలు, ఐదు రోజులు వారాంలో దాదాపు 9.5 గంటలు, ఆరు రోజులు వారంలో రోజుకు ఎనిమిది గంటలు కింద విభజించుకోవచ్చును. దీంతో పాటూ ఓవర్‌టైమ్ పరిమితిని స్థానిక అవసరాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమసొంత పరిమితులను నిర్ణయించుకోవచ్చు. కొత్త కోడ్‌లలో మరో ప్రధాన మార్పుఆరోగ్యం, వైద్యకవరేజ్. 40 ఏళ్ల పైబడిన ప్రతి ఉద్యోగికి ఇప్పుడు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీ లభిస్తుంది. ముఖ్యంగా ఎక్కువ గంటలు, ప్రమాదకర వాతావరణాలు లేదా శారీరకఒత్తిడి సాధారణంగా ఉండేరంగాలలో, నివారణ ఆరోగ్య సంరక్షణ వైపు విస్తృత ప్రయత్నంలో ఇది భాగంగా ఉంటుంది. ముఖ్యంగా, తోటల కార్మికులకు ఇప్పుడు గతంలో ఒకేవిధంగా అందుబాటులో లేని వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ నిబంధన కార్మికులకు అనుకూలంగా ఎన్డీయే ప్రభుత్వం ఈ కోడ్‌లను రూపొందించింది. ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయి. యువతకు నియామక పత్రాలు అందుతాయి, మహిళలకు సమాన వేతనాలు, గౌరవం లభిస్తుంది. 40కోట్లమంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది, ఫిక్స్‌డ్ టెర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయి. 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతం. •

(రచయిత : కార్మికశాఖ మంత్రి)

## వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాలను పెంచాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 25,ప్రభాతవార్త: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వీధి కుక్కలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆహారం పెట్టే ప్రదేశాలను నగర పరిధిలో మరిన్ని పెంచాలని,జంతు ప్రేమికుల సౌజన్యంతో ఈ ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆయన టెక్కిలి



రోడ్డు,మొగల్రాజపురం,మథర్ థెరిస్సా జంక్షన్,పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు,లయోలా కళాశాల రోడ్డు,కళాశాల రోడ్డు,ఈఎస్ఐ ఆస్పటల్ రోడ్డు,వెటర్నరీ కాలనీ, గులాబి తోట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గుణదల ఈఎస్ఐ హాస్పటల్ రోడ్డు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్లు అందరూ తమ తమ పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను కాంరటాక్ట్లో ఉన్న గడువు లోపు పూర్తి చేయించేటట్లు చర్యలు తీసుకోవాలని, అనుకున్న సమయానికి పనులనీన పూర్తి అయ్యేటట్లు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గులాబీ తోట వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను క్షేత్రస్థాయిలో పరిశీలించి,త్రాగునీటి,వాడుక నీటి సరఫరా,ఆహారంలో నాణ్యత,సమయపాలన,పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని,అధికారులు తమ తమ అన్న క్యాంటీన్లను ప్రతి రోజు పర్యటిస్తూ ఏమైనా మరమ్మత్తులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాన రహదారుల్లో మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలి

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 25,ప్రభాతవార్త: ప్రధాన రహదారుల్లో ఏమైనా మరమ్మత్తులుంటే వెంటనే వాటిని పూర్తి చేయాలని,గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని,నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా అభివృద్ధి కార్యక్రమాలైనా,పారిశుద్ధ నిర్వహణైనా సజావుగా జరగాలని అధికారులను మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం ఆయన ప్రధాన కార్యాలయం లోని తన ఛాంబర్లో సంబంధిత శాఖాధిపతులతో పారిశుద్ధ నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, నగరం పరిశుభ్రంగా ఉండాలని, వ్యర్థాలు ఎప్పటికప్పుడు సేకరించాలని,



సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్కు తొలగించాలని,రహదారులు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని దేశించారు. ఈ సమావేశంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,పర్యవేక్షణ ఇంజనీర్(వర్క్స్) వి.శ్రీనివాసరెడ్డి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు,శానిటరీ సూపర్వైజర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు పన్ను బకాయిలు తెలియపర్చి పన్ను వసూలు చేయాలి : డిప్యూటీ కమీషనర్ (రెవెన్యూ) సృజన

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 25,ప్రభాతవార్త: నగర పరిధిలో ఉన్న ఆస్థి పన్ను,ఖాళీ స్థలాల పన్ను,వాటర్ ఛార్జీలు,డ్రైనేజి ఛార్జీలు ప్రతి ఇంటికి వెళ్ళి,ప్రజలకు వారి పన్ను బకాయిలను తెలియపర్చి పన్ను వసూలు చేయాలని డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ) జి.సృజన అన్నారు. నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో మీటింగ్ హాల్లో రెవిన్యూ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలు,ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటి పైన ఇళ్ళు నిర్మించారా,ఒకవేళ ఇళ్ళను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా పన్నుఉ ఇంటి పన్నుకు మార్చాలని, ఇంటి పన్ను ఉన్న



అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్కు తగ్గట్టుగా ఉందా లేదా,ఒకవేళ అదనంగా రూములు నిర్మించినా,ఫ్లోర్లు నిర్మించినా,ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును మార్చాలని, రెసిడెన్షియల్గా ఉన్న ఆస్తి కమర్షియల్గా మారితే దానికి తగ్గట్టుగా పన్ను వేయాలని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఖచ్చితంగా పూర్తి చేయాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్లు హెలెన్,ఏయూబ్ శర్మ,డి.శ్రీనివాస్,రెవిన్యూ ఆఫీసర్లు,ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈలను బలోపేతానికి ప్రభుత్వంతో వాల్మార్ట్ వృద్ధి ఎంఓయూ

విజయవాడ, నవంబర్ 25, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు వాణిజ్య శాఖతో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసినట్లు వాల్మార్ట్ ఇంటర్నేషనల్ సోర్సింగ్, సప్లయర్ డెవలప్మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాసన్ ఫ్రెమ్స్టాడ్ తెలిపారు. 2028 వరకు ఉచిత శిక్షణ , వృద్ధిగతికెరించిన మార్గదర్శకత్వంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం జరిగిందని అన్నారు. విశాఖపట్నంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు 2025లో నిర్ణయం మేరకు ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. 2028 నాటికి అదనంగా 100,000 ఎంఎస్ఎంఈలకు శక్తివంతం చేయడం ద్వారా తమ వృద్ధి సూచిస్తున్నారు.

## అలరిస్తున్న ద ఫేస్ ఆఫ్ ద ఫేస్ లెన్స్



విజయవాడ, నవంబర్ 25, ప్రభాతవార్త : ద ఫేస్ ఆఫ్ ద ఫేస్ లెన్స్ సినిమా తమను ఎంతగానో అలరింపోందిదని విజయవాడలోని ఆసినిమా ప్రేక్షకులు, అభిమానులు తెలిపారు. సెయింట్ ఆన్స్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, ప్రార్థన మందిరాల ఫాదర్లు కలిసి మంగళవారం జయరాం థియేటర్లో సినిమాను తిలకించిన అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో క్రిస్టియన్ మిషనరి సంస్థలు చేస్తున్న సేవలను సినిమాలో అద్భుతంగా చూపారన్నారు. ప్రదర్శనల్లో భాగంగా కృష్ణా జిల్లా, ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రేక్షకుల కోసం ఉదయం ఆట మరియు సాయంత్రం ఆట మాత్రమే ప్రదర్శిస్తున్నామని మురళీధర్, శాంతయ్యలు తెలిపారు.

## క్రిస్మస్ వేడుకలకు వార్షిక కేకు మిక్సింగ్

విజయవాడ, నవంబర్ 25, ప్రభాతవార్త : సెమీ క్రిస్మస్, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల కోసం యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థుల వార్షిక కేక్ మిక్సింగ్ ఆకట్టుకుంది. మాచవరంలోని కాలేజ్లో మంగళవారం



విద్యార్థులు, అధ్యాపకులు, చెఫ్ సిబ్బంది పాల్గొని పండుగ వాతావరణంలో కేక్ మిక్సింగ్ను డ్రై ఫ్రూట్స్, నట్స్, క్యాండీడ్ పీల్స్, సుగంధ మసాలాలు వైన్/రసాలతో మిళితం చేశారు. కాలేజ్ డైరెక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తమ కాలేజీను 2020లో ప్రారంభించామని నాటి నుండి ప్రతిఏటా కేక్ మిక్సింగ్ జరుపుతున్నామన్నారు. ఇప్పటివరకు తమ కళాశాల నుండి 1000కి పైగా విద్యార్థులు డొమెస్టిక్ మరియు ఇంటర్నేషనల్ ఉద్యోగాలు పొందారన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఎన్నో విషయాలు తెలుసుకుని ఆనందించారన్నారు. కాలేజ్ కరస్పాండెంట్ కరీమా, ప్రిన్సిపాల్ జంపన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వీఆర్ జెసిలో అంతర్జాతీయ స్త్రీహింస వ్యతిరేక దినోత్సవం

గుంటూరు విద్య, ప్రభాతవార్త: ప్రతి రంగంలో మహిళలు అగ్ర స్థానంలో సేవలందిస్తున్నారని, స్త్రీల పై వివక్ష విడనాడి పురుషునితో సమానంగా సముచిత స్థానం కల్పించినప్పుడే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాడు స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీని నిర్వహించారు. మహిళా భద్రత, రక్షణకు ప్రభుత్వాలు అనేక కఠిన చట్టాలు తీసుకొచ్చాయని, వీటి పై ప్రతిఒక్కరికి అవగాహనను కల్పించాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా వుండాలని, విద్యార్థినులు తమ వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ మీడియాలో పొందుపరహకుండా గోప్యంగా ఉంచుకోవాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ,ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె.రవీంద్ర, కళాశాల ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డా.జి.సుధా వాణి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయు'

గుంటూరు విద్య, ప్రభాతవార్త: పోరాటాలకు పుట్టినిల్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అని, హక్కులు, బాధ్యతలను రెండు కళ్ళుగా భావించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు చిత్త శుద్ధితో కృషి చేస్తున్న సంఘం ఎస్టీయూ అని ..ఎస్ టి యు.. రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు పేర్కొన్నారు. ఎస్టీయూ నకరికల్లు మండల శాఖ ఆధ్వర్యంలో నకరికల్లు మండలంలో ఎస్టీయూ సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ టి యు పల్నాడు జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎ ఏమండీ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడి గత 79 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్టీయు అన్నారు

# విజయవాడ వార్త





మంగళవారం పలు సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు. (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## జిల్లా కలెక్టర్కు కౌన్సిలర్ల వినతి

తిరువూరు, నవంబర్ 25 ప్రభాతవార్త : తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశములో జరిగిన కొన్ని అవకతవకలపై తిరువూరు నగర పంచాయతీ చైర్పర్సన్ అనైతికంగా వ్యవహరిస్తున్న తీరు వైయస్సార్సీపి కౌన్సిలర్స్ను డిస్క్వాలిఫై చేసిన వారిని కొనసాగించే విషయమై మరియు నగర



పంచాయతీ నిధులు దుర్వినియోగంపై అలాగే ఇటీవల రెండు కోట్ల 50 లక్షల రూపాయల టెండర్లు సాంకేతికపరమైన అంశాలు పూర్తిచేసుకుని కౌన్సిల్లోకి వచ్చినను దానిని అడ్డుకుంటూ 5 కోట్ల రూపాయల నిధులను మరియు అభివృద్ధిని ఆటంకపరుస్తున్న తీరును విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. కలెక్టర్ కలిసిన వారిలో తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్స్ షేక్ అబ్దుల్ హుస్సేన్, నాళ్ల సురేంద్ర, జిడమళ్ళ సత్యవతి, మూడు దుర్గారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గత్తం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వైద్య పరీక్షలు

తిరువూరు, నవంబర్ 25 ప్రభాతవార్త : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) నాయకత్వంలో తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ సొంత ఖర్చులతో (ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్) అంగవైకల్యం ఎక్కువగా కలిగి ఉండి సదరం సర్టిఫికెట్ తీసుకోని అంగవికలురను పార్టీలకు అతీతంగా తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ



ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా విజయవాడ కొత్త గవర్నమెంట్ హాస్పిటల్కు పంపి డాక్టర్ల బృందంచే ప్రత్యేకంగా వైకల్య పరీక్షలు జరిపి ంచి అంగవైకల్యం ఎక్కువగా ఉన్నవారికి అక్కడి నుండి పెన్షన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు తెలుగుదేశం పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం జరిగే ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని తిరువూరు టౌన్ ప్రజలకు తిరువూరు పట్టణ మరియు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయ ముఖంగా తెలియపరిచారు.

## లబ్దిదారులకు సి.యం.ఆర్.ఎఫ్.చెక్కుల పంపిణీ

పెనమలూరు నవంబరు25,ప్రభాతవార్త : పేదవారికి ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపకరిస్తుందని పెనమలూరు నియోజకవర్గ శాశనసభ్యులు బోడేప్రసాద్ అన్నారు.పోరంకి తెలుగుదేశంపార్టీకార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 53మందికి 22లక్షల 47వేల579రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు వర్గాల ప్రజలు హాస్పిటల్కి వెళ్ళి



నగదు చెల్లించిన పేదవారికి అండగా ఉండాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సి.యం.ఆర్.ఎఫ్ ద్వారా ఆయావర్గాల ప్రజలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నారన్నారు. గడచిన సంవత్సరంలో 1098మందికి 9కోట్ల89లక్షలు రూపాయల మేర ఆర్థికసహాయం అందజేసామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమినాయకులు,కోయాఆనంద్,అనుమోలుప్రభాకరరావు,పవన్,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గుంటూరు సిసిఐ బయ్యర్ల తీరుతో పత్తిరైతుల విలవిల

ఎ కొండూరు, నవంబర్ 25, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం తిరువూరు ఎ కొండూరు గంపలగూడెం విసన్నపేట మండలాల్లో రైతులు పండించిన పత్తిని సిసిఐ కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదని పత్తి రైతులు ఆరోపించారు. ఈ నియోజకవర్గంలో ఎఎంసిల ద్వారా శ్లాట్ బుక్ చేసుకుని శ్లాట్లో వచ్చిన గుంటూరులోని జిన్నింగ్ మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. గుంటూరులోని సిసిఐ బయ్యర్లు కనీసం రైతులు ఎన్నో వ్యయప్రయాజలోర్చి గుంటూరు వెళితే కనీసం పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించకుండా ఈ నియోజకవర్గంలోని పత్తి రైతులను బయ్యర్లు కనీసం తమ ముఖాల వైపు కూడా చూడకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో పత్తిరైతులు లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితి తిరువూరు ఆర్డీవో స్థాయి అధికారి దగ్గర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు సిసిఐ సెక్రటరీలకు తెలియపర్చినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మోథా తుఫాన్తో పూర్తిస్థాయిలో పత్తిపంట నష్టపోయిన పత్తిరైతులు సిసిఐ ద్వారానైనా గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో గుంటూరు సిసిఐ కేంద్రాలకు వెళితే బయ్యర్ల తీరు తమకు జుగుప్సాకరంగా ఉందని సన్న చిన్నకారు పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. దళారీలు క్వింటా పత్తిని రూ.6500 కొనుగోలు చేస్తుండగా సిసిఐ ద్వారా రూ.7700కు కొనుగోలు చేస్తామని ప్రజా ప్రతినిధులు ఊదర గొట్టారని తీరా అక్కడకు పత్తిరైతులు గంపెడాశతో వెళ్లగా కనీసం పత్తిని దిగుమతి చేసుకునే నాథుడే లేదని అయినకాడికి పత్తిని దళారులకు తెగనమ్ముకొని పత్తిరైతులు లబోదిబోమంటున్నారు. ఇకనైనా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆదుకోవాలని నియోజకవర్గ పత్తి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శామ్సంగ్, నుండి ఆర్20 అల్ట్రాసౌండ్ సిస్టమ్

విజయవాడ, నవంబర్ 25, ప్రభాతవార్త : సూపర్ప్రీమియం, నెక్స్ట్ జనరేషన్ ఆర్20 అల్ట్రాసౌండ్ సిస్టమ్ను తాము విడుదల చేస్తున్నట్లు శాంసంగ్ ఇండియా ప్రతినిథులు తెలిపారు. అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలు, అత్యుత్తమ ఇమేజ్ క్లారిటీ, వైద్యుడి సౌకర్యం, సామర్థ్యంపై దృష్టి సారించిన ఎర్గోనామిక్ డిజైన్ను కలపడం ద్వారా సాధారణ ఇమేజింగ్లో ఆర్20 ఒక పెద్ద ముందడుగని, అత్యాధునిక క్రిస్టల్ ఆర్కిటెక్చర్ ఆధారిత ఆర్20, సాధారణ ఇమేజింగ్ అప్లికేషన్ల విస్తృత శ్రేణిలో అద్భుతమైన చిత్ర ఏకరూపత, రిజల్యూషన్, లోతైన వివరాలనందిస్తుందనితెలిపారు

## 'పశ్చిమ'లో సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్, నవంబర్ 25,ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రతి మంగళవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న మహిళా గ్రీవెన్స్ డే ఆరవవారం విజయవంతంగా జరిగింది.ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రతి మహిళతో ఒక్కొక్కరితో సమావేశమయ్యారు. గత ఆరు వారాలలో మొత్తం 300కు పైగా మహిళల నుండి అర్జీలు స్వీకరించగా, వాటిలో దాదాపు 200 అర్జీలకు ఇప్పటికే సమాధానాలు ఇవ్వడం, సమస్యలను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార దిశగా తీసుకెళ్లడం జరిగినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మిగిలిన పెండింగ్ గ్రీవెన్సులను కూడా క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేసుకుంటూ మహిళల కోసం ప్రత్యేకంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## బాలలపై లైంగిక దాడులను అరికట్టాలి...



**తుళ్ళూరు,నవంబర్ 25,ప్రభాతవార్త:** సమాజంలో నానాటికి బాలలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ వైద్యాధికారి జ్యోతిర్మయి అన్నారు.మంగళవారం తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌమార బాలబాలికలపై లైంగిక దాడుల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో అనురాధ మాట్లాడుతూ ..పిల్లలను బాధ్యతగా పెంచడంతోపాటు వారి చుట్టూ ఉన్న సమాజం కదలికలపై బాలబాలికల తల్లిదండ్రులు అవగాహన కల్గి ఉండాలన్నారు.పిహెచ్సి వైద్యాధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఎన్ఎం,ఆశాలు ఇంటింటికీ తిరిగే క్రమంలో బాలబాలికల స్థితిగతులను గమనించాలని సూచించారు.కార్యక్రమంలో పిహెచ్సి సిహెచ్ఓ జి.వెంకటరమణ,వైద్యాధికారి టి.శివపార్వతి,ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్కె మున్నా,హెల్త్ సూపర్ వైజర్ డి.శ్రీనివాసరెడ్డి,హెల్త్ అసిస్టెంట్ ఎస్కె కరీం, అంగన్వాడీలు,ఆశాలు పాల్గొన్నారు.

## డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలు,అనధికార నిర్మాణాలను తొలగిస్తున్నాం : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 25,ప్రభాతవార్త: నగర పరిధిలో గల డ్రైనేజి పైనున్న ఆక్రమణలు,అనధికార కట్టడాలను తొలగిస్తున్నామని,ప్రత్యేకంగా వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా డ్రైనేజి వ్యవస్థలో ఎటువంటి లోపాలు లేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా డ్రైనేజీపై ఆక్రమణలను తొలగిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం వర్షపు నీరు రోడ్డుపై ఉండకుండా డ్రైనేజి వ్యవస్థలో ఎటువంటి లోపాలు



లేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా స్క్రూబ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్లో గల డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను,కృష్ణలంకలో ఉన్న అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దీన్ని గమనించాలని, అనుమతి లేనిదే భవనాలు నిర్మించరాదని,ఆగస్టు 31,2025 కల్లా ఏమైనా అనధికార భవనాలు నిర్మిస్తే వెంటనే బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం ద్వారా ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్బాబు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లో స్వయంగా వడ్డించిన కమీషనర్ ధ్యానచంద్ర

### అధికారులందరూ తమ అన్న క్యాంటీన్లను పర్యవేక్షించాలని ఆదేశాలు

విజయవాడ కార్పొరేషన్,నవంబరు 25,ప్రభాతవార్త: అన్న క్యాంటీన్లో మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర తానే స్వయంగా ప్రజలకు ఆహారాన్ని వడి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్ను ప్రతి రోజూ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మంగళవారం ఉదయం ఆయన గులాబితోట వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అన్న క్యాంటీన్లో పారిశుద్ధ నిర్వహణ, త్రాగు నీటి, వాడుక నీటి , ఆ హా ర ం లో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడున్న ప్రజలతో మాట్లాడి



అన్నా క్యాంటీన్లో వారికేమైనా ఇబ్బందులున్నాయా అని కనుక్కున్నారు.అధికారులందరూ తమ తమ అన ్న క్యాంటీన్ని ప్రతి రోజు పర్యవేక్షించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ఏమైనా మరమ్మత్తులు ఉంటే వెంటనే పూర్తి చెయ్యాలన్నారు.

## అంగరంగ వైభవంగా సోషల్ వీక్ సెలబ్రేషన్స్

ఎ కొండూరు, నవంబర్ 25, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోషల్ వీక్ సెలబ్రేషన్స్ డే-2 ఇండియన్ ఫెస్టివల్ ఎక్స్పో కార్యక్రమాన్ని యాజమాన్యం సిబ్బంది అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈస్కూల్లో 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు భారతదేశంలోని ఆయారాష్ట్రాలకు చెందిన ప్రజలు పాటించి విభిన్న సంస్కృతులు సాంప్రదాయాలు పాటించే ఆచార వ్యవహారాల శైలిపై ఆయా రాష్ట్రాల వేధధాం ఇలతో విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు ఆట పాటలు రంగురంగుల హరివిల్లులు







అలరింప చేశాయి. ఈ సోషల్ వీక్ సెలబ్రేషన్ డే-2 ఇండియన్ ఫెస్టివల్ ఎక్స్పో కార్యక్రమంలో ఆర్ఐ సర్ వినోద్, ప్రిన్సిపాల్ రత్నదుర్గ, డీన్ తాతారావు, ఇన్చార్జ్ బుచ్చిబాబు, లక్ష్మి సోషల్ డిపార్ట్మెంట్ సంధ్యారాణి సిబ్బంది పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

## మానవత్వం కరువవుతోందనేందుకు పెరుగుతున్న అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలే సాక్ష్యం

ఎ కొండూరు, నవంబర్ 25, ప్రభాతవార్త : ప్రపంచంలో ఎక్కడైనా అనాధ ఆశ్రమాలు వృద్ధాశ్రమాలు పెరిగి పోతున్నాయంటే అక్కడ మానవత్వం మంటగలుస్తుందనే సంకేతాలను సూచిస్తుందని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా తనయుడు విజయనగరం హజరత్ ఖాదర్ వలీబాబా దర్గా అండ్ దర్బార్ షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త డాక్టర్ ఎండి ఖలీల్ బాబు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. మానవత్వానికి ప్రేమకు మాతృకగా నిలిచే సూఫీ పరంపర దక్షిణ భారత సూఫీ సామ్రాట్ దైవాంశ సంభూతులు మహర్షి విజయనగరం హజరత్ ఖాదర్ వలీబాబా ప్రియశిష్యులు హజరత్ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా (ర.అ) వారి 89వ జన్మదినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు డాక్టర్ ఖలీల్ బాబు తెలిపారు. ఈ



సందర్భంగా సామాజిక సేవకులు డాక్టర్లు బాబా ప్రేమికులు డాక్టర్ ఎ శ్రీధర్ సంతోష్ సోదరులతో కలిసి డాక్టర్ ఖలీల్ బాబు ఎటికె వెలుగు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ ఖలీల్ బాబు మాట్లాడుతూ మనసుల్లో ప్రేమ దూరమైతే మనుష్యుల మధ్య బంధాలు దూరమవుతాయని మనిషి హృదయం మలినమైతే మానవత్వం చచ్చిపోతుందని డాక్టర్ ఖలీల్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైతే తమ హృదయాల్లో ప్రేమను నింపుకుని సత్కార్యాలు చేస్తారో వారిపై దైవ కరుణ తప్పక ఉంటుందని ఖలీల్బాబు ఉద్బోదించారు. సాటి మనిషిని ప్రేమిస్తూ వారి భాదల్లో పాలుపంచుకోవాలని ప్రతి ఒక్కరిని వేడుకొంటూ సూఫీ చంద్రబింబం హజ్రత్ ఖాదర్ బాబా వారి దయ కరుణ కటాక్షం ప్రతి ఒక్కరిపై ప్రసరించాలని అందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని డాక్టర్ ఖలీల్ బాబు దర్గా అండ్ దర్బార్లో దువా చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో బాబా సేవకులు రంగారావు బాబాయ్ సోషల్ సర్వీస్ యూత్ అంబాసిడర్ ఎండి అహ్మద్ బాబు, జుజ్జూరు ఖాదర్, జర్నలిస్ట్ జయరాజ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

## బ్యాంకు మేనేజర్లతో సమావేశం



వినుకొండ, నవంబర్ 25, ప్రభాత వార్త: ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర సహకార బా ్యంకు నందు బ్యాంకు మేనేజర్ల సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సీఈవో ఫణి కుమార్ , అధికారులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల్లో డెకాయ్ ఆపరేషన్



ఈపూరు, నవంబర్ 25, ప్రభాత వార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మద్యం కొనుగోలుదారులతో మాట్లాడి ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. క్యూఆర్ స్కాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మద్యం కేసులోని నలుగురు నిందితులను రొంపిచర్ల మండల తహశీలా ్ధర్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## నరగాయపాలెంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం



వినుకొండ, నవంబర్ 25, ప్రభాత వార్త: మండలంలోని నరగాయపాలెం గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. శ్రీరాములు, వినుకొండ ఉద్యాన శాఖాధికారి నబి రసూల్, మండల వ్యవసాయాధికారి జి. వరలక్ష్మి పాల్గొని వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్వే కార్యక్రమంలో ప్రతి రైతు పాల్గొనాలని చెప్పారు.

## ప్రభుత్వ వైద్యశాలలో డిసిహెచ్ఎస్ ప్రసన్న ఆకస్మిక తనిఖీ



సత్తెనపల్లి, నవంబర్ 25, ప్రభాతవార్త: సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్‌లో డిసిహెచ్ఎస్ ప్రసన్న ఆకస్మిక తనిఖీలు చేశారు. హాస్పటల్ మొత్తం సందర్శించి రోగులను పరామర్శించారు. ఓపి రిజిష్టర్లు, హాస్పిటల్ కి సంబంధించిన పరిసరాలన్నీ పరిశీలించారు. వైద్యులు రోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సిబ్బందిని సూచించారు. అటెండెన్స్ లేని వైద్యులను, స్టాఫ్ నర్సులను పిలిచి మందలించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సత్తెనపల్లి, నవంబర్ 25, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని ఈద్గా దర్గా ఎదుట సుమారు 70 సంవత్సరాల వయస్సు గల ఒక వృద్ధుడు మంగళవారం మృతదేహంగా కనిపించాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. గుర్తు తెలియని ఈ వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఇతను గురించి తెలిసినవారు సత్తెనపల్లి టౌన్ శీబీవీ (9440796230)కి తెలుపగలరని విజ్ఞప్తి చేశారు.

## ప్రజాసమస్యలు నేరుగా తెలుసుకునేందుకే వంద రోజులు కార్యక్రమం: ఎమ్మెల్యే ప్రవీణ్





పెదకూరపాడు, నవంబర్ 25, ప్రభాతవార్త: పెదకూరపాడు మండలంలోని జలాల్ పురం గ్రామంలో మూడవ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటన కొనసాగింది. 100 రోజులు 100 గ్రామాలు పర్యటనలో భాగంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకునేందుకు గ్రామస్థులు తరలివచ్చారు . ప్రజల సమస్యలను నేరుగా విని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సచివాలయ సిబ్బంది అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేలా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. 4 మంది అంగన్వాడి టీచర్లకు, 11మంది ఆయాలకు నియామక పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. గ్రామంలో ఔటరింగ్ కోసం అవసరమైన భూ సేకరణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు . గ్రామ మండల టిడిపి నేతలు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో డిసిహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ



పెదకూరపాడు, నవంబర్ 25, ప్రభాతవార్త: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన సూచించారు. మంగళవారం మండలంలోని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు, సేవలపై ఆరా తీశారు. ఖాళీగా ఉన్న సర్జన్, అనస్థీషియా వైద్యులను సిహెచ్సికి కేటాయించడం జరిగిందని వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు..

## ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల పరిశీలన




క్రోసూరు, నవంబర్ 25, ప్రభాతవార్త: పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు మంగళవారం క్రోసూరు మండలంలోని దొడ్లేరు మరియు ఆవులవారిపాలెం గ్రామాలలోని 98, 99 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుమ్మెత కోటి రెడ్డి గారు, మండల పార్టీ అధ్యక్షుడు మొగల్ జాను, కస్టర్ ఇంచార్జ్ ఏపూరి నాగేశ్వరరావు , యూనిట్ ఇంచార్జ్ పిల్లా నరసయ్య పాల్గొన్నారు. అలాగే 98వ బూత్ కన్వీనర్ మొగల్ సమీర్, 99వ బూత్ కన్వీనర్ అల్లరి సుధాకర్ , గ్రామ పార్టీ అధ్యక్షులు యాగటిల విష్ణుమూర్తి , ఇందిరమ్మ శీను , 4వ వార్డ్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్ , వేల్ల రాంబాబు, గుడిపూడి బడే పాల్గొన్నారు.

## 'అనుమానిత మచ్చల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేయాలి'

క్రోసూరు, నవంబర్ 25, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా క్రోసూరు మండలం గుడిపాడు గ్రామంలో కుష్టు వ్యాధి గుర్తింపు కోసం నిర్వహిస్తున్న లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) ను ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మంగళవారం పర్యవేక్షి ంచారు. ఈ నెల 30 వరకు జరిగే ఇంటింటి లెప్రసీ సర్వేలో ఆశా వర్కర్లు, మేల్ వాలంటీర్లు ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. స్క్రీనింగ్ కోసం ఇంటింటికి చేరే ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని శిఖా శాంసన్ సూ చేశారు. అనుమానిత మచ్చలు లేదా కుష్టు కేసుల వివరాలు వెంటనే వైద్య అధికారులకు తెలియజేయాలని సిబ్బందిని ఆయన కోరారు. పర్యటనలో భాగంగా మాతా శిశు సంరక్షణ, గర్భిణీ స్త్రీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు, వ్యాధినిరోధక టీకాలు, ఎన్‌సీడీసీసీడీ స్క్రీనింగ్ వివరాలు, నిమోనియా కేసులపై ఆయన వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దివ్య, ఆరోగ్య కార్యకర్త నిర్మల, ఆశా కార్యకర్త శివకుమారి తదితరులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## 'రైతన్న నీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నరసరావుపేట, నవంబర్ 25 ప్రభాతవార్త::రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని గురవాయిపాలెం గ్రామంలో నూతనంగా ప్రవేశపెట్టిన రైతన్న నీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురవాయిపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం మరియు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి రెండో విడత నిధులు 400 మంది రైతుల ఖాతాలకు నేరుగా జమా అయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభించారని అన్నారు. ముందుగా ఎమ్మెల్యే గురవాయిపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతులతో మాట్లాడి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



నరసరావుపేట, నవంబర్ 25 ప్రభాతవార్త ::విద్యార్థులు క్రీడలలో ప్రావీణ్యతను సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు అన్నారు. స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాల వాలీబాల్ పోటీలు మంగళవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, యూనివర్సిటీ ప్రొఫెసర్ రామినేని శివరాం ప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. క్రీడల ద్వారానే శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ పోటీలలో ఏఎన్యూ యూనివర్సిటీ స్థాయిలో 20 జట్లు పాల్గొన్నాయని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జరిగిన పోటీలలో చేబ్రోలు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పై నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజ్ విజయం సాధించిందన్నారు. నరసరావుపేట పిఎన్సీ అండ్ కెఆర్ కాలేజ్ పై బి.ఏ. సి ఎస్ బాపట్ల కాలేజ్ గెలుపొందిందని, ఎస్కెఆర్బిఆర్ పై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, విజయం సాధించిందని తెలిపారు. అలాగే, నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కాలేజ్ పై గుంటూరు బిజెపిఎస్ గుంటూరు విజయం సాధించిందన్నా రు. విద్యాకేంద్రం పై కృష్ణవేణి డిగ్రీ కళాశాల కాలేజ్ విజయం సాధించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ కె నాసరయ్య, టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ ఈదర ఆదిబాబు, యూనివర్సిటీ అబ్జర్వర్ కమిటీ మెంబర్స్ పాతూరి శ్రీనివాసరావు, గిరి శంకర్, ధనలక్షి ్మ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్రావు పాల్గొన్నారు.

## ఎన్ఇసిలో 77వ ఎన్‌సిసి దినోత్సవ వేడుక



నరసరావుపేట క్రైమ్, నవంబర్ 25 ప్రభాతవార్త : నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం 77వ ఎన్సీసీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు వేడుకలను ప్రారంభించి, మాట్లాడుతూ తాను కూడా గతంలో ఎన్సీసీ క్యాడెట్గా సేవలందించానని తెలిపారు. భారత సైన్యంలో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, సమాజంలో ఎన్సీసీ క్యాడెట్ల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందని చెప్పారు. లెఫ్టినెంట్ అధికారి ఎన్.ఎస్. పర్మార్ మాట్లాడుతూ ఎన్సీసీ కేవలం యూనిఫాం కాదని, అది ఒక విలువల దృక్పథమని చెప్పారు. బాధ్యత, జట్టు దృక్పథం, సమయపాలన మరియు దేశభక్తి వంటి లక్షణాలు ఎన్సీసీ విద్యార్థుల్లో సహజంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ ఎం. రాజేశ్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్సిసి క్యాడేట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీ

### నలుగురిపై బైండోవర్ నమోదు


నరసరావుపేట క్రైమ్, నవంబర్ 25 ప్రభాతవార్త ::మండలంలో వి.రెడ్డిపాలెం, ఆరేపల్లి గ్రామాల్లో గల మద్యం షాపులను బుధవారం ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు వివరాలు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం షాపులు ముందు "ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్"ద్వారా మద్యం అమ్మకాలు జరిగే విధంగా చూడడం జరుగుతుందని అన్నారు. మద్యం షాపుల్లో డెకాయ్ ఆపరేషన్స్ చేసి మద్యం ధరలను నిర్ధారించి విక్రయించాలని అన్నారు. తమ సర్కిల్ పరిధిలో నాటు సారాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ విధంగా విక్రయించే వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అదే విధంగా మండలంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న విప్పర్లపల్లి గ్రామానికి చెందిన ఒకరిని, అన్నవరం గ్రామానికి చెందిన ఇద్దరిని, సంతగుడిపాడు గ్రామానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై తహశీల్దార్ కార్యాలయంలో బైండోవర్ నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు వాగ్దేవి విద్యార్థి ఎంపిక



రొంపిచర్ల, నవంబర్ 25 ప్రభాతవార్త : జాతీయస్థాయి ఛాంపియన్షిప్ ఆటల పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యారు. వివరాలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఒగూరి నాగేశ్వరరావు మంగళవారం తెలియజేశారు. కర్ణాటక రాష్ట్రంలో 6 జోన్ ఛాంపియన్షిప్ పోటీలలో కళాశాలకు చెందిన విద్యార్థి డి బసవ శివశంకర్ పాల్గొని మంచి ప్రతిభ చూపారన్నారు. శివశంకర్ ను ఆంధ్ర జట్టు తరఫున నేషనల్ మీట్ కు సెలక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తున్న తమ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం అన్ని విధాలా అందిస్తామని వారు వివరించారు. విద్యార్థి శివశంకర్ ను అభినందించిన వారిలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తో పాటు డైరెక్టర్లు రామ కోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పి. కృష్ణారావు, అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు ఉన్నారు.

## స్త్రీల హక్కులు, చట్టం అంశాలపై కరపత్రాల ఆవిష్కరణ



నరసరావుపేట నవంబర్ 25 ప్రభాతవార్త : స్త్రీల హక్కుల పరిరక్షణ మరియు స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం నరసరావుపేట పట్టణ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్త్రీల హక్కులు మరియు చట్టాలు అనే అంశంపై కరపత్రాలను పల్నాడు జిల్లా మహిళ శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిని ఎం. ఉమాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ భద్రత ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ వారి రక్షణ కోసం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి మహిళల రక్షణ, భద్రత కోసం కరపత్రాలను ముద్రించటం మంచి శుభ పరిణామన్నారు. మహిళలు, బాలికలు మానసికంగా శారీరకంగా ఎమోషనల్ గా దృఢంగా ఉండాలని, సమస్య వచ్చినప్పుడు ఆత్మవిశ్వాసంతో ధైర్యంతో వాటిని పరిష్కరించడం కోసం వారి చట్టాలు హక్కులు తెలుసుకున్నట్లయితే సమస్యల నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందన్నారు. పని చేసే ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపులకు గురి అయినప్పుడు రక్షణ పొందే హక్కు, వరకట్న నిషేధ చట్టం మరియు గృహ హింస చట్టం, ఆస్తిని పొందే హక్కు, సమాన వేతన హక్కు లాంటి వాటిని కనీసం తెలుసుకొని ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యాలయ నోడల్ అధికారి అరుణ, హెల్ప్ ఫౌండేషన్ బుల్లిబాబు, సభ్యులు మురళీకృష్ణ, మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట, నవంబర్ 25, ప్రభాతవార్త: ప్రముఖ వైద్యులు అమ్మ దంత వైద్యశాల అధినేత, చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురం నందు నూతనంగా నిర్మించుకున్న గృహానికి ఈరోజు గృహప్రవేశ వేడుక జరిగిన సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం జరుగుచుండగా వేడుకకు హాజరై డాక్టర్ కృష్ణ మోహన్ డాక్టర్ కవితను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసిన శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ లలితమ్మ , సోమేపల్లి వెంకట సుబ్బయ్య . ఈ వేడుకలో వారివెంట పమిడి శ్రీనివాస్ ,గేరా లింకన్ , గ్రంధి ఆంజనేయులు ,కూనల సత్యం , షేక్ కరిముల్లా తదితరులు ఉన్నారు.

## రైతులపై జగన్ కపట ప్రేమ: -జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్ పెంటెల బాలాజి



చిలకలూరిపేట, నవంబర్ 25, ప్రభాతవార్త: చిలకలూరిపేట: నాడు వ్యవసాయ రంగాన్ని, అన్నదాతలను నట్టేట ముంచి నేడు వైసీపీ అధినేత జగన్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్ పెంటెల బాలాజి చెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ జగన్ పాలన కాలంలో రైతులు ఎన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డారో తెలుసన్నారు. నాడు సీఎంగా జగన్ అనాలోచిత నిర్ణయాలు, విధానాలతో రాష్ట్ర రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని గుర్తు చేశారు. వ్యవసాయరంగం, రైతుల్ని ఆదుకోవడంలో సీఎం జగన్ కేవలం మాటల మనిషిగానే మిగిలిపోయాడని ఎద్దేవా చేశారు. గతంలో జరిగిన విషయాలు మర్చిపోయి ఉంటారని భావించి కొత్త పంథాలో రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకే విమర్శలు.. రాష్ట్రంలో తుఫాన్లు, వరదలు వచ్చిన సమయంలో వైసీపీ కనీసం రైతుల గురించి ఆలోచించలేదని, ఆ పార్టీ అధినేత జగన్ బయటకు వస్తే పరదాల చాటున దాక్కున్న విషయం ప్రజలు మరిచిపోలేదని బాలాజి గుర్తు చేశారు. ఉల్లి రైతులకు రూ. 1200 క్వింటా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయడమేకాక హెక్టార్‌కు రూ. 50 వేలు సాయం ప్రకటించిందని గుర్తు చేశారు. పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలను మార్కెటింగ్ ద్వారా కొనుగోలు గురించి మాట్లాడటం, అరటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి నిమిత్తం వారికి రవాణ సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు, మన్ననలు పొందుతున్న కూటమి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను చూపి వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో మద్దతు కోల్పోయి దిక్కుతోచని జగన్ ప్రజల దృష్టిని మరల్చేందుకు కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

## టిడ్కో నివాసితుల సమస్యల పరిష్కారానికి హామీ



చిలకలూరిపేట, నవంబర్ 25, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు 52 ఏకరాల్లోని టిట్కో హౌస్ కి సంబంధించి అక్కడ నివసిస్తున్న వారి సమస్యలను తెలుసుకొని ఎల్లుండి శాసనసభ్యులు దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలన్నీ త్వరగతిన పరిష్కరిస్తామని తెలియజేసిన మున్సిపల్ చైర్మన్ షేక్.రఫ్ఫాని. జనసేన నాయకులు రాజా రమేష్ , మరియు మున్సిపల్ సిబ్బంది టిట్కో ఏఈ మరియు చిట్కో సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థుల ప్రతిభ: జాతీయస్థాయి టోర్నమెంట్‌లో బంగారు పతకాలు



చిలకలూరిపేట, నవంబర్ 25, ప్రభాతవార్త: ఈనెల 23వ తారీఖున జరిగిన జాతీయస్థాయి కుంగ్ ఫు అండ్ కరాటే టోర్నమెంట్లో చిలకలూరిపేట పట్టణానికి చెందిన న్యూ షావులేని కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులు కటా విభాగంలో బంగారు పతకాలు సాధించి అబ్బురపరిచారు సబ్ జూనియర్, జూనియర్ విభాగాలలో వారి యొక్క ప్రతిభను కనపరిచి బంగారు పతకాలని కైవసం చేసుకున్నారు వారికి సి ఆర్ క్లబ్ లో అకాడమీ మాస్టర్లు మరియు క్లబ్ పెద్దల చేత అభినందన కార్యక్రమం నిర్వహించారు. హనుమంతరావు, కాళిదాసు, విద్యార్థులని మెడల్స్ తో సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు సబ్ జూనియర్ విభాగాల్లో కటావిభాగంలో వైభవ్, శశాంక్, షణ్ముఖులు అద్భుత ప్రదర్శన ఇచ్చి అలాగే జూనియర్ విభాగాల్లో సమీర్, అష్రాఫ్, అఖిల్ పాల్గొని తమ సత్తాని చాటారు వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్లను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు అకాడమీ మాస్టర్ బత్తుల విక్రమ్ మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలో గత పది సంవత్సరాలుగా స్థానిక సీఆర్ క్లబ్ లో ఎంతోమంది విద్యార్థులకు ఉచితంగా ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇస్తున్నామని మరి ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని తెలుసుకొని తప్పనిసరిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా ఆడపిల్లలకి ఈ సమాజంలో వారిపై జరుగుతున్నటువంటి దాడులను ప్రతిఘటించేందుకు వారికి మానసిక దృఢత్వానికి ఆత్మస్థైర్యానికి అదేవిధంగా ఫిట్నెస్ గా ఉండేటందుకు తోడ్పడుతుందని సెల్ఫ్ డిఫెన్స్ లో ప్రత్యేకమైన శిక్షణను సీనియర్ మాస్టర్ అకాడమీ చీఫ్ దర్యావలి నేర్పిస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలోమాస్టర్ యడ్ల సురేష్, ఇన్ స్ట్రక్టర్ షేక్ రబ్బానీ, సీనియర్ విద్యార్థులు పి.సాకేత్, షేక్ కమురుద్దీన్, ఎమ్ సుదీర్ మరియు అకాడమీ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పారా క్రీడా పోటీలు

నకరికల్లు, నవంబర్ 25 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, మరియు జిల్లా కలెక్టర్ చైర్మన్ ఆదేశాల మేరకు ఈనెల 27 న డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో పారా క్రీడాకారులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి. నరసింహ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. పారా క్రీడాకారులకు (బాల బాలికలకు) జిల్లా స్థాయిలో చెస్ మరియు బాడ్మింటన్ గేమ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా, డిఫెరెంట్లీ ఏబుల్డ్ వెల్ఫేర్ శాఖ మరియు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పారా స్పోర్ట్స్ గురించి ప్రజలలో అవగాహన కల్పించేందుకు వాక్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా పోటీలలో పాల్గొనే పారా క్రీడాకారులు మరిన్ని వివరాలకు 87126 22574 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## 'కృష్ణవేణి' లో స్త్రీహింస వ్యతిరేక దినోత్సవం

రొంపిచర్ల, నవంబర్ 25 ప్రభాతవార్త: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్త్రీల అభివృద్ధికి, రక్షణకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ



స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరవింద బాబు హాజరై, మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మిషన్ శక్తి, వన్ స్టాప్ సెంటర్లు, 181 విమెన్ హెల్ప్‌లైన్ ద్వారా బాధిత మహిళలకు తక్షణ సహాయం అందిస్తున్నాం అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా స్త్రీలపై జరుగుతున్న హింసలను అరికట్టడానికి అవగాహన కల్పించారు. విద్యార్థినులు నాటకాలు, డ్రామాలు, చర్చా సెషన్లు నిర్వహించి, గృహ హింస, లైంగిక వేధింపులు, డిజిటల్ హింస మొదలైన అంశాలపై చర్చించారు. ఆరంజ్ ద వరల్డ్ ప్రచారంలో భాగంగా కళాశాల ఆవరణాన్ని నారింజ రంగు రంగులతో అలంకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రొంపిచర్ల ఎస్ఐగా హరిబాబు



రొంపిచర్ల, నవంబర్ 25 ప్రభాతవార్త ::రొంపిచర్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా ఎ. హరిబాబు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. హరిబాబు నరసరావుపేట టుటౌన్ ఎస్ఐ గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐ గా పనిచేస్తున్న మణికృష్ణ బదిలీపై రాజుపాలెం పోలీస్ స్టేషన్ కు వెళ్లడం జరిగింది. నూతన ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన హరిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

**సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన :** రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ ఎ.హరిబాబు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లు వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. అవసరమైన మేరకు మాత్రమే ఫోన్లు వాడాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ సూచించారు. మండల



పరిధిలోని పలు పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఎస్‌కెఎం మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల, పచ్చలతాడిపర్రు ఎంపిపిఎస్ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల చేత వ్రాయించడం, చదివించడం వంటి కృత్యాలను పరిశీలించారు. విద్యార్థులు హాజరు శాతాన్ని పరిశీలించారు.మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని రుచిగా, శుచిగా తయారు చేసి వడ్డించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించుకోండి

పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు వి.రామకోటేశ్వరి కోరారు. మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం



చేకూర్చేందుకు ప్రతి రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం చేసిందన్నారు. రైతులు నష్టపోకూడదన్నదే ప్రభుత్వం యొక్క ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, సొసైటి వెంకట్రావు, గణిపివెట్టి రామకృష్ణ, గ్రామ సర్పంచి అశోక్, పి.దుర్గా హనుమంత్ ప్రసాద్, బండ్లమూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖా మంత్రిని కలిసిన జీడీసీఎమ్మెస్ ఛైర్మన్



పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మేడికొండూరు గ్రామంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడిని జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. పంట నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని మంత్రిని ఛైర్మన్ హరిబాబు కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతు సమస్యల పరిష్కారానికి వేగంగా స్పందిస్తున్నారన్నారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని ప్రజానీకం నమ్ముతున్నారన్నారు.

## రోడ్లను ఆక్రమిస్తే చర్యలు: మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు చేశారు. రోడ్లపై అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న స్టాల్స్, తోపుడు బండ్లు, వివిధ రకాల చిరువ్యాపారులు రోడ్లపై అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తుండడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుందన్నారు. నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టణాన్ని



సుందరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మునిసిపల్ సిబ్బంది పట్టణంలో పర్యటించి రోడ్ల మార్జిన్లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నవారిపై చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

## మహిళలు ధైర్యంగా ఉండాలి: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్

పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: మహిళలు అధైర్యపడకుండా, ధైర్యంగా ముందుకు సాగాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్ సూచించారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో



మంగళవారం అంతర్జాతీయమహిళా దినోత్సవం సందర్భంగా జడ్జి రుక్మిణి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో షేక్ బాజి సాహెబ్ మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలికలపై, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, హింసపై మహిళలు గళమెత్తాలన్నారు. డిసెంబర్ 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో షేక్ ముజీర్ మాట్లాడారు.

## 'రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి'

పొన్నూరు, నవంబరు 25,ప్రభాతవార్త: విద్యార్థులు భారత రాజ్యాంగ పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జైభీం సమూహం నిర్వాహకుడు ఎద్దు శామ్యూల్‌రాజ్ సూచించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్‌రాజ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరికి తెలియజెప్పేందుకు గత నాలుగేళ్ళుగా అవగాహన సదస్సులు, క్విజ్‌పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు



బుధవారం బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జైభీ సమూహం సభ్యులు జంగా రాజేష్, ఎడ్ల వందనం తదితరులు పాల్గొన్నారు.

## పనితీరుపై విశ్లేషణ, కొత్తవారికి అవకాశం కల్పించేలా పరిశీలన

మంగళగిరి, నవంబర్ 25, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీలో పిసిసి అధ్యక్షులుగా వివిధ విభాగాలలో పనిచేస్తున్న నాయకుల పనితీరుపై నేరుగా విశ్లేషణ కొత్త వారికి అవకాశం కల్పించేలా దేశవ్యాప్తంగా సంగతన్ సృజన్ అభయాన్ ద్వారా పరిశీలిస్తున్నట్లు ఏఐసీసీ పరిశీలకులు సౌమ్య రెడ్డి చెప్పారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలలో సంస్థా గత నిర్మాణాలపై చర్చించి తద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు . మంగళగిరి తాడేపల్లి బైపాస్ రోడ్ లో గల హ్యాపీ రిసార్ట్స్ లో సంస్థా గత నిర్మాణ కార్యక్రమం మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్ణాటక మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ పరిశీలకులు సౌమ్య రెడ్డి ని పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యార్థులు పూలతో స్వాగతం



పలికారు. ముందుగా ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు . ముందుగా పార్టీలో పని చేసేందుకు కొత్తవారిని ఆహ్వానిస్తూ పార్టీ క్రియాశీలక పత్రాలను విడుదల చేశారు అనంతరం ఆమె మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా బలోపేతం చేసేందుకు ఆ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఆదేశాల మేరకు సంగతన్ సృజన్ అభయాన్ ద్వారా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలోని వారితో చర్చిస్తున్నట్లు చెప్పారు, ప్రస్తుతం పిసిసి అధ్యక్షులుగా పనిచేస్తున్న వారి పనితీరును పరిశీలించి పార్టీకి మరిన్ని సేవలు అందించే విధంగా దిశా నిర్దేశం ఇవ్వటం జరుగుతుందన్నారు, అలాగే కొత్తగా పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్న యువతను ఆహ్వానిస్తూ క్రియాశీల పత్రాలను అందించడం జరుగుతుందని చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలు పార్టీపై ఉన్న విభేదాలను పరిష్కరించుకొని రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

# బాపట్ల జిల్లా వార్త



## 'పిల్లల్లో సృజనాత్మకత పెంచడానికి డిజిటల్ ఉపకరణాలు దోహదం'

బాపట్ల,నవంబర్25,ప్రభాతవార్త: పిల్లలలో సృజనాత్మకత పెంచడానికి డిజిటల్ ఉపకారణాల ఉపయోగించి విద్యను అభ్యసింప చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తెలిపారు. స్థానిక ఎస్ఎంజి హైస్కూల్లో పిఎంశ్రీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు, తెలుగు, ఇంగ్లీష్ మరియు మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులకు పిఎల్ లాబ్స్ పై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యస్ పురుషోత్తం గారు మాట్లాడుతూ పిల్లలలో సృజనాత్మకత పెంచాలన్నారు. దీనికి డిజిటల్ ఉపకారణాల ఉపయోగపడతాయన్నారు.విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను ప్రస్తుతం చదువుతున్న తరగతికి అనుగుణంగా ఉండేలా సాధించడానికి



పర్సనలైజ్డ్ ల్యాబ్స్ ఉపయోగపడతాయన్నారు. శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత 14 పీఎం శ్రీ స్కూల్స్ కి స్కూల్ కి 30 టాబ్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎంఎవో,పిఎల్ ల్యాబ్స్ డిఎన్‌వో బి. మోజెస్, సిజి టీమ్ శ్రీనివాస్,ట్యాబ్ డిఎన్‌వో బి. షమీర్ చంద్ర, అసిస్టెంట్ ఐఈడి కో ఆర్డినేటర్ ఎన్. పద్మశ్రీ మరియు ఎమ్ఎంఎస్ లు పాల్గొన్నారు

## డిప్యూటీ ఎంపీడీవోగా సునీత



కర్లపాలెం,నవంబర్25,ప్రభాతవార్త: మండల కేంద్రం కర్లపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్న సునీత డిప్యూటీ ఎంపీడీఓ గా పదోన్నతి పొందారు.యద్దనపూడి మండలం కి డిప్యూటీ ఎంపీడీఓ గా ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు పంచాయితీ కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు

## ఉచిత మెగా పశువైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలి

కర్లపాలెం,నవంబర్25,ప్రభాతవార్త: గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత మెగా పశువైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలని విజయవాడ డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్ టి వి సుధాకర్ తెలిపారు. కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో రాష్ట్రీయా గోకుల్ మిషన్ ఆంధ్ర ప్రదేశ్ పశుగణభివృద్ధి సంస్థ ,పశు సంవర్ధక శాఖ మరియు శ్రీ సత్య సాయి సేవ సమస్థలు బాపట్ల జిల్లా గ్రామ సేవల విభాగం సంయుక్తంగా మెగా ఉచిత వైద్య శిబిరం మరియు మేలు జాతి లేగ దూడల అందాల పోటీ ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో 115 పశువులకు గర్భ కోశ వ్యాధి చికిత్స,800 జనరల్ కేసులు,200 దూడలకు నట్టల నివారణ చేయడం జరిగిందన్నారు..120 లేగ దూడలు అందాల పోటీలో పాల్గొన్నాయని ఆయన తెలిపారు.. ఈ



కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ అన్సారీ,కిరణ్ ,తిరుమల తేజ,సాహిత్య,నాగార్జున, రేచల్ దివ్య,శివ కుమారి,వనజా లక్ష్మీలు పాల్గొని గర్భకోశ వ్యాధులు,జనరల్,నట్టల నివారణకు వైద్య పరీక్షలు నిర్వహించి విశ్రాంత డాక్టర్ పున్నయ్య శాస్త్రి సమకూర్చిన మందులను అందజేశారు.లేగ దూడల ప్రదర్శన నిర్వహించి ప్రథమ ద్వితీయ,తృతీయ బహుమతులు, రైతులకు కన్సలెటెంట్ బహుమతులు అందజేశారు.పశువుల రైతులకు జామ, మామిడి మొక్కలను శ్రీ మంతెన నాగరాజు శ్రీరామకృష్ణ కల్చరల్ అసోసియేషన్, బుద్ధాం వారు అందజేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎ.హెచ్. ఓ. బాపట్ల డా. వి.వేణు గోపాల్ , ఈ.ఓ. డీఎల్ డి ఏ వై.సుధాకర్ , ఏ డి వి.శ్రీనివాసరావు ,బాపట్ల మండలం గ్రామ సేవల విభాగం జిల్లా ఇంచార్జి తుమ్మల శ్రీనివాసరావు, ఇంచార్జి కన్వీనర్ అచ్యుత వెంకన్న,ఇంకొల్లు శ్రీనివాసరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎస్టీయు బాపట్ల నూతన కమిటీ ఎన్నిక


బాపట్ల,నవంబర్25,ప్రభాతవార్త: పిఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బాపట్ల జిల్లా ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో బాపట్ల మండల శాఖ నూతన బాడీ ఎన్నిక



మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు బాపట్ల జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్సి కమిటీని వేయాలని, 2018 పిఆర్సి బకాయిలను విడుదల చేయాలన్నారు., 2023 జూలై నుండి పిఆర్సీ అమలు కావలసి ఉందని, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఐఆర్ ప్రకటించాలన్నారు. బాపట్ల జిల్లా ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్టియు యూనియన్ మాత్రమే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించగలదని యూనియన్ ని బలోపేతం చేయాలన్నారు. బాపట్ల జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ శిజు నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమైక్యంగా ఉండి ఉద్యమాలు చేయాలని, ఉద్యమాల ద్వారానే ఏమైనా సాధించుకోగలమని తెలియజేసినారు. ఎస్టియూ బాపట్ల జిల్లా అదనపు ప్రధాన ఎస్‌బి సుభాని మాట్లాడుతూ టీచర్లను బోధనకే పరిమితం చేయాలని, బోధ నేతర పనులు నుండి విముక్తి కల్పించాలన్నారు.ఎస్టియూ రాష్ట్ర కౌన్సిలర్ బి. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ డి ఎ ఎరియర్స్ ను, పిఎఫ్ లోన్లను, ఎపిజిఎల్ఐసిలోన్లను, రిటైర్ అయినటువంటి ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేయాలని మరియు కోవిడ్ లో చనిపోయినటువంటి ఉపాధ్యాయుల కుటుంబాలకు కాంపాన్ సేటివ్ ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. ఎస్ .టి .యు బాపట్ల మండల శాఖ అధ్యక్షునిగా నారాయణ .ప్రధాన కార్యదర్శిగా పీలా శివాంజనేయులు ,ఆర్థిక కార్యదర్శిగా యడం కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షునిగా చెల్లి రత్నరాజు లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని తెలిపారు.


## గైడెన్స్... విద్యార్థి భవిష్యత్తును సరైన దిశలో నడిపించే వెలుగుదీపం

బాపట్ల,నవంబర్25,ప్రభాతవార్త: విద్యార్థులు ఎప్పుడూ ఆత్మ విశ్వాసంతో ఉండాలని ఎన్‌సిఈఆర్‌టి సభ్యులు ఆశోక్‌కుమార్ తెలిపారు.కౌన్సిలింగ్ మరియు గైడెన్స్ సర్వే కార్యక్రమం లో భాగంగా మండల పరిదిలోని నందిరాజుతోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,లిటిల్ ఎంజెల్ హైస్కూల్ ను ఎన్‌సీఆర్‌టి,ఎస్సీ ఆర్‌టి సభ్యులు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా సభ్యులు అశోక్‌కుమార్ మాట్లాడుతూ సరైన గైడెన్స్ అనేది విద్యార్థి భవిష్యత్తును సరైన దిశలో నడిపించే వెలుగుదీపం వంటిదన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కౌన్సిలింగ్ మరియు గైడెన్స్‌పై అంతరంగికంగా మాట్లాడి వారికి కౌన్సిలింగ్ గైడెన్స్ పాఠశాల స్థాయిలో ఎలా ఉపయోగపడుతుందో వివరంగా అడిగి



తెలుసుకున్నారు, విద్యార్థులు ఎల్లపుడు ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచిం చారు. అలాగే పాఠశాల హెడ్‌మాస్టర్ మరియు ఉపాధ్యాయులతో సమావే శమై, పాఠశాలలో కౌన్సిలింగ్ ఎలా అమలు చేస్తున్నారో, పిల్లలకు అర్థమయ్యే విధంగా ఎలా అవగాహన కల్పిసున్నారో తెలుసుకున్నారు. కౌన్సిలింగ్ మరియు గైడెన్స్ విషయంపై ఉపాధ్యాయులతో, విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి, పాఠశాల స్థాయిలో దాని ఉపయోగాలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నిరంజన్,ప్రసాద్,నందిరాజు తోట హెచ్.ఎం. సత్యనారాయణ.జి.సి.డీ.ఓ చారులత, లిటిల్ ఏంజెల్స్ డైరెక్టర్ అభినవ్. రాష్ట్ర సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు డా. కె.పి. వెంకటసుబ్బయ్య, చాయేంద్ర కుమార్, కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ ఉమాదేవి మరియు పారిజాన్ తదితరులు పాల్గొన్నారు.

## చలికాలం జాగ్రత్తలు పాటించాలి : డాక్టర్ అనూష



తాడేపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త : చలికాలంలో ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా,చలి నుండి శరీరాన్ని కాపాడుకుంటూ ప్రజలు తగుజాగ్రత్తలు పాటిస్తూ,సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష అన్నారు.చలికాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు,వా ్యధులు,తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు.తెల్లవారు జామున పొగమంచు ఎక్కువగా ఉంటుందని,సూర్యోదయం తర్వాత వాకింగ్,వ్యాయామం చేసుకోవాలన్నారు.చలి నుండి రక్షణ పొందటానికి ఉన్ని దుస్తులు,స్వెట్టర్లు,మాస్కులు,మఫ్లర్లు వాడాలన్నారు.శీతాకాలం సీజనల్ వ్యాధులతో బాధపడేవారు సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను పొందాలని డాక్టర్ అనూష విజ్ఞప్తి చేశారు.

## తెనాలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

తెనాలి టౌన్, నవంబర్25, ప్రభాత వార్త : పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు,ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ సంజన సిన్హా తెలిపారు.మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి, సబ్ కలెక్టర్ సంజన సిన్హా అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో పట్టణం



లోని స్వచ్ఛంద సంస్థల అధినేతలు, పలువురు అధికారులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. పట్టణంలో అత్యంత తీవ్రమైన ట్రాఫిక్ సమస్యతో అనేక సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏర్పాటైన అడ్వైజరీ కమిటీ ఉండి కూడా ఉపయోగము లేనట్లుగా ఉందని గత ఐదు సంవత్సరాలుగా నిర్వహించని సమావేశం నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సందర్భంగా ఇకనుంచి అయినా అధికారులు తీసుకునే నిర్ణయాలతో కొరకరాని కొయ్యగా మారిన ట్రాఫిక్ సమస్యను పరిష్కారం లభించే దిశగా ఈ సమావేశం నిర్వహించడం పట్ల పలువురు అభినందించారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణాలను పలువురు తెలియజేయగా అధికారులు వాటికి వివరణ ఇచ్చారు అందరి సూచనలను పరిగణన లోకి తీసుకుంటామని, తదుపరి సమావేశం డిసెంబర్ 10న నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు.

## సందేశాత్మక లఘు చిత్రం 'రీబూట్' చిత్రీకరణ ప్రారంభం

తెనాలి టౌన్, నవంబర్25(ప్రభాతవార్త): ఈదర టాకీస్ నిర్మిస్తున్న "రీబూట్ "అనే సందేశాత్మక లఘు చిత్రాన్ని తెనాలి కళాకారుల సంఘం అధ్యక్షురాలు బొర్రా జయలక్ష్మి మ్మ క్లాప్ కొట్టి ప్రారంభించారు. మంగళవారం స్థానిక చినరావూరులో వాసిరెడ్డి నాగేశ్వరరావు గృహ ఆవరణలో నిర్మిస్తున్న చిత్రంలో



నూతన, పాత నటీనటులు సందడి చేశారు. సందేశాత్మక లఘు చిత్రం యువతకు నిర్దిష్ట ఇతివృత్తాన్ని తెలియజేసే చిన్న ప్రయత్నమే రీబూట్ లఘు చిత్రమని చిత్ర నిర్మాత ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు.ఈ సందేశత్మక చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యత తనకివ్వడం సంతోషంగా ఉందని చిత్ర దర్శకులు కనపర్తి రత్నాకర్ అన్నారు. దేవి తేజస్వి, సిహెచ్ శేఖర్, వసంత యామిని, సోమేశ్, అయినాల మల్లేశ్వరరావు, కె మధుకర్, బెల్లంకొండ వెంకట్, జి. కోటేశ్వరరావు, సిద్దార్థ, కె గోపి, వి సిద్దార్థ, బద్రీనాథ్, ఎస్ శ్రీనివసరావు, మోజెస్ తదితరులు నటించారు.రమణ,ఈ చిత్రానికి డిఓపి గా,రవి అసోసియేట్ డైరెక్టర్ గా రమణ వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నల్లూరు వెంకటేశ్వరరావు,ఈదర శ్రీనివాసరావు,మల్లాది అర్జున్, గుత్తా వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగు కేంద్రాన్ని సందర్శించిన కమీషనర్

తెనాలి మునిసిపాలిటీ, నవంబర్25, ప్రభాతవార్త: పట్టణంలోని చెంచుపేట అమరావతి ప్లాట్స్ లో ఉన్న సేంద్రియ కూరగాయల వ్యవసాయ కేంద్రాన్ని, మంగళవారం మున్సిపల్ కమీషనర్ రామ అప్పల నాయుడు సందర్శించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఏసుబాబు తో



కలిసి ఆయన,వ్యవసాయ కేంద్ర నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మనం తినే ఆహారంలో చాలా భాగం ఎరువులు వాడకం వలన భవిష్యత్తులో దీర్ఘకాలిక రోగాల బారిన పడే అవకాశం ఉందని అందువల్ల సేంద్రియ సాగును ప్రోత్సహించాలన్నారు. అనంతరం వార్డులో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. సచివాలయం ఆవరణలో నిరుపయోగంగా ఉన్న వ్యాయామ పరికరాలను గురించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ పారిశుద్ధ్య సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత కుట్టుశిక్షణపై అవగాహన

తెనాలి మునిసిపాలిటీ, నవంబర్25, ప్రభాతవార్త: పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం నందు, మంగళవారం మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో,మెప్మా సహకారంతో తెనాలి నియోజకవర్గ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ




సమావేశమును రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో, నిర్వాహకురాలు శ్రీమతి బొజ్జ సంధ్యారాణి ద్వారా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ పై అవగాహన కార్యక్రమమును నిర్వహిం చారు.ఈ కార్యక్రమమునకు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీడీవో శ్రీమతి అత్తోట దీప్తి,మెప్మా సిబ్బంది మెప్మా సిబ్బంది,డిఆర్డిఏ సిబ్బంది మరియు తెనాలి నియోజకవర్గం మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి సంధ్యారాణి మాట్లాడుతూ,ప్రతి ఒక్క మహిళ స్వశక్తితో ఎవరికివారుగా ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం బాగుంటుంది అని తెలిపారు.ఈఉచిత టైలరింగ్ శిక్షణ 45 రోజులు రోజుకు



రెండుగంటలు మాత్రమే అని తెలిపారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ,ప్రస్తుత రోజులలో టైలరింగ్ యొక్క ఆవశ్యకత దాని నుండి కొంత ఆదాయమును పొందవచ్చును అని, అదేవిధంగా బ్యూటిషన్ ఆవశ్యకతను తెలిపారు.అలాగే స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేసిన విధముగా ఒకటవ తారీఖు నుండి ఈ ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కావున మహిళలుచదవకాశమును తెనాలి మహిళలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

## జీవనశైలిలో మార్పులతో అనారోగ్య సమస్యలు



తాడేపల్లి,నవంబర్ 25,ప్రభాతవార్త :కాలాను గుణంగా ప్రజల జీవనశైలి కూడా మారుతుందని, పౌష్టికాహారాన్ని వదిలి జంక్ ఫుడ్ తీసుకోవడంతో ఊబకాయం, మధుమేహం,రక్తపోటు వంటి అనారోగ్య సమస్యలు రావడంతో రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో ఇన్‌ఫెక్షన్లు సులువుగా సోకటంతో ఫ్లూ,క్షయ,హెపటైటిస్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని కెఎల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ ప్రజలకు సూచించారు.కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం దుగ్గిరాల మండలంలోని శృంగారపురం గ్రామంలో ఫార్మసీ వాలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్ళి "ఇన్ఫెక్షన్లను నివారించండి-మధుమేహాన్ని నియంత్రించండి" అనే అంశంపై అవగాహన కల్పించినట్లు ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ చక్రవర్తి పేర్కొన్నారు.దగ్గు,తుమ్ములు, ద్వారా అపరిశుభ్రమైన ప్రదేశాలను తాకి నోరు,ముక్కులు అంటుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్లు సోకి రోగాల బారినపడతారని వివరించారు.ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్,వాలంటీర్లును యూనివర్సిటీ విసిలు డాక్టర్ జి.పార్ధసారధివర్మ,డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,స్టూడెంట్ ఆఫైర్స్ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,డాక్టర్ హబీబుల్లా ఖాన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

26-11pg8exHMNWJQE 8 VJA_26-11pg8exHMNWJQE.qxd 26/Nov/25 12:26 AM Page 1



# పైరసీలో రాటుదేలిన నేరగాడు రవి

● కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా సినిమాలు పోస్టింగ్

● ఇంకా నడుస్తున్న వెబ్‌సైట్లు ● వెబ్-3 టెక్నాలజీతో ప్రమాదం: అదనపు సిపి శ్రీనివాసు

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక సినిమాలతో పాటు ఓటిటి కంటెంట్లను పైరసీ చేస్తూ సినీ రంగాన్ని సంక్షోభంలో నెట్టిన పైరసీ కేటుగాడు ఇమ్మంది రవి గోల్‌మాల్ వ్యవహారాలపై నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్ సంచలన విషయాలను వెల్లడించారు. మంగళవారం బషీర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇమ్మంది రవి రాటుదేలిన నేరగాడని అన్నారు. రవి తన గోల్‌మాల్ కార్యకలాపాల కోసం మొదట ఐ బొమ్మ డొమైన్‌ను ఎన్‌జల అనే కంపెనీలో రిజిస్టర్ చేసుకున్నాడని, దీని తరువాత మరో కంపెనీ నుంచి హోస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఐ బొమ్మ వెబ్‌సైట్ సొంతంగా కాకుండా మరో కంపెనీ నుంచి హోస్ట్ చేసినట్లు తమ విచారణ లో వెలుగు చూసిందని, ఇందుకోసం అనేక అడ్డదారులు తొక్కాడని ఆయన తెలిపారు. ఇక రవి కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా సినిమాలను పోస్ట్ చేసేవాడని, తనను ఎవరూ పట్టుకోలేదని రవి అనుకునేవాడని, అయితే చట్టం నుంచి అతను ఎంతో కాలం తప్పించుకోలేక పోయాడని శ్రీనివాస్ వెల్లడిం చారు, పైరసీ వల్ల రవి ఇప్పటి వరకు సుమారు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించినట్లు తమ విచారణలో తేలిందని ఆయన అ న్నారు. రవి ఐ బొమ్మతో పాటు బప్పం వెబ్‌సైట్‌ల ద్వారా సినిమాలను పోస్ట్ చేసేవాడని ఆయా వెబ్ సాఫ్ట్‌వేర్‌లో రీడైరక్ట్ స్క్రిప్ట్ రాశాడని, దీంతో పాటు గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లకు వినియోగదారుల సమాచారం వెళ్లేదని ఆయన తెలిపారు. రవి అరెస్టు వెనుక అతని భార్య ఇచ్చిన సమాచారం పోలీసులకు ఉపయోగపడిందనేది అవాస్తవమని ఆయన తెలిపారు. అతన్ని తాము సొంత సమా చారంతోనే పట్టుకున్నామని శ్రీనివాస్ తెలిపారు. ఈకేసులో రవి భార్యను తాము విచారించలేదని ఆయన తెలిపారు. ఇక పైరసీ కేసుల విచారణ చాలా సంక్లిష్టతతో కూడుకున్నదని శ్రీనివాస్ చెప్పారు. రవి ఒంటరిగాడని లక్ష డాలర్లు వెచ్చించి కరేబియన్ దీవుల్లో పౌరసత్వం పొందాడని, చట్ట ప్రకారం ఇతను ఇప్పుడు భారత పౌరుడు కాడని ఆయన తెలిపారు. తాను చేసిన నేరాల తాలూకు భయంతో రవి వారానికి ఒక దేశం మారుతుం డేవాడని, ఈ క్రమంలోనే అతను ఈజీ మనీకి అలవాటు పడ్డాడని, జల్సా జీవితం గడుపుతుండే వాడని ఆయన అన్నారు. మన దేశ చట్టాల ప్రకారం విదేశీయులు ఇక్కడ నేరాలకు పాల్పడితే అది నేరమేనని, వారిపై విచారణ సాగుతుందని, నేరగాళ్ల అప్పగింతపై అనేక దేశాలతో మనకు ఒప్పందాలు న్నాయని శ్రీనివాస్ తెలిపారు. కాగా రవి వెబ్‌సైట్లక నిఖిల్ అనే వ్యక్తి డిజైన్ చేసేవాడని అదనపు పోలీసు కమిషనర్ తెలిపారు.

### పైరసీ వెబ్‌సైట్లు ఇప్పటికీ నడుస్తున్నాయి...

ఇదిలావుండగా రవి అరెస్టు తరువాత కూడా పైరసీ వెబ్‌సైట్లు నడుస్తున్నా యని అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్ వెల్లడించా రు. తమిళ్ ఎంవి, మూవీరూల్జ్ లాంటి పలు పైరసీ వెబ్‌సైట్లు ఇప్పటికీ కొనసాగుతూనే వున్నాయని, వీటి నిర్వాహకులను పట్టుకునేందుకు ప్రయత ్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఐ బొమ్మ పాపులర్ అయ్యాక దాని పేరును చాలా మంది వాడుకుంటున్నారని, సినిమాల సమీక్షలకు ఈ వెబ్ సైట్‌ను వాడుకోవడం పెరిగిందని ఆయన తెలిపారు. త్వరలో వెబ్ 3 టెక్నాలజి రాబోతుం దని, ఇది వచ్చేస్తే సినీ పైరసీని పట్టుకోవడం చాలా కష్టమని, ఈ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీనివాస్ తెలిపారు.

### ఐ బొమ్మ రవిని మరో వారం రోజుల కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

పైరసీ కేటుగాడు ఐ బొమ్మ రవిని మరో వారం రోజుల పాటు కస్టడీలోకి అనుమతించాలని సిటీ సైబర్ క్రైంపోలీసులు మంగళవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. మొదటి దఫాగా రవిని గత గురువారం నుంచి సోమవారం వరకు ఐదురోజుల పాటు పోలీసులు విచారించడం తెలి సిందే. ఈవిచారణలో రవి పెద్దగా సహకరించ లేదని,ఈ నేపథ్యంలో అతని గోల్‌మాల్ వ్యవ హారాలపై మరింత సమాచారం సేకరించాల్సి వున్నందున మరోవారం రోజులపాటు కస్టడీకి అనుమతించాలని పోలీసులు కోర్టును కోరారు. దీనిపై బుధవారం విచారణ జరగనుంది.

# మ్యూల్ ఖాతాల ద్వారా రూ.24 కోట్ల దోపిడీ

## రాజస్థాన్ సైబర్ నేరగాళ్లకు ఖాతాలిచ్చిన 8మంది అరెస్టు



సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇచ్చిర నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసు కున్న వస్తువులను మీడియాకు చూపుతున్న నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** రాజస్తాన్‌లోని బడా సైబర్ నేరగాళ్ల సైబర్ నేరాలకు సహకరించడంతో పాటు వారి దోపిడీకి ఉపయోగప డేందుకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమర్పించిన హైదరాబాద్ వాసులు ఎనిమిది మందిని సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 127 మ్యూల్ ఖాతాలు సైబర్ నేరగా ళ్లకు అందగా వీటి ద్వారా 24 కోట్ల 20 లక్షల రూపా యలకు పైగా అమాయకుల డబ్బులను నేరగాళ్లు దోచ కున్నారు. మ్యూల్ ఖాతాల విషయంలో కొంతకాలంగా కఠినంగా వుంటున్న పోలీసు విభాగం ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా వుంచి వీ రిని అరెస్టు చేసింది. ఈ సందర్భంగా మ్యూల్ ఖాతాలు ఇచ్చిన వారి నుంచి పెద్ద సంఖ్యలో పాస్ పుస్తకాలు, క్రెడిట్, డెబిట్ కార్డులతో పాటు మరి కొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్ మంగళవారం మీడి యాకు వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన కన్నయ్య, రమేష్, పూనం అనే సైబర్ నేరగాళ్లు దేశ వ్యాప్తంగా తిరుగుతూ అమాయకులను, అత్యాశపరు లను ఎంచుకుని వారికి కొంత కమీషన్ ఆశ చూపుతూ మ్యూల్ ఖాతాలు తెరిపిస్తుంటారు. ఈక్రమంలో 2023లో కన్నయ్య హైదరాబాద్‌కు రాగా ఒక ఆటోలో సికింద్రాబాద్ ప్రాంతంలో వెళ్లాడు. ఈ ఆటో డ్రైవర్ బోడుప్పల్‌కు చెందిన పూజారి జగదీష్ (31)తో మాటలు కలిపి, అతని ఆర్థిక పరి స్థితిని తెలుసుకుని తనతో చేతులు కలపాలని, సైబర్ నేరాలకు సహకరించాలని, ఇందుకోసం మ్యూల్ ఖాతాలు తెరిచి, వాటిని తమకు ఇవ్వాలని కోరాడు. ఇందుకు జగదీష్ అంగీకరించడంతో పాటు తన కుటుంబసభ్యులు, సన్నిహితుల చేత మొత్తం 127 మ్యూల్ ఖాతాలను తెరిచాడు. వీటి ద్వారా వచ్చిన పాస్ బుక్కులు, ఎటిఎం కార్డులు, ఇతరత్రా అన్నింటిని జగదీష్ కన్నయ్యకు ఇచ్చాడు. ఇలా జగదీష్ ఇచ్చిన 127 మ్యూల్ ఖాతాల ద్వారా కన్నయ్య బృందం దేశ వ్యాప్తం గా అనేక ప్రాంతాలలో పలురకాల సైబర్ నేరాలకు పాల్పడి మొత్తం 24 కోట్ల 10 లక్షల 16 వేల 618 రూపాయలను దోచుకుంది. ఇదే సమయంలో మ్యూల్ ఖాతాల నుంచి 23 కోట్ల 99 లక్షల 31 వేల 550 రూపాయలను నేరగాళ్ల ముఠా విత్ డ్రా చేసుకుంది. మ్యూల్ ఖాతాలలో వున్న 16 లక్షల 31 వేల 155 రూపాయలను పోలీసులు జప్తు చేశారు. అయితే ఎఫ్ఐ ఆర్‌లలో వున్న సైబర్ నే రాల తాలూకు డబ్బులు కోటీ 60 లక్షల 56 వేల 201 కావడం గమనార్హం. కాగా కన్నయ్య బృందానికి మ్యూల్‌ఖాతాలు ఇచ్చిన నేరగాళ్లలో జగ దీష్‌తో పాటు బోడుప్పల్ నివాసి గురుదాస్ సునీల్ కుమార్ (27),గుంటి మన్‌దీప్ (27),పర్లపల్లి నిఖిల్ (29), పొలాస్ ప్రవీణ్ (29), జూబ్లీహిల్స్ కు చెందిన బల్వంత్ బాలాజి (27), బీబీనగర్‌కు చెందిన బొల్లు బాలు (21), అంబర్‌పేట్‌కు చెందిన బత్తుల పవన్ (24) లను అరెస్టు చేశారు. ఎని మిది మంది తమ స్నేహి తులు, కుటుంబ సభ్యుల పేరిట పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి చెక్కు పుస్తకాలు, ఎటిఎం కార్డులు, పాస్ బుక్కులు, పాన్ కార్డులు, ఆధార్ కార్డులను సైబర్ నేరగాళ్ల బృందానికి ఇవ్వడంతో వారు యధేచ్ఛగా సైబర్ నేరాలకు పాల్పడి రెండేళ్ల వ్యవధిలో 24 కోట్ల రూ పాయలను దోచుకున్నారు. కాగా మ్యూల్ ఖాతాలు తెరిచినందుకు ప్రతీ ఖాతాకు 1500 రూపాయల నుంచి మూడు వేల రూపాయలను సైబర్ నేరగాళ్ల ముఠా అందించేది. దీంతో పాటు సైబర్ నేరాలు జరిగినపుడు కొంత కమీషన్ ఇచ్చేది. పట్టుబడ్డ నిందితుల నుంచి 11 బ్యాంకు పాస్ పుస్తకాలు, 14ఎటిఎం కార్డులు, 12 చెక్కు బుక్కులు, ఆరు సిం కార్డులు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఒక తాబ్, ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. పట్టుబడ్డ సైబర్ నేరగాళ్లు రాచకొండలోని వనస్థలిపురం, సైబరా బాద్‌లోని రాజేంద్రనగర్, కర్నాటకలోని ఎలహంక, సెన్ సెంటర్, బిల్వారాలో నేరాలకు పాల్పడినట్లు తేలింది. సైబర్ నేరగాళ్లకు ఎవ రైనా మ్యూల్ ఖాతాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైం డిసిపి అర విందబాబు, టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి అందె శ్రీనివా సరావు, ఎసిపిలు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏపి లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు

# రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

● ఐదు అంశాలను అనుసంధానించనున్న ఎపి లింక్ ● ఎపిలింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలి ● సచివాలయంలో ఉన్నత సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ నవంబర్ 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం సచివాల యంలో జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే హోల్డింగ్ కంపెనీ తరహాలో ఏపీలింక్ వ్యవహరించనుంది. మొత్తంగా ఐదు రంగాలను ఈ కార్పొ రేషన్ అనుసంధానించనుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రోడ్లు, అంతర్గత జలరవాణా, గిడ్డంగులు.. వీటిని అనుసంధానిస్తూ లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడంతో పాటు... లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ఏపీ లింక్ బాధ్యత తీసుకోనుంది. ఇక రాష్ట్రంలోని



లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలు, సమన్వయం, పర్యవేక్షణకు ఏపీ లింక్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషనుకు ఓ ఎండీ, వివిధ అనుబంధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సలహా కమిటీ, క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేయడానికి జిల్లా స్థాయి సెల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వివరాలను ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ లింక్ ద్వారా లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చూడాలని, అలాగే క్షేత్ర స్థాయిలో వివిధ రంగాలకు అవసరమైన లాజిస్టిక్స్ అందించే విషయంలో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాది



విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: మన సంస్కృతి, నాగరికత భారత దేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. సనా తన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మ గౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్య ంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలాకాలం తర్వాత ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం (జెండా ఎగురవేయడం) కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్

# గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

## 4 కేజీల గంజాయి, 8 సెల్ ఫోన్లు, రూ.2700 నగదు, బైకు స్వాధీనం

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 25 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు. విశాఖ జిల్లా తునిలో కొనుగోలు చేసి అక్రమంగా రైలులో తరలించడం అనంతపురం, బాగేపల్లిలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని త్రీ టౌన్ సిఐ రాజేంద్ర యాదవ్, వన్ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం సిఐ ఆధ్వర్యంలో గంజాయి విక్రేతల ముఠా ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు అరెస్ట్ అయిన వారిలో అనంతపురం జిల్లా వాసులు హాజీ రహమత్, కురుగుంట బువ్వమ్మ, ఎట్టి మనోజ్ కుమార్, షేక్ అస్లాం బాష, బందలవాడ రవి కుమార్, ఏలూరు సాలోమన్, జ్యోతుల ప్రవీణ్ కుమార్, సోల్లెం దినేష్ గౌడ్, ప్రస్తుతం అరెస్టయిన వారిలో ఎట్టి మనోజ్ కుమార్, షేక్ అస్లాం బాష గంజాయి, తదితర మత్తు పదార్థాలకు, జల్సాలు, చెడు అలవాట్లకు లోనయ్యారు. ఇందుకు సరిపడా ఆదాయం లేకపోవడంతో ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలని భావించి నెల క్రితం హాజీ రహమత్, కురుగుంట బువ్వమ్మతో పరిచయం ఏర్పరుచుకున్నారు. మిగితా నలుగురు నిందితులను కూడా కలుపుకుని ముఠాగా ఏర్పడ్డారు. డబ్బు సులువుగా అక్రమ మార్గం ద్వారా సంపాదించాలని పథకం పన్నుకున్నారు. వీరిని



జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసులు రావు పర్యవేక్షణలో అనంతపురము త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేంద్రనాథ్ యాదవ్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది సోమవారం సాయంత్రం 5.00 గంటల సమయంలో అనంతపురము రూరల్ మండలము, రాజీవ్ కాలనీ నుండి నేషనల్ పార్కుకు పోవు దారిలో నాగులకట్ట వద్ద అరెస్టు చేసామని పోలీసులు చెప్పారు. వీరందరిని విశాఖ జిల్లా తునిలో కొనుగోలు చేసి అనంతపురంలో విక్రయిస్తున్న ఏడుగురు గంజాయి విక్రేతల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న అనంతపురము త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేంద్రనాథ్ యాదవ్, సబ్‌ఇన్‌స్పెక్టర్ సి, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

# ఊగిసలాటకు తెరదించండి

### ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది: సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు, నవంబరు 25:** కర్ణాటకలో సీఎం మార్పు ఊహాగానాలకు సాధ్యమైనంత తొందరగా తెరదించాలని, ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కాంగ్రెస్ హైకమాండ్ కు విజ్ఞప్తి చేశారు. నవంబర్‌లో సీఎం మార్పు ఉండవచ్చునని ఎప్పటి నుంచో ఊహాగానాలు మొదలయ్యాయి. నవంబర్ నెల ముగింపునకు వచ్చినా ఆ ఊహాగానాలకు ఇంకా తెరపడటం లేదు.ఈ ఊహాగానాలపై సిద్ధరామయ్య మరోసారి స్పం దించారు. ఆ వార్తలకు శుభం కార్డు వేసేలా త్వరలో నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. 2023లో జరిగిన కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచి రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని ప్రచారంలో ఉంది. నవంబర్ 20తో ఆ రెండున్నరేళ్ల గడువు ముగిసింది. దాంతో కర్ణాటక రాజకీ యాలు వేడెక్కాయి.

### దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన ఆశిష్ మెహ్రోత్రా



**తార్నాక, నవంబరు 25 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐ.ఆర్.ఎస్.ఈ.ఈ.) 1992 బ్యాచ్ అధికారి ఆశిష్ మెహ్రోత్రా సికింద్రా బాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిం చడానికి ముందు ఆయన న్యూఢిల్లీలోని ఉత్తర రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రి బ్యూషన్ ఇంజనీర్ (సి.ఈ.డి.ఈ)గా బాధ్యతలను నిర్వర్తించారు. న్యూఢిల్లీ లోని నార్తన్ రైల్వేలో చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజనీర్‌గా పటియాలాలోని లోకోమోటివ్స్ వర్క్స్‌లో ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా సేవలను అందించారు. ఇందులో ఆయన విద్యుత్ పంపిణీ మరియు మౌలిక సదుపా యాల నిర్వహణ రంగంలో గణనీయమైన కృషి చేశారు. మెహ్రోత్రా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీని చేశారు. భారతీయ రైల్వేలలో బలమైన విద్యానేపథ్యంతో పాటు విస్తృతమైన వృత్తిపం మైన అనుభవాన్ని ప్రతిబింబిస్తూ వారు మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎం.బి.ఎ) ను కూడా పూర్తి చేశారు.ఆయన భారతీయ రైల్వేలలో న్యూఢిల్లీ లోని ఐ.ఆర్.సి.ఓ.ఎన్ కు చీఫ్ జనరల్ మేనేజర్, రైల్వేబోర్డులో డైరెక్టర్ (సేఫ్టీ), న్యూఢిల్లీ డి.ఎం.ఆర్.సి జాయింట్ జనరల్ మేనేజర్ అండ్ జనరల్ మేనేజర్, వంటి వివిధ ముఖ్య మైన పదవులలో సేవలను అందించారు. ఆయనకు 1995లో ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ మెడల్ (ఆర్.ఎస్.సి), 2000లో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్స్ అవార్డు, 2006లో రైల్వే మంత్రి అవార్డు మరియు 2023లో అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్ ప్రధానం చేశారు.

# కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్

### మావోయిస్టుల అడ్డాలో భద్రతా బలగాల స్థావరం




కర్రెగుట్టల్లో ఏర్పాటు చేసిన సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్‌లో భద్రతా బలగాలు

**హైదరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను ఏరివేసే లక్ష్యంతో వున్న భద్రతా బలగాలు మరో ముందడుగు వేశాయి. నిన్నటి వరకు మావో యిస్టుల అడ్డాగా వున్న కర్రెగుట్టల్లో పారామిలటరీ బలగం సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్ ఏర్పాటయ్యింది. తె లంగాణ, ఛత్తీస్‌ఘడ రాష్ట్రాల మధ్య విస్తరించి వున్న కర్రెగుట్టల్లో ఇటీవల పలుమార్లు భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించడం తెలిసిందే. ఈ సందర్భంగా పలుమార్లు ఎదురుకాల్పులు కూడా జరిగాయి. ఈ కాల్పుల్లో పలువురు మావో యిస్టులు మరణించగా మరికొందరు గాయపడి నట్లు వార్తలు వచ్చాయి. అయితే భద్రతా బలగాల రాకను గమనించిన మావోయిస్టులు ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయడంతో ఇక్కడ బేస్ క్యాం ప్‌ను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ ఉన్నతా ధికారులు నిర్ణయించారు. దాడుల సమయంలో మావోయిస్టుల పలు రహస్య భూగర్భ స్థావరాలు, ఆయుధాలు బయట పడ్డాయి. ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నక్సలైట్ల స్థావరాలను ధ్వంసం చేశారు. కాగా కర్రెగుట్టల్లో భవిష్యత్తులో మావోయిస్టులు రాకుండా వుండేం దుకు సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్‌ను పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. ములుగు జిల్లా వాజేడు మండలం మోర్యూరు వద్ద ఏర్పాటైన ఈ బేస్ క్యాంప్‌ను సిఆర్‌పిఎఫ్ దక్షిణ విభాగం ఐజి త్రివిక్రం మంగళవారం లాంఛనంగా ప్రారంభిం చారు. సిఆర్‌పిఎఫ్ 39వ బెటాలియన్‌గా దీనికి నామ కరణం చేశారు. ఈ సందర్భంగా త్రివిక్రం మీడియాతో మాట్లాడుతూ కర్రెగుట్టల్లో అతి తక్కువ సమయంలోనే భద్రతా బలగాలు పట్టు సాధిం చాయని అన్నారు. భవిష్య త్తులో ఈ ప్రాంతంలో నక్స లైట్ల సమస్య వుండదని ఆయన హామీ ఇచ్చారు. కర్రెగుట్టల్లో సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్ ఏర్పాటుతో నక్సలిజం ఫ్రీ ఇండియా దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఆయన తెలిపారు. ఒకప్పుడు నక్సల్స్ అడ్డాగా వున్న కర్రెగుట్టలను ప్రజల కోసం సురక్షిత ప్రాం తంగా తీర్చిదిద్దు తామని ఆయన వెల్లడించారు. త్వరలో కర్రెగు ట్టపై రోడ్డును నిర్మిస్తామని, గుట్టల పై భాగం లోనూ సిఆర్‌పిఎఫ్ క్యాంపు వుండేలా చూస్తామని ఆయన తెలిపారు.ఈప్రాంతంలో అభివృద్ధి జరిగే లా ప్రజలుకూడా సహకరించాలనిఆయన కోరారు.

# అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

### మార్కులు తక్కువ వచ్చాయని తండ్రి మందలింపే కారణం

**హైదరాబాద్ (తార్నాక)త,నవంబరు 25 ప్రభాతవార్త:** మార్కులు తక్కువ వచ్చాయని తండ్రి మందలిం చడంతో ఓ విద్యార్థిని అపార్ట్మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో జరిగింది. ఈ సంఘట నకు సంబంధించి ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల కథనం ప్రకారం. హబ్సి గూడ కాకతీ యనగర్‌లో నివాసముండే కె.సుకుమార్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సుకుమార్ రెడ్డి భార్యతో పాటు పెద్ద కూతురు కర్క సిరి వైష్ణవి(15), కుమారుడు వార్విన్ రెడ్డి ఉన్నారు. కాగా వైష్ణవి శ్రీచైతన్య స్కూల్ హబ్సిగూడ బ్రాంచ్‌లో పదవతరగతి చదువుతుంది. ఆమెకు మ్యాథ్స్‌లో మా ర్కులు తక్కువవచ్చాయి. దీనితో మంగళవారం సాయంత్రం తండ్రి కూతురు ను మందలించి భవిష్యత్



కోసం కష్టపడి చదు వుకోవాలని చెప్పాడు. దీనితో బాలిక తీవ్ర మనోవేదనకు, ఒత్తిడికి గురై మం గళవారం తెల్లవారుజామున వారుండే అపార్ట్‌మెంట్ 4వ అంతస్తు టెర్రాస్‌పై నుంచి దూకి మృతి చెందింది. ఇది గమనించిన ఆమె తండ్రి సుకుమార్ రెడ్డి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నాతో పెట్టుకుంటే దేశం మొత్తం బిజెపి పునాదులు కదిలిస్తా

**బనగావ్(పశ్చిమబెంగాల్), నవంబరు 25:** పశ్చిమ్ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బనగావ్‌లో నిర్వహించిన ఈ ర్యాలీలో కేంద్ర ఎన్నికల కమిషన్ , బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీ యంగా బిజెపితనతో పోరాడలేదని, తనను ఓడిం చడం వారికి అసాధ్యమని బెంగాల్ సీఎం స్పష్టం చేశారు. అంతేకాదు, బెంగాల్‌లో తనకు సవాల్ విసరాలని చూస్తే దేశం మొత్తం బిజెపి పునాదు లను కదిలిస్తానని దీదీ హెచ్చరించారు. రాజ్యాంగ బద్ధమైన ఎన్నికలకమిషన్ నిష్పాక్షికంగా వ్యవ హరించడంలేదని ఆరోపించారు. ఎన్ని కల కమి షన్ బిజెపి కమి షన్‌గా మారిం దని తీవ్రస్థా యిలో దుయ్య బ ట్టారు.బీహార్ లో ఎస్ఐఆర్ వల్లే ఫలితాలు ఆలా వచ్చా యని, అక్కడబిజెపి గేమ్‌ను ప్రతిపక్షాలు అంచనా వేయలేక పోయా యని మ మతా బెనర్జీ అభిప్రా యపడ్డారు. అంతే



కాక, ఎన్నిక లకు కొద్దిరో జుల ముందు మహిళలకు రూ. 10,000 ఇవ్వడంపై స్త్రీ నా డ తా దీదీ ప్ర స్తా వించారు. "నేను ముందు గానే చె ప్ప న స్తు న్నా ను గుజరాత్‌లో (ప్రధాని నరేంద్ర మోదీస్వస్థలం) బీజేపీ ఓడిపో బోతోంది బెంగాల్‌లో గెలవడానికివారు గుజరాత్‌ను కోల్పోవాల్సి వస్తుందని దీదీ జోస్యం చెప్పారు. ఒకవేళ అక్రమ బంగ్లాదేశీ యులను తొలగించడమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమైతే బీజేపీ అధికారంలో ఉన్న రా ష్ట్రాల్లో ఈ ప్రక్రియను ఎందుకు నిర్వహిస్తున్నారని దీదీ నిలదీశారు. అంటే 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వ రాష్ట్రాల్లో చొరబాటుదారులు ఉన్నారనేది బీజేపీ అంగీకరిస్తోందా? అని ప్రశ్నిం చారు. ఇంతకాలం సరిహద్దు జిల్లాల్లో అక్రమ వలసదారులు నిజంగానే ఉండి ఉంటే ఇంటర్నేషనల్ బోర్డర్‌ను కాపాడే బాధ్యతఎవరిదని నేను అడగాలనుకుం టున్నాను? విమానాశ్రయాలు, కస్టమ్స్ అన్నీ కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటాయి. కానీ నేను ఇక్కడ ఉన్నంత వరకు వాళ్లు మిమ్మల్ని వెళ్లగొట్టడానికి నేను అనుమతించనని దీదీ ఉద్ఘాటించారు. రాష్ట్రంలోని మతువా కమ్యూనిటీ మెజారిటీ ప్రాంతాల్లోని ఓటర్లు 'పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)'కింద తమను తాము విదేశీయులు గా ప్రకటించుకుంటే తక్షణమే ఓటర్ల జాబితా నుంచివారి పేర్లు తొలగిస్తారని బెంగాల్ సీఎం అన్నారు. ఎస్ఐఆర్ ముగిసి రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన తర్వాత ఈసీ, బిజెపి సృష్టించిన గందరగోళాన్ని ప్రజలు గుర్తిస్తారని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్నికలకు ముందు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, రెండు, మూడేళ్లపాటు నిర్వహిస్తే తాము సహకరిస్తామని చెప్పారు.

26-11Pg5 9_26-11Pg5.qxd 25/Nov/25 10:12 PM Page 1



# ఆ సైనికాధికారి తొలగింపు సరైనదే

## - ఆర్మీ నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, నవంబరు 24:** తన రెజిమెంట్‌లోని సైనికులతోపాటు గురుద్వారాలో మతపరమైన ఆచారాలలో పాల్గొనడానికి నిరాకరించిన క్రైస్తవుడైన సైనిక అధికారి శామ్యూల్ కమలేసన్‌పై క్రమశిక్షణ చర్య కింద ఆర్మీ తొలగించింది. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ మంగళవారం సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విస్పష్ట తీర్పునిచ్చింది. అంతేగాక సదరు సైనికాధికారి ఆర్మీకి పనికి రాడు అంటూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అతడిని అసమర్థుడిగా ముద్ర వేసింది. తన తోటి సిక్కు సైనికులు విశ్వాసాన్ని గౌరవించనందుకు అతడిని తొలగిస్తూ ఆర్మీ తీసుకున్న నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. అతను ఎలాంటి సందేశం పంపుతున్నాడు? ఒక ఆర్మీ అధికారి చేసిన తీవ్రమైన క్రమశిక్షణారాహిత్య చర్య. అతడిని తొలగించాలి. ఇలాంటి వ్యక్తులు సైన్యంలో ఉండటానికి అర్హులా? అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అతను అత్యుత్తమ అధికారి కావచ్చు కానీ అతను భారత సైన్యానికి సరిపడడు అని అభిప్రాయపడింది. కమలేసన్ తరపున న్యాయవాది గోపాల్ శంకరనారాయణ వాదించారు. కమలేసన్ హోలీ, దీపావళి వంటి పండగల్లో పాల్గొనడం ద్వారా ఇతర మతాల పట్ల గౌరవాన్ని ప్రదర్శించారని అన్నారు. అతను గురుద్వారా వెలుపల ఉండీ చేయాల్సింది అంతా చేశాడని, కానీ గురుద్వారాలోకి ప్రవేశించడం తన విశ్వాసానికి విరుద్ధమని వారితో చెప్పాడని శంకరనారాయణ కోర్టుకు తెలిపారు. తన ఉన్నతాధికారితోనే కమలేసన్‌కు సమస్య ఉందని చెప్పాడు. అయితే సుప్రీంకోర్టు ఈ వాదనలతో ఏకీభవించలేదు. ఇక కేసు వివరాలను పరిశీలిస్తే, 3వ అశ్వికదళ రెజిమెంట్‌లో గతంలో లెఫ్టినెంట్‌గా ఉన్న శామ్యూల్ కమలేషన్‌ను సైనిక క్రమశిక్షణను ధిక్కరించినందుకు ఆర్మీ తొలగించింది. పూజ నిర్వహించడానికి గురుద్వారాలోకి ప్రవేశించాలని తన ఉన్నతాధికారి ఆదేశాలను పట్టించుకోకుండా తిరస్కరించాడు. ఇది తన క్రైస్తవ ధర్మాన్ని ప్రభావితం చేస్తుందని వాదించాడు. మే నెలలో ఢిల్లీ హైకోర్టు ఈ కేసును విచారించింది. కమలేసన్ తన ఉన్నతాధికారి నుంచి వచ్చిన ఆదేశాల కన్నా మతాన్ని ఎక్కువగా చూస్తున్నారని, ఇది స్పష్టంగా క్రమశిక్షణారాహిత్య చర్య అని తీర్పు చెప్పింది. ఇది సైనిక ధర్మాన్ని ఉల్లంఘించడమే అని చెప్పింది. సుప్రీంకోర్టు కూడా ఇదే తరహా తీర్పును వెల్లడించింది. కమలేసన్ పిటిషన్‌ను తిరస్కరించింది.



### ఖోస్ట్ ప్రావిన్స్‌పై పాక్

# వైమానిక దాడులు

## 9 మంది చిన్నారులు సహా పది మంది మృతి

**కాబూల్, నవంబరు 25:** ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. అర్ధరాత్రి ఆఫ్ఘన్‌లోని ఖోస్ట్ ప్రావి న్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ డ్రోన్ దాడుల్లో నివాస గృహాలు ధ్వంసం కాగా, 9 మంది చిన్నారులు సహా మొత్తం 10 మంది మరణించినట్లు తాలిబన్ ప్రభుత్వం ధ్రువీకరించింది. పలు ఇతర ప్రావిన్స్‌లపైనా ఈ దాడుల ప్రభావం ఉందని పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్ వాణిజ్య మంత్రి అల్హాజ్ నూరుద్దీన్ అజీజ్ ప్రస్తుతం భారత పర్యటనలో ఉండగా ఈ దాడులు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్‌లోని పెషావర్‌లో నిన్న జరిగిన ఆత్మాహుతి దాడికి ప్రతీకారంగానే ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ప్రభుత్వం చాలా కాలంగా ఆరోపిస్తోంది. గతంలోనూ ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో పాకిస్థాన్ ఇలాంటి దాడులకే పాల్పడింది. అప్పుడు టీటీపీ చీఫ్ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు పాక్ ప్రకటించింది. కీలకమైన సందర్భాల్లో పాక్ ఇలా దాడులకు దిగడం ఇరు దేశాల మధ్య వైరాన్ని మరింత పెంచుతోంది. ఇటీవల ఖతార్, తుర్కియేల మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, తాజా దాడులతో ఆ ఒప్పందం నీరుగారిపోయింది. ఈ ఘటనతో సరిహద్దుల్లో మళ్లీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# డిసెంబర్ 1నుంచి పార్లమెంటు

## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ

## శీతాకాల సమావేశాలకు సర్వం సిద్ధం



**న్యూఢిల్లీ, నవంబరు 25:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 1 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా చూసేందుకు నవంబరు 30న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ భేటీలో ప్రభుత్వం చర్చకు తీసుకురావాలనుకుంటున్న బిల్లులు, ఇతర ముఖ్యమైన అంశాలపై విపక్షాలకు వివరించి, వారి సహకారం కోరనుంది. ఈ శీతాకాల సమావేశాల్లో మొత్తం 15 సిట్టింగ్‌లు ఉంటాయి. పది కీలక బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి మోడీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే, ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని సభలో బలంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సభలో అనుసరించాల్సి న వ్యూహం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం వంటి అంశాలపై చర్చించేందుకు విపక్షాలు కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశం ఉంది. మొత్తం మీద, ఈ సమావేశాలు అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి వేదికగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు ట్రంప్ సీరియస్ షాక్

## విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ముద్ర వేసిన అమెరికా



**వాషింగ్టన్, నవంబరు 25:** అరబ్ ప్రపంచంలో అత్యంత పురాతనమైన, ప్రభావవంతమైన ఇస్లామిక్ ఉద్యమంగా పరిగణించే 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు గట్టి షాక్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సంస్థను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా ముద్ర వేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా అరబ్ ప్రపంచంలో ఈ సంస్థ కార్యకలాపాలపై తీవ్ర ఆంక్షలు పడే అవకాశం ఉంది. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ద్వారా వెల్లడైన వివరాల ప్రకారం ఈ నిర్ణయానికి సంబంధించి విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్లకు ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. లెబనాన్, ఈజిప్ట్, జోర్డాన్ వంటి దేశాలలో ఉన్న ముస్లిం బ్రదర్‌హుడ్ అనుబంధ సంస్థలపై చర్యలు తీసుకునే విధంగా ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ నివేదిక అందిన తర్వాత 45 రోజుల్లోపు ఆ సంస్థలపై ఎలాంటి ముద్ర వేయాలనే అంశంపై మంత్రులు ముందుకు వెళ్లాలని కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులపై ఇప్పటికే ఆయన సంతకాలు చేశారు. ట్రంప్ నిజంగానే ముస్లింలందరినీ ద్వేషిస్తారా బెర్నీ సాండర్స్ కామెంట్ల వెనుక కారణం ఏంటంటే ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవడానికి ట్రంప్ పరిపాలన గట్టి కారణాలను చూపిస్తోంది. ఈ సంస్థ అనుబంధ విభాగాలు ఇజ్రాయెల్, అమెరికా భాగస్వాములపై హింసాత్మక దాడులకు మద్దతు ఇవ్వడం, ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాయని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ముఖ్యంగా ఈ సంస్థ మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తోందని పేర్కొంది.

వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ప్రకారం.."ఈ ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇది పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలు, మిత్ర దేశాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదం, అస్థిరత ప్రచారాలకు ఆజ్యం పోస్తుంది" అని వివరించింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఈజిప్ట్‌తో సహా అనేక అరబ్ ప్రభుత్వాలు స్వాగతించే అవకాశం ఉంది. ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థను 1920లలో ఈజిప్ట్‌లో స్థాపించారు. ఇస్లామిక్ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం, ఇస్లామిక్ చట్టాల ఆధారిత పాలనను స్థాపించడం దీని ప్రధాన లక్ష్యం. ఇది అరబ్ దేశాలకు వేగంగా వ్యాపించింది. అలాగే ఈ సంస్థ తరచుగా రహస్యంగా పని చేస్తోంది.

# ఉక్రెయిన్‌లోశాంతిస్థాపనను 19 పాయింట్లకు కుదించిన అజెండా!



**వాషింగ్టన్, నవంబరు 25:** ఉక్రెయిన్‌రష్యా మధ్యజరుగుతున్న యుద్ధాన్ని నివారించి కాల్పుల విరమణ, శాంతిస్థాపనకు అమెరికా నిర్దేశించిన 28 పాయింట్ల అజెండాను ఎట్టకేలకు కుదించారు. ఇది కేవలం రష్యా రూపొందించి ఇచ్చిన పత్రాన్నే ఇచ్చారని అటు ఉక్రెయిన్‌తోపాటు ఐరోపాదేశాలు కూడా తీవ్రస్థాయి విమర్శలుచేయడంతో అమెరికా పునరాలోచనలోప డింది. 28 పాయింట్ల అజెండాను 19 పాయింట్లకు కుదించినట్లు సమాచారం. ఇందుకోసం జెనీవాలో అమెరికా, ఉక్రెయిన్‌ప్రతినిధులు భేటీ అవుతారని అంచనా. వివాదాస్పదమైన అంశాలను సవరించడం లేదా కొంత తీవ్రతను తగ్గించడం వంటి చేసారని అంచనా. అమెరికా అద్యక్షుడు నిజానికి గురువారమే డెడ్‌లైన్ విధించారు. అయితే 28 పాయింట్ల అజెండాను 19 పాయింట్లకు కుదించడంతో వీటిని పునఃపరిశీలన కూడా చేయాల్సి ఉంటుందని ఉక్రెయిన్ అధికారి ఒలెక్జాండర్ బెవ్జ్ అన్నారు. ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ విదేశాంగమంత్రి సెర్గి కిస్లిస్త్యా మాట్లాడుతూ మొదటి అజెండా కంటే కొంతమేర తగ్గినట్లు కనిపించిందని అన్నారు. ఇపుడున్న కొత్త అజెండాలో కూడా ఉన్న వివాదాస్పద అంశాలను అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలు మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తూర్పు ఉక్రెయిన్‌ప్రాంతాన్ని రష్యాకు వదిలివేయడం, మిలిటరీని ప్రస్తుతం ఉన్న 8 లక్షలనుంచి ఆరులక్షలకు కుదించడం, నాటోలోసభ్యత్వం తీసుకోకూడదని ఇలా రష్యా నిబంధనలు ప్రతిపాదించింది. నాటో సైనికస్థావరాలు ఉండకూడదని, నాటో సైనిక, ఆయుధ సాయాలు అందించకూడదన్న షరతులు అన్నీ కూడా రష్యారూపొందించినవేనని అప్పట్లో ఐరోపాకూటమి ఇతర అగ్రరాజ్యాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. ఇపుడు 19 పాయింట్ల కొత్త అజెండాపై అమెరికా, రష్యాల స్పందన ఏమిటన్నది తేలాల్సి ఉంది.

# ఢిల్లీలో ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం!

**న్యూఢిల్లీ, నవంబరు 25:** ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) 300 పైగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందికి హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రతిరోజూ 50 శాతం మంది ఉద్యోగులు మాత్రమే కార్యాలయాలకు రావాలని, మిగిలిన సిబ్బంది ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని సంబంధిత ప్రభుత్వ విభాగాల అధిపతులను ఆదేశించింది. ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్) పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సిబ్బంది హాజరును తగ్గించాలని సూచించింది. అత్యవసర సిబ్బంది మినహా మిగిలిన ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వాలని ప్రైవేటు కంపెనీలను ఆదేశించింది. ఎన్విరాన్ మెంట్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1986 లోని సెక్షన్ 5 ప్రకారం పర్యావరణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో రోజురోజుకూ వాయు కాలుష్యం పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. శీతాకాలం కావడం, ముంచు దట్టంగా కురుస్తుండటంతోప్రజలకు శ్వాసకోస ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

గ్రాప్-3 స్టేజి కార్యాచరణలు అమలుచేయాలని నిర్ణయించినప్పటికీ రోజు రోజుకూ పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతోంది. అందుకోసమే ఉద్యోగులకు కొంత మినహాయింపునిస్తూ వర్క్‌ఫ్రంహోమ్ వెసులుబాటు కల్పించింది.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై మరోసారి దాడి!

## ప్రాణహానిలేదన్న పాకిస్థాన్ పోలీస్




**క్వెట్టా, (పాకిస్తాన్), నవంబరు 25:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు మరోసారి దాడికి గురైంది. క్వెట్టా, సిబి మధ్య గత నెలన్నర రోజుల్లో ఈ ప్రయాణికుల రైలుపై దాడి జరగడం ఇది ఆరోసారిగా అధికారులు చెపుతున్నారు. ఈ వరుస దాడులతో ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని బోలన్ పాస్ సమీపంలోని ఆబ్‌ఇగమ్ వద్ద సాయుధులు కాల్పులకు తెగబడ్డారు. రైలులో ఉన్న రైల్వే పోలీస్, ఇతర భద్రతా సిబ్బంది వెంటనే ఎదురుకాల్పులు జరిపారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని వారు స్పష్టం చేశారు. గతంలోనూ ఇదే రైలుపై అనేకసార్లు దాడులు జరిగాయి. అక్టోబర్ 7న సింధ్ ప్రావిన్స్‌లో జరిగిన బాంబు పేలుడులో ఏడుగురు గాయపడ్డారు. సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో జరిగిన మరో పేలుడులో 12 మంది గాయపడగా, రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ)కి చెందిన ఉగ్రవాదులు ఇదే రైలును హైజాక్ చేసి, 400 మందికి పైగా ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. 24 గంటల తర్వాత ఈ హైడ్రామా ముగియగా, 20 మంది భద్రతా సిబ్బందిని చంపినట్లు ఉగ్రవాద సంస్థ ప్రకటించింది.

# 'బూడిద మేఘాల' ఎఫెక్ట్

## పలు విమాన సర్వీసులు రద్దు

## 12 వేల యేళ్ల తర్వాత పేలిన అగ్నిపర్వతం



**అడ్డిస్‌అబాబా, నవంబరు 25:** 12వేల ఏళ్ల తర్వాత తొలిసారిగా ఇథియోపియాలో అగ్నిపర్వతం బద్దలవ్వడంతో వెలువడిన బూడిద మేఘాలు ఉత్తర భారతంపైకి విస్తరించాయి. ఈ పరిణామంతో దేశంలో పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు అప్రమత్తంగా ఉండాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఇథియోపియాలోని హేలీ గుబ్బి అగ్నిపర్వతం దాదాపు 12,000 ఏళ్ల తర్వాతత ఆదివారం బద్దలైంది. దీని నుంచి వెలువడిన దట్టమైన బూడిద మేఘాలు ఎర్ర సముద్రం మీదుగా యెమెన్, ఒమన్ వైపు ప్రయాణించి, ప్రస్తుతం ఉత్తర అరేబియా సముద్రం మీదుగా భారత్‌లోకి ప్రవేశించాయి. ఈ బూడిద మేఘాలు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, ఈ మేఘాలు వాతావరణంలో చాలా ఎత్తులో ఉండటంతో ఢిల్లీ గాలి నాణ్యతపై ప్రభావం చూపే అవకాశాలు తక్కువని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఆకాశ ఎయిర్, ఇండిగో, కేఎల్ఎం వంటి విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేశాయి. నిన్న, ఈరోజు జెడ్డా, కువైట్, అబుదాబికి వెళ్లాల్సి న విమానాలను రద్దు చేసినట్లు ఆకాశ ఎయిర్ ప్రకటించింది. కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ కూడా ఆమ్‌స్టర్‌డామ్‌ఢిల్లీ రాకపోకల సర్వీసులను నిలిపివేసింది.

# సంక్షిప్తంగా..

## గ్రహాంతరవాసుల ఉనికి గుర్తింపుకోసం భారీ టెలిస్కోప్



**టోక్యో, నవంబరు 25:** గ్రహాంతర వాసుల ఉనికిని గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో జపాన్ తాజాగా సరికొత్త టెలిస్కోప్ నిర్మాణం తలపెట్టింది. థర్టీ మీటర్ టెలిస్కోప్ (టీఎంటీ) పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భారత దేశానికీ భాగస్వామ్యం ఉంది. ప్రపంచంలోనే అత్యంత భారీ టెలిస్కోప్ ల సరసన చోటు సంపాదించుకునేలా నిర్మించాలని ప్రయత్నిస్తోంది. ఈ టెలిస్కోప్ తో గ్రహాంతరవాసులు ఉన్నారా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు ఇరు దేశాలు పరిశోధనలు ప్రారంభించాయి. 40 ఏళ్ల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్ జపాన్ ఖగోళ శాస్త్రవేత్తలు 40 సంవత్సరాల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్ పంపించారు. వాటికి ప్రతిస్పందనను గుర్తించేందుకు తాజాగా ఈ టెలిస్కోప్ తో ప్రయత్నిస్తున్నారు. జపాన్‌లోని హ్యోగో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త షిన్యా నరుసావా నేతృత్వంలోని బృందం గ్రహాంతరవాసుల నుంచి వచ్చే ప్రతిస్పందనను వినడానికి సిద్ధమవుతోంది.

## మూడోసారి వాయిదాపడిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పర్యటన



**న్యూఢిల్లీ, నవంబరు 25:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటన మరోసారి వాయిదా పడింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుడు, తదనంతర భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాదిలో ఆయన పర్యటన రద్దు కావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది సెప్టెంబర్ 9న నెతన్యాహు భారత్‌లో పర్యటించాల్సి ఉంది. కానీ, సెప్టెంబర్ 17న ఇజ్రాయెల్ పార్లమెంటులో ఓటింగ్ జరగడంతో ఆ పర్యటన రద్దయింది. అంతకుముందు ఏప్రిల్‌లో కూడా ఆయన పర్యటన ఇదే విధంగా వాయిదా పడింది. ఇప్పుడు ఢిల్లీ పేలుడు కారణంగా మూడోసారి పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

## ఎల్టీటిఇ మహిళ వద్ద భారత్ ఓటర్ ఐడికార్డు




**న్యూఢిల్లీ, నవంబరు 25:** నిషేధిత ఉగ్రవాద సంస్థ ఎల్‌టీటీఈతో సంబంధాలున్నాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీలంక మహిళ వద్ద భారత ఓటర్ ఐడీ ఉన్నట్టు తేలడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), భారత ఎన్నికల సంఘాన్ని అప్రమత్తం చేసింది. గుర్తింపు పత్రాల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరింది. మేరీ ఫ్రాన్సిస్కా అనే శ్రీలంక మహిళను 2022లో ఓ బ్యాంకు మోసం కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా అధికారులు ఆమె నుంచి భారత ఓటర్ ఐడీ, పాన్ కార్డు, ఆధార్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ ఇంకా యాక్టివ్‌గా ఉండటంతో అధికారులు ఆశ్చర్యపోయారు.

## భర్తపై గృహహింస కేసు పెట్టిన బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ



**ముంబయి, నవంబరు 25:** బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ తన భర్త పీటర్ హాగ్ పై గృహ హింస ఫిర్యాదుచేయడంతో కేసు నమోదయింది. తన భర్త నుంచి గృహ హింస, క్రూరత్వం, మానిప్యులేషన్ ఎదుర్కొంటున్నానని ఆరోపిస్తూ ఆమె ముంబై కోర్టును ఆశ్రయించారు. డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ కింద కేసు దాఖలు చేయగా, న్యాయస్థానం పీటర్ హాగ్ కు నోటీసులు జారీ చేసింది. ఆస్ట్రియాకు చెందిన వ్యాపారవేత్త, హోటలియర్ అయిన పీటర్ హాగ్‌ను సెలీనా 2011లో వివాహం చేసుకున్నారు. వీరికి 2012లో కవల కుమారులు జన్మించారు. ఆ తర్వాత 2017లో మరోసారి కవలలకు జన్మనివ్వగా, వారిలో ఒకరు గుండె సంబంధిత సమస్యతో మరణించారు. సెలీనా జైట్లీ ప్రస్తుతం ఒకేసారి రెండు వైపులా న్యాయపోరాటం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేను వెంటాడుతున్న లైంగిక వేధింపుల కేసులు!



**తిరువనంతపురం, నవంబరు 25:** కేరళలోని పాలక్కాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్కూటతిల్‌ను లైంగిక ఆరోపణల వివాదం వీడటం లేదు. ఇప్పటికే ఇలాంటి ఆరోపణలతో పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయనపై తాజాగా మరిన్ని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనకు సంబంధించినవిగా చెబుతున్న ఓ వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్, ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. లీకైన ఆడియోలో రాహుల్ ఒక మహిళతో మాట్లాడుతున్నట్లు ఉంది. గర్భం దాల్చిన మొదటి నెలలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ఆ మహిళ వివరిస్తుండగా, 'హాస్పిటల్‌కు వెళ్లు' అంటూ ఆయన కఠినంగా మాట్లాడినట్లు ఆ క్లిప్‌లో ఉంది. అంతేకాకుండా, నిన్ను గర్భవతిని చేయాలి, మన బిడ్డ కావాలి అని రాహుల్ సందేశం పంపినట్లుగా ఉన్న వాట్సాప్ చాట్ స్క్రీన్‌షాట్ కూడా బయటకు వచ్చింది. అయితే ఈ ఆడియో, చాట్‌ల వాస్తవికత ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ కొత్త ఆరోపణలపై రాహుల్ మామ్కూటతిల్ స్పందించారు. తాను విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని, ఈ ఆరోపణలపై చట్టపరంగా ముందుకెళ్తానని తెలిపారు. నా ఫొటో పెట్టి ఆడియోను విడుదల చేశాక, అది నా గొంతు అవునో కాదో నన్ను అడగటంలో అర్థం లేదు. దేశంలోని ఏ చట్టాన్నీ నేను ఉల్లంఘించలేదు. విచారణ సరైన దశకు చేరుకున్నాక నేను చెప్పాల్సింది చెబుతానని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేరళ కాంగ్రెస్ నేత కె. మురళీధరన్ స్పందిస్తూ, రాహుల్‌పై చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని అన్నారు. రాహుల్ ప్రస్తుతం పార్టీలో లేరు. ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకుంటే, పార్టీ తదుపరి అడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక నటి, రచయిత్రి చేసిన లైంగిక ఆరోపణల నేపథ్యంలో రాహుల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, పార్టీ నుంచి సస్పెండైన విషయం తెలిసిందే.

26-11pg6exHMNWJQE 10_26-11pg6exHMNWJQE.qxd 25/Nov/25 11:08 PM Page 1






మంత్రి కొలుసు పార్థసారథిని సత్కరిస్తున్న
ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు

# పరిశ్రమల స్థాపనకు ఏపి అనుకూలం

- డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో బిజినెస్ ఎక్స్‌పో
- మంత్రి కొలుసు పార్థసారథి

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం ఎంతో అనుకూలమని ఏపీ సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. భారీగా పెట్టుబడులను ఆహ్వానించే దిశలో సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బిజినెస్ ఎక్స్ పో ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 12 నుండి 14 తేదీల్లో మూడు రోజుల పాటు విజయవాడ ఎస్ ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించనున్న బిజినెస్ ఎక్స్‌పోకు సంబంధించిన బ్రోచర్, ఏపీ లోగోను లాంఛనంగా మంగళవారం గుణదలలోని హోటల్ హయత్‌లో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలతతో ముందుకు వెళ్లుతుందన్నారు. శాంతియుత వాతావరణంలో రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రంలో పెట్టేందుకు ముందుకు వచ్చే వారి కోసం అనేక రాయితీలతో కొత్తగా పారిశ్రామిక పాలసీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. బిజినెస్ ఎక్స్ పోను పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, ప్రజలు సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేలా విజయవంతం చేయాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ రావూరి సుబ్బారావు, కోశాధికారి ఎస్. అక్కయ్య నాయుడు, ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్వీ స్వామి, తదితరలు పాల్గొన్నారు.

# దుర్గమ్మకి 7.37కిలోల వెండి వస్తువుల కానుక



ఇంద్రకీలాద్రి, నవంబరు 25 ప్రభాతవార్త: దుర్గమ్మ వారికి ప్రకాశం జిల్లా, చీమకుర్తికి చెందిన మారమ్ కుటుంబసభ్యులు ఎం శివపార్వతి ఒక వెండి ప్లేట్, మారమ్ వెంకటరెడ్డి వెండిగిన్నె, మారమ్ శైలజ వెండి పళ్ళెం, గోపిరెడ్డి సుధీర్‌రెడ్డి వెండిపళ్ళెం, మారమ్ పిచ్చమ్మ ఒక వెండిప్లేటు, మారం వెంకట నాగజ్యోతి ఒక వెండి ప్లేటు వెరసి రు.12,82,000ల విలువైన 7.37 కిలోల వెండి వస్తువులను కానుకలుగా ఇఒకు మంగళవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన ఇఒ అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.

దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు విజయవాడకు చెందిన దేవినేని రాజశేఖర్ పేరీట ఆయన కుమారుడు దేవినేని అవినాష్ కుటుంబసభ్యులు రు.1,01,116ల విరాళం మంగళ వారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

సర వ్రదర్శనం క్యూలైన్లు మధ్యాహ్న సమయంలో అంతరాలయ క్యూలైన్లలోకి అనుమతించి సుమారు 1500 మంది భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించారు. మంగళవారం ట్రైల్‌రన్‌గా నిర్వహించిన ఈ అంతరాలయ దర్శనంతో భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాదాకృష్ణలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమయిందని, ధర్మకర్తల మండలితో చర్చించి దేవదాయశాఖ కమీషనర్, మంత్రికి ఈ కార్యక్రమం వివరాలు తెలిపి వారి ఆమోదం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

**నేడు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణం**

దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం మార్గశిరమాసం శుద్ధషష్ఠి సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణోత ్సవం నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలన్నారు.

**బంగారు సూత్రాలు కానుక**

దుర్గమ్మవారికి చిత్తూరుకు చెందిన లక్ష్మిశిల్ప 27 గ్రాముల బరువైన రు.3.50 లక్షల విలువైన సూత్రా లను మంగళవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన ఇఒ అనంతరం దుర్గమ్మ వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.



# పాఠశాల విద్యార్థులచే నేడు మాక్ అసెంబ్లీ

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: భారత రాజ్యాంగ దినోత్సవం – 2025 ను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో "పాఠశాల విద్యార్థులచే శాసనసభ నమూనా(మాక్ అసెంబ్లీ) సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 9.00 గంటలకు అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో నిర్వహించబడుచున్నది. పాఠశాల విద్యార్థుల్లో రాజ్యాంగ పట్ల గౌరవం, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, శాసనసభా ప్రక్రియలు, ప్రజా ప్రతినిధుల పాత్రలపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను, నైపుణ్యాలను పెంపొందించడమే ముఖ్య లక్ష ్యంతో ఈ "మాక్ డ్రిల్ అసెంబ్లీ" నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రులు, విద్యార్థుల నీతి, విలువలు సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ మయాన జకీయా ఖానమ్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, చీఫ్ విప్‌లు, విప్‌లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, మేయర్లు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, గ్రంథాలయ సంస్థ, ఇతర ప్రజా ప్రతినిధులు గౌరవ అతిథులుగా హాజరవుతున్నారు. అదే విధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు వి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

# అమరావతి జిల్లా కేంద్రం ఏమైంది?

**- ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు**

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి జిల్లా కేంద్రం ఏమైందని? అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణం అమరావతిని కొత్త జిల్లా కేంద్రంగా ప్రకటించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్నారు. అమరావతి టెంపుల్ టౌన్ రైతులు ప్రజలు నరసరావుపేటకు వెళ్తున్నారున్నారు. మీడియాతో మాట్లాడుతూ ఈ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జిల్లాల పునర్విభజన, డివిజన్లు, మండలాల మార్పు చేర్పులపై సచివాలయంలో కీలక సమీక్ష జరిగింది. కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలిసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. మంత్రుల కమిటీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిని కొత్త జిల్లా కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని గతంలో వినతి పత్రాలు ఇచ్చామని జాస్తి వీరాంజనేయులు గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా ఏర్పాటై 11 సంవత్సరాలు పూర్తయినా గాని నేటికి రెవెన్యూ డివిజన్ లేకపోవడం విచారకరమని అన్నారు. తక్షణం ప్రభుత్వం అమరావతిని రెవెన్యూ డివిజన్‌గా, కొత్త జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఇక్కడ ప్రజల మనోభావాలను గౌరవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

**మాజీ సైనికోద్యోగులకు శుభవార్త**

# అసైన్డ్ భూములు పదేళ్ళ తర్వాత విక్రయించుకోవచ్చు




విజయవాడ, నవంబరు 25 పభాతవార్త ప్రతినిధి: మాజీ సైనికోద్యోగులకు ప్రొవిజనల్(తాత్కాలిక) ఎసైన్‌మెంట్ చేశారనే కారణంతో భూములపై హక్కులను నిరాకరించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ భూమిని ఒకసారి సాగులోకి తెచ్చినపుడు డి-ఫారం పట్టా జారీ చేయడం లాంఛనప్రాయమేనని తెలిపింది. ఎసైన్ చేసిన పదేళ్ళ తర్వాత ఆ భూములను విక్రయించుకోవచ్చని సూచించింది. ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పనిచేసిన అధికారి మాజీ సైనికోద్యోగుల కోటా కింద ఎసైన్డ్ భూమి పొందేందుకు అర్హులని స్పష్టం చేసింది. పిటీషనర్‌కు కేటాయించింది 'ఇసుక దిబ్బ పోరంబోకు' భూములని, వాటిని ఎసైన్ చేయడానికి వీల్లేదన్న ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపి) వాదనను త్రోసిపుచ్చింది. పిటీషనర్ అప్పారావు భూమిని నిషేధిత జాబితా (సెక్షన్ 22) నుంచి తొలగించాలని, ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం జారీ చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. విశాఖపట్నానికి చెందిన పిసి అప్పారావు ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పదవీ విరమణ చేశారు. విశాఖ జిల్లా కొత్తవలస గ్రామంలో ఆయనకు 1978లో మాజీ సైనికోద్యోగుల కోటా కింద 5.10 ఎకరాలను ప్రభుత్వం ఎసైన్ చేసింది. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో 22ఏ నుంచి తొలగించాలని ఆయన విశాఖ కలెక్టర్‌ను కోరారు. ఆ అభ్యర్థనను తిరస్కరిస్తూ కలెక్టర్ 2020 జూన్ 19న ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ అప్పారావు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది సెప్టెంబరు 15న విచారణ జరిపిన సింగిల్ జడ్జి..222ఏ నుంచి తొలగించే వ్యవహారంపై కలెక్టర్‌కు తాజాగా విజ్ఞప్తి చేయాలని సూచించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. పిటీషనర్ తరపున న్యాయవాదిల జీఎల్ నర్సింహారెడ్డి వాదనలు వినిపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అప్పారావుకు చెందిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది.

# లింగ వివక్షతపై విస్తృత ప్రచారం కల్పించాలి

- పురుషులతో సమానంగా మహిళాభివృద్ధే లక్ష్యం
- గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సిఇఓ వాకాటి కరుణ




విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: లింగ ఆధారిత వివక్షపై పోరాటం, స్త్రీ, పురుష సమానత్వం ఆవశ్యకతపై పౌరుల్లో అవగాహన పెంచడం నయీ చేతన జాతీయ జెండర్ క్యాంపైన్‌ను 4.0 ముఖ్య ఉద్దేశ్యం అని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ తెలిపారు. మంగళవారం సెర్ప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సీఈవో వాకాటి కరుణ మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో మహిళలు పోషించే పాత్ర అద్వితీయమైనదని నేడు అన్ని రంగాల్లో మహిళలు ప్రగతి పథంలో కొనసాగుతున్నారన్నారు. అయినా కొన్ని సందర్భాల్లో మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందని, ఈ వివక్షను తగ్గించడం లేదా పూర్తిగా రూపు మాపటానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా పురుషులు ముందుకు రావాలని తెలిపారు.

కేంద్ర గ్రామీణా భివృద్ధి మంత్రిత్వ శాఖ జెండర్ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు నిర్మాణాత్మక వ్యూహాలను అమలు చేసేందుకు దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, స్వయం సహాయక సంఘాలు, ఇతర ప్రభుత్వ విభాగాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు/ పౌర సమాజ సంస్థలు (సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్) అనుసంధానంతో చేపట్టారన్నారు. నేటి నుండి 23 డిశంబర్ 2025 వరకు అన్ని జిల్లాల్లో జెండర్ వివక్షతకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సెర్ప్‌కు సంబంధించిన 26 జిల్లాల జిల్లా పథక సంచాలకులు, జిల్లా సమాఖ్యలు, హెచ్.డి విభాగాలు వారు ఇందులో పాల్గొనాలన్నారు. మానవాభివృద్ధి విభాగం డైరెక్టర్ డా. వి. శివశంకర ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు వారాలపాటు నిర్వహించే కార్యక్రమంలో వివిధ రకాల థీమ్స్ ద్వారా ప్రజలకి అవగాహన కల్పిస్తామన్నారు. స్వేచ్ఛ ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమములో అన్ని జిల్లాల పథక సంచాలకులు, జిల్లా స్థాయి సిబ్బంది మండల, గ్రామ స్థాయి వరకు వర్చ్యువల్ పద్దతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెర్ప్ అడిషనల్ సీఈవో ఎన్. శ్రీరాములు నాయుడు, డైరెక్టర్లు పి. సుశీల, బి.కృష్ణ మోహన్, ఏ.కళ్యాణ చక్రవర్తి, ఎస్.జె. దీపక్, సోమయాజులు, స్త్రీనిధి జెనరల్ మేనేజర్ సిద్ది శ్రీనివాస్ రావు, అదనపు డైరెక్టర్‌లు, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్‌లు, సెర్ప్ సిబ్బంది, స్త్రీ నిధి సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



తూర్పు కనుమల సింపోజియంలో అతిథులకు వివరిస్తున్న ఫారెస్టు అధికారులు

# తూర్పు కనుమల పరిరక్షణ ఎంతో అవసరం

**ఐసర్‌లో ఉన్నత స్థాయి అధికారులతో సింపోజియం**

శ్రీకాళహస్తి, నవంబరు 25 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం విద్యాసంస్థలైన తిరుపతి ఐసర్, ఐఐటిలలో సామాజిక అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఐసర్‌లో ఏర్పాటు చేసిన 'తూర్పు కనుమల సింపోజియం'ను ఏర్పాటు చేసారు. సామాజిక అవగాహనను విద్యార్థులకు కల్పించుటకు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు అనూహ్య స్పందన వచ్చింది. విద్యార్థులకు శాస్త్రాల పరిశోధనలతో పాటు సామాజిక సమస్యలపై అవగాహన కల్గి ఉండటానికి చేపట్టిన కార్యక్రమాలు ఎంతో ప్రాముఖ్యత కల్గిందని వక్తలు వివరించారు. తూర్పు కనుమలు రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. వీటి పరిరక్షణ ఎంతోముఖ్యం అని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు ఆస్కారమేర్పడింది. తూర్పు కనుమల భౌగోళిక స్వరూపం నుంచి ఇక్కడ జీవన విధానానికి సంబంధించి ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. ముఖ్య అతిథులుగా తిరుపతి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ సి.సెల్వం, డివిజినల్ ఫారెస్టు ఆఫీసర్ వి.సాయిబాబు, స్టేట్ సిల్వికల్చరిస్ట్ ఎం.బబిత, స్టేట్ సిల్వికల్చరిస్ట్ (రాజమండ్రి) శ్రీనివాస్, డెప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ ఆత్మకూరు డివిజన్ జి.విఘ్నేష్ అప్పావు, కాకినాడ డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ ఎన్ రామచంద్రారావు, విశాఖ పట్టణం డిఎఫ్ఓ శ్రీవాణిలు హాజరయ్యారు.



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరును సత్కరిస్తున్న ఎన్జీవోస్ కార్యవర్గం

# సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి

- జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల ప్రాత కీలకం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రజలకు పారదర్శకమైన సేవలందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో భాగస్వాములు కావాలని ఏపీ రాజధాని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ్మశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణ రెడ్డి, సహాధ్య క్షులు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డి.రమేష్, నగర అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ్మశను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్షీ ్మశ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలు విజయవంతం కావడంలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువ లేనిదన్నారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి సాంధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయ పారిశ్రామిక పర్యాటక సేవారంగాల్లో వార్షికవృద్ధి లక్ష ్య సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు మరింత కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వి. ప్రసాద్, పి.రమేష్, బి.సతీష్ కుమార్, ఎం.రాజుబాబు, డి.విశ్వనాథ్, బీవీ రమణ, రామకృష్ణ, మహిళా ప్రతినిధి కె.శివలీల, నగర కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్ కే నజీరుద్దీన్, వి.రాజశేఖర్, దిలీప్ కుమార్, కె.మధుసూదనరావు, శ్రీనివాసరావు, విజయశ్రీ, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇవిఎం, వివిప్యాట్ల గోదాముకు పటిష్ట భద్రత

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీప్యాట్ల గోదాముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని.. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా విజయవాడ గ్రామీణం, గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని సూచించినట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.




ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీప్యాట్ల
గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

# వైద్యసేవలకు ప్రాధాన్యత

- రూ.2,450 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి
- మనుబోలులో ఆయుష్మాన్ భవ ఆరోగ్యకేంద్రం ప్రారంభం



మనుబోలు (నెల్లూరు), నవంబరు 25 ప్రభాతవార్త: మనుబోలులో నూతనంగా 1.68 కోట్లతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భవ ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్యశాలలను మంజూరు చేయడం తప్ప వాటికి విధులను ఏర్పాటు చేయలేదన్నారు. మనుబోలులోని పిహెచ్‌సి నాలుగు సంవత్సరాల క్రితం మంజూరు చేయడం జరిగిందని కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలను నిలిపివేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ప్రభుత్వంపై నమ్మకంతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి నిర్మాణాలను చేపట్టి పూర్తి చేశారన్నారు. నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.2,450 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టి వైద్యసేవలు అందించడానికి కృషి చేశామన్నారు. పిహెచ్‌సి మంజూరు అయి నాలుగు సంవత్సరాలు కాలం పూర్తి అయిందని ఇక్కడ గత ప్రభుత్వ ప్రజా ప్రతినిదులు నిర్మాణం పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 15 మెడికల్ కాలేజిలలో మంజూరు చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప నిధులు మంజూరు చేసిన పాపాన పోలేదని పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించలేదని గత ప్రభుత్వాన్ని దుయ్య బట్టారు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2005 విలేజ్ హెల్త్ క్లినక్ సెంటర్‌లో మంజూరు చేశామని, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలో 35 విలేజి హెల్త్ క్లినిక్ సెంటర్లు మంజూరు చేయడం జరిగిందని దీంతోపాటు ముత్తకూరులో మరో పిహెచ్‌సి కోసం కోటి 95 లక్షలు నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే ఉదయగిరిలో రూ.6 కోట్లతో ఆసుపత్రిలో అభివృద్ధి, వింజమూరులో డయాలసిస్ సెంటర్, పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సీనియర్ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అంతే తనకు ఆదర్శమని వీరిద్దరు తమ ప్రాంతాలలో పేద ప్రజల అభివృద్ధికి కృషి చేయాలన్న ఆకాంక్షతో పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, వాసిరెడ్డి రామిరెడ్డి, వెంకటరమణయ్య, పచ్చిపాలరామిరెడ్డి, చేరెడ్డి పద్మనాభరెడ్డి, శివుడి రాజాగౌడ్, జనసేన ప్రసాద్, మహేష్ తదితర నాయకులు పాల్గోన్నారు.

# స్వస్థలాలకు మయన్మార్ సైబర్‌క్రైమ్ బాధితులు

గన్నవరం, నవంబర్ 25 ప్రభాతవార్త: మయన్మార్ సైబర్‌క్రైమ్ ముఠాల చెర నుండి మన రాష్ట్రానికి చెందిన 43మంది బాధితులను క్షేమంగా వారి స్వస్థలాలకు సాగనంపినట్లు రాష్ట్ర మద్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనా, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. మయన్మార్ నుండి మూడు ప్రత్యేక విమానాల్లో 370మంది బాధితులు డిల్లీ విమానాశ్రయానికి చేరుకోగా, వారిలో 43మంది మన రాష్ట్రానికి చెందిన వారిని డిల్లీలోని ఏపి.భవన్ అధికారులు ఏపి.భవన్‌కు చేర్చి వారికి ఆహార వసతి కల్పించారని, ఆర్థికంగా సాయం అందించినట్లు మంత్రి వివరించారు. అనంతరం రైల్వేశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఎమర్జెన్సీ కోటా ద్వారా టిక్కెట్‌లను ఖరారు చేయించి మంగళవారం బాధితులను రైళ్ళలో వారి గమ్యస్థానాలకు సాగనంపామని తెలిపారు. ఈఆపరేషన్‌తో కలుపుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19నెలల కాలంలో మొత్తం 79మందిని మయన్మార్ సైబర్ క్రైమ్ నుండి ఏపి.భవన్ బృందం సురక్షితంగా స్వస్థలాలకు పంపించినట్లు మంత్రి పేర్కొన్నారు.

# 4,018 విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రాలు

**• ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సహించడమే లక్ష్యం • రూ.385.57 కోట్లతో ఏర్పాటుకు చర్యలు**

**• పిఎం ఈ డ్రైవ్' కింద ప్రతిపాదనలు రెడీ • రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కార్యాచరణ**

విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో విద్యుత్ వాహనాలను భారీ ఎత్తున ప్రోత్సహించే దిశలో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తుంది. విద్యుత్తు వాహనాలకు ఇబ్బంది లేకుండా రాయితీపై విద్యుత్తు చార్జింగ్ చేసే కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తుంది. అందులో భాగంగా ఛార్జింగ్ నెట్‌వర్క్, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించింది. నెడ్‌క్యాప్ అధికార వర్గాల సమాచారాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎం ఈ డ్రైవ్ పథకం క్రింద విద్యుత్ బైక్‌లు, ఆటోలు, కార్లు, బస్సుల కోసం 4,018 ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు రూ.385.57 కోట్లతో ప్రాజెక్టును రూపొందించింది. దీని కోసం ఈపీడీసీఎల్ పరిధిలో 628, సీపీడీసీఎల్ పరిధిలో 165, ఎస్‌పీడీసీఎల్ పరిధిలో 209 లొకేషన్లను గుర్తించింది. ప్రధాన పట్టణాలు,జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలను ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు వెళ్ళాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ భాధ్యతలను నెడ్‌క్యాప్ నిర్వహిస్తుంది. ఈవీ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్‌లు (ఈవీ పీసీఎస్) మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంలో డిస్కంలు ఏజెన్సీలుగా వ్యవహరిస్తాయి. పీఎం ఈ డ్రైవ్ పథకం క్రింద దేశవ్యాప్తంగా విద్యుత్ ఛార్జిగంగ్ కేంద్రాల కోసం కొనుగోలు చేసే పరికరాలపై రాయితీలు ఇచేచందుకు రూ.2వేల కోట్లు వాహనానికి ఛార్జింగ్ కోసం ప్లగ్ ఇన్ చేసేందుకు అవసరమైన ఈవీ సప్లై ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్‌ఈ)కు కేంద్రం పలు రాయితీలు నిర్ధేశించింది. డిస్కంలు, ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే వాటిని ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల(సీపీఓ) ద్వారా నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. సీపీవోలు ఛార్జింగ్ సేవలు వినియోగించుకున్న వారి నుంచి యూనిట్‌కు రూ.15 చోప్పున వసూలు చేస్తారు. అందులో కొంత మొత్తాన్ని డిస్కంలకు చెల్లించాలి. ఈ ప్రక్రియ టెండరు ద్వారా నిర్వహించనున్నారు. పట్టణాలు, జాతీయ రహదారుల వెంట వాహనాలు నిలిపేందుకు అనువైన ప్రాంతాల్లోనే ఛార్జింగ్ స్టేషనన్లు ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది. 2011 జనాభా లెక్కల అధారంగా 10 లక్షలకు పైగా జనాభా ఉండాలి. స్మార్ట్ సిటీల కింద ఇప్పటికే కేంద్రం గుర్తింపు క్రింద రాష్ట్ర రాజధాని నగరం జాతీయ శుద్ధ గాలి పథకం (ఎన్‌సీఏపీ) కింద ఎంపికైన పట్టణాలు వాటితో పాటు అర్హత కల్గిన సంస్థలు వాటి అవసరాలకు అనుగుణంగా ఇతర నగరాల్లో ఈవీ పీసీఎస్ ఏర్పాటు చేయచ్చు. రాష్ట్ర, అంతరాష్ట్ర రహదారుల వెంట ఈవీ కేంద్రాలు ఏర్పాటుకూ కేంద్రం అనుమతిస్తుంది. టోల్‌గేట్‌లోని వాహనాల సంఖ్య ఆధారంగా ఎక్కువ రద్దీ ఉండే రహదారులు, పెద్ద నగరాలు, పారిశ్రామిక హబ్‌లు, పోర్టులకు అనుసంధానంగా ఉన్న హైవేలపై ఏర్పాటు చేయచ్చు. డిస్కంలు ప్రతిపాదించిన ఛార్జింగ్ కేంద్రాలను పరిశీలిస్తే ద్విచక్ర/ ఆటోలు 2,371 కేంద్రాలు ఉన్నాయి, కార్లు 1,512 కేంద్రాలు విద్యుత్ బస్సులు/ ట్రక్కులు 135 కేంద్రాలు ఉన్నాయి.




# 6న అమెరికాకు మంత్రి లోకేశ్

**• నాలుగు రోజులు సుడిగాల పర్యటన • పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం**

**• డల్లాస్‌లో ప్రవాసాంధ్రులతో సమావేశం • పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యే చాన్స్**



విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. డిసెంబర్ మొదటి వారంలో ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోకి కొత్త పరిశ్రమలను ఆహ్వానించడంతో పాటు, ప్రవాసాంధ్రులను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఖరారైన షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు లోకేశ్ అమెరికాలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా తొలిరోజు డిసెంబర్ 6న డల్లాస్‌లో తెలుగు కమ్యూనిటీ విత్ నారా లోకేశ్ అనే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ వంటి నగరాల్లోనూ పర్యటించి పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఈ పర్యటనలో భాగంగా డల్లాస్‌కు సమీపంలోని గార్లాండ్‌లో ఉన్న కర్టిస్ కల్వెల్ సెంటర్‌లో ఒక భారీ సభను నిర్వహించనున్నారు. దాదాపు 8 వేల మంది ప్రవాసాంధ్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, కెనడా నుంచి కూడా పలువురు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, పెట్టుబడులతో భాగస్వాములు కావాలని లోకేశ్ ఈ సభలో ప్రవాసాంధ్రులను కోరనున్నారు. టెక్, ఐటీ రంగాల్లో అవకాశాలు, యువ నాయకత్వం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో రూ.13 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించినట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ స్ఫూర్తితోనే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు తాజా పర్యటన చేపడుతున్నట్లు తెలుస్తోంది.

# సంక్రాంతి వరకు ఆప్కోలో రాయితీ విక్రయాలు

గన్నవరం(విజయవాడ), నవంబర్ 25, ప్రభాతవార్త: ఆప్కో విక్రయశాల ద్వారా విక్రయిస్తున్న 40శాతం రాయితీ చేనేత వస్త్రాల విక్రయాలను వచ్చే సంక్రాంతి వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర చేనేత జౌళిశాఖామంత్రి ఎస్.సవిత మంగళవారం ఒప్రకటనలో తెలిపారు. చేనేత వస్త్రాల కొనుగోలులో ప్రజల నుండి వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రాయితీ విక్రయాలు పొడిగిస్తున్నట్లు చెప్పారు. రాయితీపై చేనేత వస్త్రాలు విక్రయిస్తుండటంతో అటు ప్రజలకు, ఇటు చేనేత కార్మికులకు మేలు కలుగుతుందన్నారు. రాయితీపై విక్రయాలు చేపట్టడంతో ప్రజల్లో చేనేత వస్త్రాలపట్ల ఆదరణ పెరుగుతుందన్నారు. ఆప్కో షోరూంలలో రాయితీ విక్రయాల వల్ల అమ్మకాలు పెరిగినట్లు మంత్రి వివరించారు. రాయితీ ఇవ్వక ముందు రోజుకు రూ.3లక్షల విలువగల విక్రయాలు జరుగగా, 40శాతం రాయితీ విక్రయాలు ప్రారంభించిన తరువాత రోజు నుండి రోజువారి అమ్మకాలు రూ.9లక్షలకు చేరినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత ట్రెండ్‌ను గమనించి చిన్నారులతోపాటు అన్ని వయసుల వారికి రెడీమెడ్ చేనేత దుస్తులు అందుబాటులోకి తెచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేందుకు సియం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత ్వం పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రధాన నగరాల్లో చేనేత బజార్లు, చేనేత ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో చేనేత ఎగ్జిబిషన్‌లు నిర్వహించిన సంగతి గుర్తుచేసారు. త్వరలో విశాఖపట్నం, కడప నగరాలతోపాటు, జిల్లాకేంద్రాల్లో చేనేత ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత తెలియచేసారు.

# డిసెంబర్ 3,4,5 తేదీల్లో ఉద్భవ్

**• ఎపిలో గిరిజనుల జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు**

**• 22 రాష్ట్రాల నుంచి 1644 మంది విద్యార్థులు హాజరు**

**• గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో తొలిసారిగా గిరిజన చిన్నారులకు సాంస్కృతిక ఉత్సవాలకు రంగం సిద్దమవుతుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఏపీ ఏలకవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఆధ్వర్యంలో సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ శాఖ సన్నద్ధమయింది. గిరిజన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో జాతీయ సమైక్యతను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 3, 4, 5 తేదీల్లో నిర్వహించడానికి సమాయత్తమవుతోంది. రాష్ట్ర రాజధాని అమరావతి సమీపంలోని కేఎల్ యూనివర్శిటీలో ఈ ఉత్సవాలు నిర్వహించడానికి ఆమోంచారు.

ఉద్భవ్ 2025 పేరుతో నిర్వహించనున్న ఈ సాంస్కృతిక, సాహిత్య ఉత్సవాలలో ప్రతిభ చాటేందుకు 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి 1644 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. విద్యార్థులతో పాటు ఆయా రాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు, కంటింజెంట్ మేనేజర్స్ మరో 278 మంది హాజరవుతున్నారు. దేశంలోని సాంస్కృతిక, కళా వైవిద్యం మరియు గిరిజనుల జీవిత ముఖచిత్రాలను ప్రతిబింబించే సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేయనుంది. వెలగపూడి సచివాలయంలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సన్నాహకాల వివరాలను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదాభార్గవి, గురుకులం కార్యదర్శి ఎం. గౌతమి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి విలేఖరుల సమావేశంలో వివరించారు. ఉద్భవ్2025లో పాల్గొనేందుకు వచ్చే వారికి సదుపాయాల్లో లోటుపాట్లు తలెత్తకుండా రవాణా, వసతి, భోజన ఏర్పాట్లు ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పేరు ప్రతిష్టలను జాతీయ స్థాయంలో ఇనుమడింపజేసేలా పోటీలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉద్భవ్2025 పోస్టర్, లోగోను మంత్రివర్యులు ఆవిష్కరించారు.

# రేషన్‌కార్డులు విభజన కోసం ఎదురుచూపులు

**కార్డులు లేక ఇంటినిర్మాణ సాయానికి నోచుకోని వైనం**

గన్నవరం(కృష్ణా), నవంబరు 25 ప్రభాతవార్త: గత కొన్నాళ్ళుగా రేషన్ కార్డులు విభజన చేపట్టకపోవటంతో సంక్షేమ పథకాల లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వంత స్థలం ఉన్న పేదవారు ఈనెలాఖరులోగా ఇంటినిర్మాణానికి ప్రభుత్వ సాయం కోసం ధరఖాస్తు చేసుకోవాలని గడువు విధించింది. ఈనేపధ్యంలో ధరఖాస్తు దారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులదృవీకరణ పత్రం, ఆదాయదృవీకరణ పత్రం, తమ ధరఖాస్తుకు జత చేయాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పేదలు రేషన్‌కార్డులు లేకపోవటంతో ఈపధకానికి ధరఖాస్తు చేసుకునేందుకు అర్హత కోల్పోతున్నారు. కొత్తగా పెళ్ళయిన వారు, తల్లిదండ్రులతో విడిపోయి వేరుగా ఉంటున్న వారి పేర్లను తల్లిదండ్రుల రేషన్‌కార్డునుండి తొలగించి వారికి కొత్తగా కార్డులు జారీచేయాల్సి ఉండగా ఈప్రక్రియ చేపట్టడంలేదు. దీంతో వీరు పలు పధకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం వీరికి అందని దాక్షగా మారింది. ఈవిధంగా ఇబ్బందులు పడుతున్న పేదలు ఇప్పటికే రేషన్‌కార్డులు విభజన చేయాలంటూ సచివాలయాల్లో ధరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం వీరి విషయంలో తగు నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేయటం వీరిని పలు పధకాలకు దూరం చేస్తుంది. కార్డులు విభజన చేయకపోవటం వల్ల కార్పోరేషన్ రుణాలు, చేతివృత్తుల వారికి అందే పధకాలు వీరికి దక్కటంలేదు. తక్షణం ప్రభుత్వం రేషన్‌కార్డుల విభజన చేపట్టి ఇళ్ళు నిర్మించుకునే పేదలకు సొంత ఇంటికలను నెరవేర్చాల్సి ఉంది.



## త్వరలో అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్టు అమలు

గన్నవరం(విజయవాడ), నవంబర్ 25, ప్రభాతవార్త: సాధ్యమైనంత త్వరలో అమరావతిలో జర్నలిస్ట్ హౌసింగ్ ప్రాజెక్టును అమలు చేస్తామని రాష్ట్ర సమాచారశాఖా మంత్రి కె.పి.సారధి జర్నలిస్ట్ నాయకులకు హామీ ఇచ్చారు. అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం మంత్రి సారధిని కలిసి ఈప్రజెక్టును త్వరగా అమలు చేయాలని వినతి పత్రం అందచేసారు. జర్నలిస్ట్‌ల కోసం సిఆర్డీఏ ఆధ్వర్యంలో బహుళ అంతస్తుల గృహసముదాయాన్ని నాలుగు కేటగిరిల్లో నిర్మించేందుకు 30 ఎకరాల భూమిని మందడం, తుళ్ళూరు పరిధిలో అమరావతి హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వం 2019లో కేటాయించిందని, సిఆర్డీఏ సంస్థనే డెవలపర్‌గా దాని ఆధ్వర్యంలోనే ప్రాజెక్టు నిర్మించాలని సొసైటీ కొరిందని మంత్రికి వివరించారు. ఈమేరకు సొసైటీకి కేటాయించిన భూమిని తిరిగి ప్రభుత్వానికే ఇచ్చామని చెప్పారు. ఈప్రతిపాదనకు అంగీకరించిన సియం చంద్రబాబు జిఓ 107ను ఇస్తూ హ్యాపినెస్ట్ మోడల్‌లో నిర్మిస్తామని చెప్పారు. ఈజిఓను అమలు చేయాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సారధి జర్నలిస్ట్ సొసైటీ విజ్ఞప్తిని మంత్రి నారాయణ, సిఆర్డీఏ కమీషనర్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరగా ఈప్రాజెక్టు అమలు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, డైరెక్టర్‌లు చావా రవి, ఈశ్వర్, శ్రీనివాస్, గోపీ, సత్యన్నారాయణ, శ్రీనాథ్, మల్లిఖార్జున్, నాగేశ్వరావు తదితరులు మంత్రిని కలిసారు.

# పరకామణి చోరీ కేసులో రాజీ చేయాల్సిన అవసరమేంటి?!

**• నిందితుడు రవికుమార్ మీకు తెలుసా! • చోరీ చేసిన అతనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు**

**• టిటిడి మాజీ ఛైర్మన్ భూమనను విచారణచేసిన సిఐడి అధికారులు**

తిరుపతి, నవంబరఉ 25 ప్రభాతవార్త ప్రతినిధి: భక్తులు కానుకలుగా సమర్పించిన వాటిని జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తి, అమెరికన్ డాలర్లు చోరీచేసినా చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారని, పోలీస్ కేసు నమోదైన తరువాత చట్టప్రకారం చర్యలు తీసుకోలేకపోవడం, రాజీచేయడం వెనుక ఎవరి పాత్ర ఉందనే కోణంలో టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన సమయంలో టిటిడి బోర్డు సభ్యుడుగా కూడా ఉన్న మీరు ఈ విషయాన్ని ఎందుకు తీవ్రంగా పరిగణించలేదని, పరకామణిలో కీలకమైన సివి రవికుమార్ అమెరికన్ డాలర్లు దొంగతనం చేశాడని తెలిసినా తదుపరి చర్యలకు ఎందుకు బోర్డు అనుమతించక పోయిందని ఆరా తీసినట్లు సమాచారం. రవికుమార్ అనే వ్యక్తి మీకు తెలుసా అనే ప్రశ్నలు వేయడంతో భూమన కరుణాకర్‌రెడ్డి తన ప్రమేయం ఏమీ లేదని, తానూ ఓ బోర్డు సభ్యుడిగానే వ్యవహరించానని సమాదానం ఇచ్చారనేది తెలిసింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేయలేకపోవడం, ఆపై పోలీస్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారనే ఆరోపణలపై కూడా ప్రశ్నించినట్లు సమాచారం. దొంగతనం చేసిన వ్యక్తిని కాపాడటంలో తనప్రమేయం ఏమీ లేదనే వాదన వినిపించారు. 2023 ఆగస్ట్‌లో టిటిడి ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన తరువాత కూడా ఈ కేసుపై తాను పెద్దగా పట్టించుకోలేదనేది ఆయన సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఉద్యోగుల సంక్షేమం, హిందూ ధర్మపరిరక్షణ, దేవుని ఖ్యాతి వ్యాప్తిచేయడంపై, అభివృద్ధిపనులు చేపట్టడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టానని సిఐడికి భూమన వివరించడం జరిగింది. అంతేగానీ పరకామణి చోరీ కేసులో నిందితుడిపై చర్యలు తీసుకోకుండా ఎవరినీ ఎప్పుడూ ఆదేశించలేదని, పోలీసుఅధికారులను తాను ఆ విషయం చర్చించలేదనేది, తన ప్రమేయం అస్సలు లేదని వెల్లడించారనేది తెలిసింది. దీంతో సిఐడి అధికారులు మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి విశ్రాంతి గృహంలో అర్ధగంటపాటు భూమన కరుణాకర్‌రెడ్డిని విచారణ చేసి ఆ తరువాత ఆయన వాంగ్మూలం నమోదు చేసి పంపించేశారు. భూమన సిఐడి విచారణ నుండి బయటకు వచ్చి నేరుగా కారు ఎక్కి వెళ్ళిపోయారు.

### ఉదయం నోటీసులు, సాయంత్రం విచారణ

2023లో తిరుమల పరకామణి భవనంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సివి రవికుమార్ పెద్దజీయర్ మఠంలో ఉద్యోగి. పరకామణిలో ఎవరి ప్రమేయంతో చేరారో గానీ ఆయన ఏకంగా దేవుని కానుకలనే చోరీ చేస్తూ అప్పట్లో విజిలెన్స్‌కు పట్టుబడ్డాడు. దీనిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆపై 2023 సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్ ద్వారా కేసు రాజీచేసుకున్నారు. అయితే వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి సొమ్మును దొంగతనం చేస్తూ పట్టుబడిన రవికుమార్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి అరెస్ట్ చేయకుండా కాపాడుతూ చివరకు అప్పటి టిటిడి బోర్డు ఛైర్మన్, ఓ ఉన్నతాధికారి, విజిలెన్స్ అధికారులు కలసి పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పోలీసులు అతనిపై చర్యలు తీసుకోలేదనేది ఆరోపణలు. చోరీ కేసు రాజీవెనుక 14కోట్ల రూపాయలు రవికుమార్ ఆస్తులను శ్రీవారి కానుకగా దేవునికి విరాళంగా రాసివ్వడంలో అప్పటి బోర్డులో ఛైర్మన్, సభ్యులు కీలకంగా వ్యవహరించారనేది సమాచారం. ఆ బోర్డులో భూమన సభ్యుడుగా కూడా ఉన్నారు. 2023 ఆగస్ట్‌లో భూమన రెండవసారి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. అప్పటికే ఈ కేసు ఓ కొలిక్కి చేరింది. అయితే ఈ చోరీ కేసు వెనుక భారీ మొత్తంలో లబ్ధిపొందారనేది శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం, తదుపరి హైకోర్టు ధర్మాసనం విచారణకు సిఐడిని ఆదేశించడం జరిగింది. సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సభ్యులు గత ఇరవైరోజులుగా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. చోరీ కేసులో కీలకమైన, ఫిర్యాదిదారుడు పూర్వ ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ సిఐడి విచారణకు రెండవసారి వస్తూ హత్యకు గురవడంతో ఈ కేసులో ఇప్పుడు మాజీలను విచారణ చేస్తున్నారు. భూమన విచారణలో తనకెలాంటి సంబంధంలేదని, పరకామణి చోరీ అనంతరం పరిణామాల్లో తన ప్రమేయం ఏమీ లేదనేది సిఐడికి వాంగ్మూలం ఇచ్చారు. ఇదంతా ఒకుట్రతోనే జరుగుతోందని ఆయన ఆరోపించారు.

## సచివాలయాల ఉద్యోగుల పదోన్నతులపై అధ్యయనం



విజయవాడ, నవంబరు 25 ప్రభాతవార్త ప్రతినిధి: గ్రామ సచివాలయాల పని తీరు, ఆ వ్యవస్థ నిర్మాణంపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామ స్థాయిలో వివిధ శాఖల నిర్మాణం, సచివాలయం ఉద్యోగులను ఆయా శాఖలకు ఎలా అనుసంధానించాలి అనే అంశంపైనా కూలంకషంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మంత్రుల బృందం తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. మంత్రులు పొంగూరి నారాయణ, కింజారపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంత్రుల బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బందికి పదోన్నతుల కల్పన, ఇతర శాఖల్లో అనుసంధానించడానికి ఉన్న అవకాశాలపై మంత్రుల బృందం, ఆయా శాఖల ఉన్నతాధికారులతో చర్చించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినప్పటికీ సచివాలయ వ్యవస్థ నిర్మాణం దెబ్బతినకుండా ఎలా ముందుకు తీసుకువెళ్లాలనే అంశాన్ని పరిగణలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ మొత్తం ప్రక్రియపై వచ్చే మార్చి నాటికి పూర్తి అధ్యయనం చేసి ఒక నివేదిక ఇవ్వాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవసరమైన పక్షంలో ప్రతి నెలా ఒకసారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి లోటుపాట్లపై చర్చిద్దామని చెప్పారు. ఈ సమావేశంలో జి.ఎస్.డబ్ల్యూ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ, హోమ్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

# వచ్చే నాలుగేళ్ళలో 12.59లక్షల గృహాలను పూర్తిచేస్తాం

**• ఇళ్ళులేని పేదలందరికి 2029కల్లా శాశ్వత గృహవసతి • రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి**




సచివాలయం, నవంబరు 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ళు,ఇళ్ళస్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. ఐదేళ్ళలో 15.59లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ఉందని, ఇందులో ఇప ్పటికే 3.00 లక్షల గృహాలను పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన 12.59లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్ళలో పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటికే పూర్తిచేసిన 3.00లక్షల గృహాలతోపాటు వచ్చే ఉగాదికి 5.00లక్షల గృహాలను, జూన్ కల్లా మరో 87వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పిఎంఎవై-1.00 పథకం అమలు గడువును కేంద్ర మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో ఈ పథకం కింద ఇప్పటివరకు ప్రారంభం కాని 3.03లక్షల గృహాలను కూడా ఈ ఏడాది డిసెంబర్ కల్లా పూర్తిచేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు.

### 16నెలల్లో 3లక్షల గృహాలను పూర్తిచేశాం

ఈ గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రతిపక్ష పార్టీ సభ్యులు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడం ఎంతో దురదృష ్టకరమన్నారు. ఐదేళ్ళ కాలం లో గత ప్రభుత్వం కేవలం 6.00 లక్షల గృహాలను మాత్రమే పూర్తిచేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచి ్చన కేవలం 16నెలల కాలవ్యవధిలోనే 3.192 లక్షల గృహా లను పూర్తి చేయడం జరి గిందన్నారు. 2014-19 మధ్య కాలం లో తమ ప్రభు త్వ హాయాంలో 8.687 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేయడం జరి గిందన్నారు. 2014- 19 మధ్యకాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం క్రింద మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న 4.7లక్షల గృహాలను గత ప్రభుత్వం రద్దు చేయడమే కాకుండా పూర్తయిన 2.7లక్షల గృహాలకు రూ.920 కోట్లు చెల్లింపు చేయకుండా ఎగ్గొట్టి ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈబిసి వర్గాల వారికి అన్యాయం చేయడం జరిగిం దన్నారు. అయితే తమ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పక్ష పాత ధోరణితో ఏమాత్రం వ్యవహరించకుండా గత ప్రభుత్వం మంజూరుచేసి 18.61లక్షల గృహాల్లో మిగిలి ఉన్న 11.90లక్షల గృహ నిర్మాణాలను కొనసాగించడం జరుగుతుందన్నారు.

### 81వేల మందికి ఇళ్ళ స్థలాలు....

### 1.15లక్షల మందికి పొజిషన్ సర్టిపికెట్లు

ఇళ్ళ స్థలాలు కావాల్సిన వారిని గుర్తించేందుకు చేస్తున్న సర్వేలో ఇప్పటివరకు 81వేలమందికి ఇళ్ళ స్థలాలు కావాల్సి ఉందనే విషయాన్ని గుర్తించడం జరిగిందన్నారు. అదే విధంగా దాదాపు 1.15లక్షల మందికి ప్రభుత్వం, పోరంబోకు స్థలాల్లో ఉంటున్నవారికి పొజిషన్ సర్టిఫికేట్లు అందజేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు.

### రూ.80 కోట్ల మేర అవినీతికి పాల్పడిన రాక్రీట్ నిర్మాణ సంస్థ

గృహ నిర్మాణాల విషయంలో గతంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ నివేదిక అందజేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ప్రకారం రాక్రీట్ నిర్మాణ సంస్థ గృహ నిర్మాణాల విషయంలో పలు అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఈ సంస్థకు 50,402ఇళ్ళ నిర్మాణ పనులను అప్పటించడం జరిగిందని, అయితే వీటిలో 47850గృహ నిర్మాణాలను ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసి గృహ లబ్ధిదారులను తీవ్ర అన్యాయానికి గురిచేయడం జరిగిందన్నారు. దాదాపు రూ.80 కోట్ల మేర అవినీతికి ఈ సంస్థ పాల్పడినట్లు వెల్లడైందని, ఈ సొమ్మును ఆ సంస్థ నుండి రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు, ఏప జిల్లాల్లో అవకతవకలకు పాల్పడటం జరిగిందో ఆయా జిల్లాల్లో లీగల్‌గా అవకాశం ఉన్న అన్ని రకాల కేసులను నమోదు చేయాలని ఆదేశించినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు.

# సుల్తాన్ అజ్లాన్ కప్‌లో భారత్ ఓటమి

### 2-3 తేడాతో బెల్జియం విక్టరీ




**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్-2025 టోర్నమెంట్‌లో భారత్ బెల్జియం చేతిలో పరాజయం పాలైంది. సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టును బెల్జియం 2 -3 తేడాతో ఓడించింది. భారత్ తరఫున అభిషేక్, శిలానంద్ లక్రా గోల్స్ కొట్టగా, బెల్జియం తరఫున రోమన్ దువేకోట్ రెండు సార్లు, నికోలస్ డి కెర్పెల్ ఒక గోల్ మొత్తంగా 3 గోల్స్ చేశారు. భారత్ తొలి క్వార్టర్‌లో రెండు పెనాల్టీ కార్నర్‌లతో సహా బెల్జియం ఒత్తిడిని బాగా ఎదుర్కొంది. గోల్ కీపర్ పవన్ కీలక సేవ్‌లను అందించాగా, భారత్ క్రమంగా మరింత నియంత్రణ సాధించింది. అయితే 17వ నిమిషంలో దువేకోట్ పవన్‌ను ఓడించి బెల్జియం ఆధిక్యంలోకి వెళ్లింది. దిల్‌ప్రీత్ సింగ్ ద్వారా గోల్ సాధించినట్లు భారత్ భావించినా, ఆ గోల్ రద్దయింది. దీంతో బెల్జియం హాఫ్ టైం ముగిసే సమయానికి 1-0 ఆధిక్యంలో ఉంది. పునఃప్రారంభం తర్వాత భారత్ ప్లేయర్ అభిషేక్ 33వ నిమిషంలో గోల చేసి స్కోరును సమం చేశాడు. మూడవ క్వార్టర్ చివరిలో కెర్పెల్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో బెల్జియం తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. నాల్గవది ప్రారంభంలో దువేకోట్ ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. భారత్ పట్టుదల కొనసాగించడంతో 57వ నిమిషంలో రబిచంద్ర సింగ్ క్రాస్ నుండి లక్రా ఒక గోల్‌ను వెనక్కి తీసుకున్నాడు. ఇది ఉత్కంఠభరితమైన ముగింపును ఏర్పాటు చేసింది. చివరి నిమిషాల్లో మోహిత్ హెచ్ఎస్ కీలకమైన సేవ్ చేసి బెల్జియన్ నాల్గవ గోల్‌ను సాధించి గెలుపొందింది.


### వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో

# తొలిసారి ఫైనల్స్‌కు భారత్

### బాలికల విభాగంలో కాంస్యం



**న్యూఢిల్లీ:** ప్రపంచ యువ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. భారత టేబుల్ టెన్నిస్ చరిత్రలో తొలి సారిగా, అండర్ 19 బాలుర జట్టు రొమేనియాలో జరిగిన ఈ టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్స్‌లో బలీయమైన ప్రత్యర్థి చైనీస్ తైపీని ఓడించింది. రైజింగ్ స్టార్లు అంకుర్ భట్టాచార్జీ, పిబి అభినందన్ మరియు ప్రియానుజ్ భట్టాచార్యలతో కూడిన భారత జట్టు 3-2 తేడాతో విజయం సాధించిబంగారు పతకపోరుకు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో భట్టాచార్జీ భారతదేశానికి మంచి ఆరంభాన్ని అందించాడు, హ్సు హ్సి యెన్‌చియాపై తన మొదటి మ్యాచ్‌ను 3-2 తేడాతో గెలుచుకున్నాడు. తదుపరి మ్యాచ్‌లో కువో గువాన్‌హాంగ్ అభినందన్‌ను 3-1 తేడాతో ఓడించడంతో చైనీస్ తైపీ సమం చేసినప్పటికీ, భట్టాచార్య లిన్ చిన్‌టింగ్‌పై పోరాడి 3-2 తేడాతో భారత్‌ను తిరిగి ఆధిక్యంలోకి తెచ్చాడు. అయితే చైనీస్ తైపీ మరోసారి పోరాడి సమం చేసింది. కువో భట్టాచార్జీని వరుస గేమ్‌లలో 3-0 తేడాతో ఓడించాడు. కానీ మొదటి మ్యాచ్‌లో ఓడిపోయిన అభినంద్, హ్సుపై 3-0 తేడాతో విజయం సాధించి భారత్‌కు ప్రసిద్ధ విజయాన్ని నమోదు చేశాడు. అంతకుముందు, క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ ఫ్రాన్స్‌ను 3-0 తేడాతో ఓడించి, చైనీస్ తైపీతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. కాగా భారత అండర్ 15 బాలికల జట్టు సెమీఫైనల్లో దక్షిణ కొరియా చేతిలో 0-3 తేడాతో ఓడిపోయి కాంస్య పతకానికి పరిమితమైంది. అంకోలికా చక్రవర్తి, దివ్యాంశి భౌమిక్, అనన్య మురళీధరన్‌లతో కూడిన భారత జట్టు దక్షిణ కొరియన్లకు ఏమాత్రం సరితూగలేకపోయింది. ఈ అమ్మాయిలు అంతకుముందు క్వార్టర్ ఫైనల్స్‌లో జర్మనీని 3-1 తేడాతో ఓడించారు.



ఆట

### ఫిఫా ప్రపంచ కప్:

# ఫైనల్‌కు పోర్చుగల్

**న్యూఢిల్లీ:** ఫిఫా అండర్17 ప్రపంచ కప్ టోర్నీలో పోర్చుగల్ పెనాల్టీ షూటౌట్‌లో బ్రెజిల్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. దీంతో ఈ నెల 27న జరిగే ఫైనల్‌లో ఆస్ట్రియా, పోర్చుగల్ తలపడనున్నాయి. అదే రోజు బ్రెజిల్, ఇటలీ మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ జరుగుతుంది. పోర్చుగల్, ఆస్ట్రియా రెండు జట్లు తొలిసారి ఫైనల్‌కు చేరుకోవడంతో అండర్17 ఫిఫా ప్రపంచ కప్‌లో కొత్త ఛాంపియన్ వస్తాడు. సడన్ డెత్‌లో పోర్చుగల్ బ్రెజిల్‌ను 6-5 తేడాతో ఓడించగా, ఆస్ట్రియా ఇటలీని 2-0 తేడాతో ఓడించింది. టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ చేసిన మోజర్ (ఏడు ఆటల్లో ఎనిమిది గోల్స్) ఈ మ్యాచ్‌లో 57వ నిమిషంలో స్కోరింగ్‌ను ప్రారంభించి త్రూ బాల్‌ను గోల్‌గా మార్చాడు. రెండవ అర్ధభాగంలో స్టాపేజ్ సమయంలో అద్భుతమైన ఫ్రీ కిక్‌తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. ఇక పోర్చుగల్, బ్రెజిల్ మధ్య జరిగిన మరో సెమీఫైనల్ చాలా క్లిష్టంగా మారింది. మొత్తం ఆటలో 35 ఫౌల్‌లు ఉండగా, 4 షాట్లు మాత్రమే ప్రతి వైపు నుండి రెండు లక్ష్యాన్ని చేరుకున్నాయి. అయితే, పోర్చుగల్ గోల్ కీపర్ రొమారియో కున్హా ఎట్టకేలకు గోల్‌ను కాపాడుకున్నాడు. మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌లకు దారితీసిన రెండు ప్రయత్నాలను అడ్డుకున్నాడు. రెండు జట్లు మొదటి నాలుగు స్పాట్ కిక్‌లను గోల్‌గా మార్చాయి. కున్హా పోర్చుగల్ తరపున ఐదవ పెనాల్టీని మిస్ చేసి, దాన్ని బార్ మీదుగా షూట్ చేశాడు. బ్రెజిల్ ఆట గెలిచే పరిస్థితిలో రువాన్ పాబ్లో వుడ్‌వర్క్‌ను కొట్టాడు. జోస్ నెటో పోర్చుగల్ తరపున ఏడవ పెనాల్టీని గోల్ చేశాడు. ఇదే సమయంలో ఏంజెలో కాండిడో బ్రెజిల్ తరపున గోల్ చేయడంలో విఫలమయ్యాడు. దీంతో పోర్చుగల్ తన మొట్టమొదటి అండర్ 17 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుంది.

# టెస్టులో విజయం దిశగా సౌతాఫ్రికా

### 522 రన్స్ వెనుకబడిన టీమిండియా






**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం దిశగా దూసుకువెలుతోంది. 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (2), కుల్దీప్‌యాదవ్ (4) లు క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించడానికి ఆఖరి రోజు 8 వికెట్లు అవసరం కాగా భారత్ గెలవాలంటే 522 పరుగులు చేయాల్సి ఉంది. 549 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓ సిక్స్, ఓ ఫోర్ కొట్టి ఊపుమీద కనిపించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ 13 రన్స్‌కే ఔట్ అయ్యాడు. మార్కో జాన్సెస్ బౌలింగ్ షాట్‌కు యత్నించగా బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో భారత్ 17 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయింది. ఇక మరికాసేపటికే ఆరంభం నుంచి ఇబ్బంది పడుతున్న కేఎల్ రాహుల్ (6) స్పిన్నర్ సైమన్ హార్మర్ చేతిలో క్లీన్ బౌల్డ్ అయ్యాడు.

దీంతో భారత్ 22 రన్స్‌కు 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. నైట్ వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్‌తో కలిసి వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ మరో వికెట్ పడకుండా రోజును ముగించారు. అంతకముందు నాలుగో రోజు 26/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 5 వికెట్ల నష్టానికి 260 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సఫారీ బ్యాటర్లలో ట్రిస్టన్ స్టబ్స్ (94) తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. టోని డి జోర్జి (49), రికెల్‌టన్ (35), వియాన్ ముల్డర్ (35 నాటౌట్) రాణించారు. భారత్ బౌలర్లలో రవీంద్ర జడేజా 4 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్ పడగొట్టాడు. కాగా ఈ మ్యాచ్‌లలో మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగులు చేసింది. ఆ తరువాత భారత్ 201 పరుగులకు ఆలౌటైంది. దీంతో 288 పరుగుల ఆధిక్యం సఫారీలకు లభించింది.

### టి20 వరల్డ్ కప్‌లో

# పాక్‌తో భారత్ బిగ్ ఫైట్

### ఫిబ్రవరి 15న దాయాదుల పోరు




**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై జరగనున్న టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, పాకిస్థాన్ మధ్య మరోసారి బిగ్ ఫైట్ జరగనుంది. ఫిబ్రవరి 15న ఈ హై వోల్టేజ్ మ్యాచ్ మ్యాచ్ శ్రీలంక వేదిక కాబోతోంది. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్ ఖరారైంది. తొలిసారి ఈ మెగా టోర్నీకి అర్హత సాధించిన 20 టీముల్లో భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్, యూఎస్ఏ, వెస్టిండీస్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఐర్లాండ్, కెనడా, ఇటలీ, నెదర్లాండ్స్, జింబాబ్వే, నమీబియా, ఒమన్, నేపాల్, యూఏఈ ఉన్నాయి. ఐదు జట్లు 4 గ్రూప్ లుగా విభజించబడతాయి. తొలి 2 స్థానాల్లో నిలిచిన జట్లు తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. సూపర్8లో మొత్తం 8 జట్లు 4 జట్లతో రెండు గ్రూప్‌లుగా విభజించబడతాయి. ఒక్కో జట్టు మిగిలిన టీముతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. నాలుగింటిలో టాప్2 లో ఉన్న జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో ఇండియా, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. వీటితో పాటు, యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ కూడా ఇందులో ఉన్నాయి. పాకిస్థాన్ తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకలోని ఆడనుంది. టీమిండియా షెడ్యూల్ చూస్తే ఫిబ్రవరి 7న ప్రారంభ మ్యాచ్ లో యూఎస్ఏ తో తలపడుతుంది. ముంబై వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుంది. ఫిబ్రవరి 12 న నమీబియాతో ఢిల్లీ వేదికగా, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో ఫిబ్రవరి 15న కొలంబోలో, లీగ్ దశలో చివరి మ్యాచ్ నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్ వేదికగా ఆడనుంది. సూపర్8కు అర్హత సాధిస్తే వరుసగా మూడు మ్యాచ్‌లు అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా వేదికలుగా జరుగుతాయి. భారత జట్టు సెమీ ఫైనల్ కు వస్తే ముంబైలో, ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లో ఆడనుంది.

# ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి రిలయన్స్




**ముంబయి, నవంబరు 25:** భారత స్టాక్ మార్కెట్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు రికార్డులు సృష్టిస్తున్నాయి. దేశంలోనే అత్యంత విలువైన ఈ కంపెనీ షేరు, మంగళవారం ట్రేడింగ్‌లో ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికిచేరి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. ఈ ర్యాలీతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 21 లక్షల కోట్లకు చేరింది. ఈరోజు ఉదయం ట్రేడింగ్‌లో రిలయన్స్ షేరు దాదాపు 2 శాతం లాభపడి, ఇంట్రాడేలో రూ. 1559.60 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఇదే ఈ షేరుకు 52 వారాల గరిష్ఠ ధర కూడా కావడం విశేషం. ఈ స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర రూ. 1114.85 కాగా, అక్కడి నుంచి సుమారు 40 శాతం మేర వృద్ధి చెందింది. రిలయన్స్ షేరు తాజా ర్యాలీకి ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ జెపి మోర్గాన్ ఇచ్చిన నివేదికే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జెపి మోర్గాన్ ఈ స్టాక్‌కు ఓవర్‌వెయిట్ రేటింగ్ ఇచ్చింది. అంతేకాకుండా ప్రస్తుత ధర నుంచి 11 శాతం అధికంగా రూ. 1727 టార్గెట్ ధరను అంచనా వేసింది. ఈ సానుకూల నివేదికతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు ఇటీవల వెలువడిన రెండో త్రైమాసిక (క్యూ2) ఫలితాల్లో కంపెనీ నికర లాభం 9.6 శాతం పెరగడం కూడా షేరుకు కలిసొచ్చింది. గత కొంతకాలంగా ఈ షేరు నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 27 శాతం, గత ఐదేళ్లలో 60 శాతానికి పైగా లాభాలను అందించింది.

# రెపోరేట్లు తగ్గుతాయన్న సంకేతాలు!



**ముంబయి, నవంబరు 25:** రుణ గ్రహీతలకు త్వరలో శుభవార్త అందే సూచనలు కనిపిస్తున్నాయి. వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని భారత రిజర్వుబ్యాంకు (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. రెపో రేటు కోతకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కీలక సంకేతాలిచ్చారు. అక్టోబర్‌లో జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలోనే భవిష్యత్ రేట్ల కోతపై సూచనలు ఇచ్చామని, ఆ తర్వాత వెలువడిన స్థూల ఆర్థిక గణాంకాలు కూడా సానుకూలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా, అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతం వద్ద రికార్డు కనిష్టానికి చేరడం రేట్ల తగ్గింపునకు మార్గం సుగమం చేస్తోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆహార పదార్థాల ధరలు తగ్గడం, వినియోగ వస్తువులపై పన్నుల కోత వంటివి ఇందుకు దోహదపడ్డాయి. 2025 ప్రథమార్ధంలో ఎంపిసి రెపో రేటును 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి దాన్ని స్థిరంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల (డిసెంబర్)లో జరగనున్న కమిటీ సమావేశంలో రేట్ల కోతపై తుది నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ వెల్లడించారు. ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతంగా ఉంది. ఒకవేళ డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తే అది 5.25 శాతానికి చేరుతుంది. అదే జరిగితే గృహ, వాహన, ఇతర రుణాలపై ఇఎంఐల భారం గణనీయంగా తగ్గుతుంది. ఆర్బీఐ గవర్నర్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వ పదేళ్ల బాండ్ల రాబడులు నాలుగు పాయింట్లు తగ్గి 6.48 శాతానికి చేరాయి.



# లేఆఫ్‌ల బాటలో యాపిల్ కూడా!

**శాన్‌ఫ్రాన్సిస్కో, నవంబరు 25:** ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్నాలజీ కంపెనీ యాపిల్ తన గ్లోబల్ సేల్స్ ఆపరేషన్స్‌లో డజన్లకొద్దీ ఉద్యోగాలను తొలగించింది. సాధారణంగా భారీ లేఆఫ్స్‌కు దూరంగా ఉండే యాపిల్‌లో ఈ పరి ణామం అత్యంత అరుదు అని చెపుతున్నారు. రెండు వారాల్లో ప్రభావిత ఉద్యోగులకు యాజమాన్యం సమాచారం అందించినట్లు వార్తలు వెలువడ్డాయి. ప్రధానంగా కార్పొరేట్ సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ ఏజెన్సీలతో పనిచేసే సేల్స్ బృందాలపై ఈ కోతల ప్రభావం పడింది. వీరితో పాటు, కొత్త కస్టమర్లకు ఉత్పత్తి డెమోలు ఇచ్చే బ్రీఫింగ్ సెంటర్ల సిబ్బందిని కూడా తొలగించారు. అయితే, మొత్తం ఎంతమందిని తొలగించారనే దానిపై కంపెనీ స్పష్టతను ఇవ్వ లేదు. ఈ విషయంపై యాపిల్ స్పందిస్తూ తమ కార్పొరేట్ సేల్స్ నిర్మాణాన్ని పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు ధ్రువీకరించింది. మరింత ఎక్కువ మంది కస్టమర్లతో అనుసంధానం కావడానికి, మాసేల్స్ బృందంలో కొన్నిమార్పులు చేస్తున్నాం. దీనివల్ల తక్కువసంఖ్యలో ఉద్యోగాలపై ప్రభావం పడుతుంది. మేము నియామకాలు కొనసాగిస్తున్నాం. ప్రభావితమైన ఉద్యోగులు కొత్త పాత్రలకు దరఖాస్తు చేసుకోవచ్చని యాపిల్ ప్రతినిధి ఒకరు తెలిపారు. తొలగించిన వారిలో 20నుంచి 30 ఏళ్ల అనుభవం ఉన్న మేనేజర్లు కూడా ఉన్నారు. ఉద్వాసనకు గురైన వారు జనవరి 20లోగా కంపెనీలో మరో ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉంటుంది, లేదంటే సెవరెన్స్‌తో పాటు వారిని విధులనుంచి తొలగిస్తారు. ఒకవైపు రికార్డు స్థాయిలో దాదాపు 140 బిలియన్‌డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తూనే, యాపిల్ ఈనిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగామారింది. అమెజాన్, మెటా వంటి ఇతర టెక్ దిగ్గజాలు కూడా ఇటీవల ఉద్యోగాల కోతలు ప్రకటించిన నేపథ్యంలో యాపిల్ కూడా అదే బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది.

### జిడిపిలో 6%కి కుటుంబీకుల

# ఆదాయ వనరులు

### 2025లో రూ.9.9 లక్షలకోట్లు అని ఆర్థికశాఖ అంచనా




**న్యూఢిల్లీ, నవంబరు 25:** దేశంలో కుటుంబీకుల ఆదాయం ఇప్పటివరకూ ఉన్న పరిస్థితులను పరిశీలిస్తే రూ.9.9 లక్షలకోట్లుగా ఉంది. అంటే జిడిపిలో 6శాతంగా ఉన్నట్లు అంచనా. అంతకుముందు సంవత్సరంలో 5.3శాతంగా ఉన్న ఈ రాబడులు ఈఏడాది గణనీయంగా పెరిగాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఇక కుటుంబాల్లో నెలకొన్న ఆర్థిక రుణాలు కూడా గత ఏడాదితో చూస్తే గణనీయంగా తగ్గాయన్నారు. మొత్తంగా 2025 ఆర్థిక సంవత్సరంలో 15.7 లక్షలకోట్ల వ్యయాలుమాత్రమే ఉన్నట్లు తెలిపారు. నికరంగా కుటుంబాల్లో ఆస్తులు 9.9 లక్షలకోట్లకు పెరిగినట్లు తేలింది. రెండేళ్లక్రితం కుటుంబాల్లో ఉన్న పొదుపు జిడిపిలో 4.9శాతంగా నమోదయ్యాయి. 1970 తర్వాత అత్యంత తక్కువస్థాయిలో గృహవాసుల్లో పొదుపు నమోదుకావడం ఇదే తొలిసారి. అలాగే ఇక కుటుంబీకుల్లో రుణభారం కూడా అంతకుముందు త్రైమాసికంలో రూ.18.8 లక్షలకోట్లవరకూ ఉంటే అదికాస్తా జిడిపిలో 4.7శాతానికి తగ్గింది. అంటే 15.7 లక్షలకోట్లుగా ఉంది. వీటన్నింటిని పరిగణనలోనికి తీసుకుని పరిశీలిస్తే రుణభారం గణనీయంగా 16 శాతంనుంచి 12శాతానికి తగ్గినట్లు తెలుస్తోంది. అరక్షిత, రిటైల్‌రుణాల్లో నిబంధనలు కఠినతరం చేయడం కూడా ఇందుకు ఒకకారణంగా చెప్పుకోవచ్చు. ఇక బంగారం తనఖా రుణాలు మాత్రం పెరుగుతున్నాయి. అత్యధికంగావేగంగా లభించే రుణసదుపాయం కావడంతో కుటుంబీకులు బంగారంపై తాకట్టురుణాలకు ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. ఇక మార్కెట్ అనుసంధానిత ఉత్పత్తులపరంగా చూస్తే కుటుంబీకుల ఆర్థికవనరుల్లో 15.1శాతంగా ఉన్నాయి. గత ఏడాది 8.7శాతంగాను, 2023లో 7.3శాతంగాను నమోదయ్యాయి. దీన్నిబట్టిచూస్తే గృహవాసులకు మూలధన మార్కెట్లపై విశ్వాసం పెరుగుతోంది. అదే సమయంలో బ్యాంకు డిపాజిట్ల వాటా కూడా 35.2శాతం తగ్గింది. తక్కువ రిటర్నులు ఇచ్చే సాంప్రదాయ పొదుపు పథకాలనుంచి డిపాజిటర్లు బదలీ కావడమే ఇందుకు మూలం.

# నిరుద్యోగ సమస్యకు కొత్త కార్మికచట్టాలతో పరిష్కారం



### ఎస్బీఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ,నవంబరు 25:** నిరుద్యోగ సమస్యకు అమలులోకి వచ్చిన కార్మిక చట్టాలు పరిష్కారం చూపే అవకాశం ఉందని భారతీయ స్టేట్‌బ్యాంకు రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈచట్టాల అమలుతో నిరుద్యోగం 1.3 శాతం వరకు తగ్గి, దాదాపు 77 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయని తాజాగా విడుదల చేసిన నివేదికలో అంచనావేసింది. ఈ ఉపాధి కల్పనతో పాటు వినియోగం కూడా భారీగా పెరగనుందని ఎస్‌బిఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఒక్కో వ్యక్తి రోజువారీ వినియోగం రూ.66 పెరిగి, దేశవ్యాప్తంగా వినియోగ వ్యయం సుమారు రూ.75,000 కోట్లకు చేరుకుంటుంది. ఇది వినియోగానికి పెద్ద మద్దతునిస్తుందని ఆయన వివరించారు. దేశంలో 44 కోట్లమంది అసంఘటిత రంగంలో పనిచేస్తుండగా, వీరిలో 31 కోట్ల మంది ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదయ్యారు. కొత్త చట్టాల వల్ల వీరిలో కనీసం 20 శాతం మంది, అంటే దాదాపు 10కోట్ల మంది సంఘటిత రంగం లోకి మారతారని నివేదిక అంచనా వేసింది. దీంతో దేశంలో సంఘటిత రంగ కార్మికుల వాటా 60.4 శాతం నుంచి 75.5 శాతానికి పెరుగుతుందని పేర్కొంది. రాబోయే 23 ఏళ్లలో సామాజిక భద్రత పరిధి 8085 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం 2019,2020 సంవత్సరాల్లో పార్లమెం టులో ఆమోదించిన నాలుగు కార్మిక కోడ్‌లను ఈ నెల 21నుంచి అమలులోకి తెచ్చిన విషయం తెలి సిందే. ఈ సంస్కరణలు కార్మికులు, యాజమా న్యాలు ఇద్దరికీ సాధికారత కల్పిస్తాయని, తద్వారా దేశం మరింత పోటీతత్వంతో స్వావలంబన దిశగా పయనిస్తుందని నివేదిక అభిప్రాయపడింది.

# మూడోరోజూ మార్కెట్లకు తప్పని నష్టాలు!



**ముంబయి, నవంబరు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా మూడోరోజు కూడా స్వల్ప నష్టాలతో గట్టెక్కాయి. నెలవారీ డెరివేటివ్స్ కాల పరిమితి ముగుస్తుండటం, రూపాయి కొంతమేర మెరుగుపడటం వంటివి మార్కెట్లలో అమ్మకాలకు బీజంవేసాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 313.70 పాయింట్లు క్షీణించి 84,587.01 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 50 సూచీ 74.70 పాయింట్లు క్షీణించి 25,884.80 పాయింట్లుగా ట్రేడింగ్ ముగించింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.22శాతం, నిఫ్టీ 1.17 శాతం క్షీణిం చాయి. ఆదాని సంస్థలు 2.71శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.92శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.73 శాతం నష్టపోయాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.19శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.20శాతం వరకూ పెరుగుదల సూచించింది. మార్కెట్లపరంగా చూస్తే బిఎస్ఇలో 2095 కంపె నీల షేర్లు పెరిగాయి. 2076 కంపెనీలు కొంతమేర క్షీణించాయి. 171 కంపెనీలషేర్లు మాత్రం స్థిరంగా కొనసాగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.54శాతం క్షీణించి 6.490కి చేరాయి. విదేశ ఈ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 89.18వద్ద మారకం నడిచింది. ఎంసి ఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదో తేదీనాటికి 0.87శాతంగా పెరిగి 1,24,927కి చేరింది. ఇక అమెరికా పదేళ్ల బాండ్లుకూడా 0.17 శాతం పెరిగి 4.028గా నడిచింది. ఇక స్టాక్స్ పరంగాచూస్తే ముత్తూట్ మైక్రోఫిన్ 5.95శాతంగా ఉంది. భారత్ ఎలక్ట్రానిక్స్ కూడా 1.57శాతంగా ఉంది. మాక్స్ ఇండియా 2.41శాతంగా పెరిగితే ఏసిఎంఇ సోలార్ హోల్డింగ్స్ 1.67శాతంగా ఉంది. తెఇఒలయ రోష్ని 1.91శాతం పెరిగింది. అలాగే స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్స్ 3.29శాతం పెరిగింది. కంపెనీకి కొత్త ఎండి రాక కూడా కొంత మద్దతునిచ్చింది. గ్లెన్‌మార్క్ ఫార్మాక్యూటికల్స్ 2.10శాతంగా ఉంది. డెస్కో ఇన్‌ఫ్రాటెక్ 5.39 శాతం ర్యాలీతీసింది. వన్‌పాయింట్‌వన్ సొల్యూ షన్స్ మూడుశాతం పెరిగాయి. ఇక ఐపిఒల పరంగాచూస్తే సుదీప్‌ఫార్మా అంచనాలకు మించి బిడ్లు రాబట్టింది. 98,72,92,575 షేర్లకు బిడ్లు వచ్చినట్లు ప్రకటించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14